RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

28 డిసెంబర్ 2024 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:179

## ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేసిన మన్మోహన్ సింగ్: ప్రధాని మోడీ



న్యూ ఢిల్లీ ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి ప్రధాని నరేంద్ర మోడీ నివాళులర్పించారు. మన్మోహన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మోడీ మీడియాతో మాట్లాడారు. ఆర్‌బిఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో సేవలందించారని కొనియాడారు. పివి హయాంలో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారని, దేశం, ప్రజలపట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినదని మోడీ ప్రశంసించారు. విలక్షణ పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలు అందించారని, ఎన్నోకీలక పదవులు అధిష్టించినా సాధారణ జీవితం గడిపారన్నారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడానని, తన తరపున, దేశ ప్రజల తరపున శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని మోడీ స్పష్టం చేశారు.

## అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా



హైదరాబాద్ డిసెంబర్ 27 : నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణను నాంపల్లి కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి పోలీసులు సమయం కోరారు. సంధ్య థియేటర్ ఘటనలో నాంపల్లి కోర్టులో జరిగిన విచారణకు వర్చువల్‌గా అల్లు అర్జున్ హాజరయ్యారు. విచారణను జనవరి 10కి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. గతంలో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. రిమాండ్ గడువు ముగియడంతో కోర్టు ముందుకు అల్లు అర్జున్ హాజరయ్యారు. డిసెంబర్ 4న ఆర్ టిసి క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్ లో పుష్ప 2 సినిమా విడుదల కావడంతో పాటు హీరో అల్లు అర్జున్ అక్కడికి రావడంతో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే.

## మన్మోహన్ సింగ్‌కు కేంద్ర కేబినెట్ ఘన నివాళి - నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 27మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను కేంద్ర ప్రభుత్వం శనివారం అధికారిక లాంఛనాలతో రాజ్‌ఘాట్ సమీపంలో నిర్వహించనుంది. అంతిమ యాత్ర ఉదయం 9.30 గంటలకు ఏఐసీసీ ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమౌతుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.ప్రస్తుతం మన్మోహన్ సింగ్ పార్థివ దేహం మోతీలాల్ నెహ్రూ రోడ్డులోని ఆయన నివాసంలో ఉంది. శనివారం ఉదయం వరకు ప్రజలు అక్కడి వచ్చి నివాళులు అర్పించవచ్చు. డిసెంబర్ 28న అంటే శనివారం ఉదయం 8 గంటలకు ఆయన భౌతిక కాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్తాం. అక్కడ ఉదయం 8.30 నుంచి 9.30 మధ్య ప్రజలు, పార్టీ కార్యకర్తలు నివాళులు అర్పించేందుకు అవకాశం ఇస్తాం. 9.30 గంటల తరువాత అక్కడి నుంచి శ్మశాన వాటికకు మన్మోహన్ సింగ్ అంతిమ యాత్ర మొదలవుతుంది" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.

**ఘన నివాళులు**

అనారోగ్య సమస్యలతో దిల్లీ ఎయిమ్స్‌లో గురువారం రాత్రి తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్థివదేహాన్ని ఆయన నివాసానికి తరలించారు. ఈ ఉదయం పలువురు ప్రముఖులు మన్మోహన్ నివాసానికి చేరుకొని ఆయన భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించారు.

**కాంగ్రెస్ పుష్పాంజలి**

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సహా పలువురు పార్టీ నేతలు మన్మోహన్ సింగ్ భౌతికఖాయం వద్ద పుష్పాంజలి ఘటించారు. మన్మోహన్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు కేంద్రమంత్రులు, వివిధ రాజకీయపార్టీల ముఖ్యనేతలు, ముఖ్యమంత్రులు కూడా మన్మోహన్ నివాసానికి చేరుకొని ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు.సెల్యూట్

భారత సైన్యం తరపున సైనికాధికారులు మాజీ ప్రధానికి నివాళి అర్పించారు. మన్మోహన్ పార్థివదేహాన్ని ఉంచిన పేటికపై జాతీయ జెండా ఉంచి సెల్యూట్ చేశారు.గొప్ప రాజనీతిజ్ఞుడిని కోల్పోయాం – కేంద్ర **కేబినెట్**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల కేంద్ర కేబినెట్ శుక్రవారం సంతాపం తెలిపింది. మన్మోహన్ గొప్ప రాజనీతిజ్ఞుడని, విశిష్ట నాయకుడిని కొనియాడింది. ప్రధాని మోదీ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో, మాజీ ప్రధాని మృతికి సంతాప సూచికంగా 2 నిమిషాలు మౌనం పాటించారు. తరువాత సంతాప తీర్మానాన్ని ఆమోదించారు.

జనవరి 1 నుంచి 7 రోజులపాటు సంతాప దినాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా జాతీయ జెండాను అవనతం చేసింది. అంతేకాదు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలకు హాఫ్‌డే సెలవు ప్రకటించింది.

**గొప్ప స్నేహితుడిని కోల్పోయాం – ప్రపంచ దేశాలు**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై ప్రపంచ దేశాలకు చెందిన నేతలు సంతాపం తెలిపారు. మన్మోహన్‌ను ఒక ఛాంపియన్‌గా, దూరదృష్టి గల ఆర్థికవేత్తగా, భారతదేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా అభివర్ణించారు. తమ దేశాలతో భారత్‌కు ఏర్పడిన బంధంలో మన్మోహన్ సహకారాన్ని, స్నేహపూర్వక సంబంధాలను గుర్తు చేసుకున్నారు.

**మన్మోహన్ సింగ్ ఓ ఛాంపియన్ :** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపట్ల అమెరికా సంతాపం ప్రకటించింది. భారత దేశ ప్రజలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. భారత్ –అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య గొప్ప ఛాంపియన్లలో మన్మోహన్ ఒకరని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకన్ కొనియాడారు. గత రెండు దశాబ్దాల్లో భారత్–అమెరికా కలిసి సాధించిన ప్రగతిలో చాలా వాటికి మన్మోహన్ పునాది వేశారని అన్నారు. భారత్–అమెరికా మధ్య పౌర అణు సహకార ఒప్పందం ముందుకు తీసుకెళ్లడానికి మన్మోహన్ నాయకత్వం దోహదం చేసిందని తెలిపారు. భారత్‌లో ఆర్థిక సంస్కరణలు, వేగవంతమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించిన నేతగా మన్మోహన్‌ను గుర్తుంచుకుంటారని బ్లింకన్ పేర్కొన్నారు. భారత్ –అమెరికా మధ్య సంబంధాల బలోపేతానికి మన్మోహన్ సింగ్ చేసిన కృషి, అంకిత భావాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామని పేర్కొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఘన నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి





న్యూఢిల్లీ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ భౌతికకాయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి నివాళులు అర్పించారు. అయన వెంట , ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్. సంపత్ కుమార్, తెలంగాణ కాంగ్రెస్ ఇన్చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాంనాయక్, అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, తదితరులు ఉన్నారు.

## ఇంతింతై... వటుడింతై...

వార్తా 6 లో

## మాదాపూర్ లో రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి





హైదరాబాద్ గురువారం అర్ధ రాత్రి మాదాపూర్ అయ్యప్ప సొసైటీ 100 ఫీట్ రోడ్డు లో డివైడర్ ని ఢీ కొని ఇద్దరు యువకులు మృతి చెందారు. యువకులు సాఫ్ట్వేర్ ఉద్యోగులు. హైదరాబాద్ లో ఆకాష్ ఉద్యోగం చేయగా రఘు బాబు బెంగుళూరు ఉద్యోగి. ఈ మేరకు పోలీసులు కేస్ నమోదు చేసుకొని మృత దేహాలను ఆసుపత్రి కి తరలించారు

# సంస్కరణల సాధకుడికి ఘన నివాళి

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి బాధాకరం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ ప్రజాబలం ప్రతినిధి:భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం చాలా బాధాకరం అన్ని నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం అన్నారు, శుక్రవారం నాడు నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్ నందు వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనమైన నివాళులర్పించారు..

ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ చెవుగోని రజిత – శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల–మాధవ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నకిరేకంటి ఏసుపాదం, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ :–





భారత దేశ మాజీ ప్రధాని, డాక్టర్ మన్మోహన్ సింగ్ భారతదేశంలో అత్యంత గౌరవనీయులైన నేతల్లో ఒకరని పేర్కొన్నారు.గొప్ప ఆర్థిక శాస్త్రవేత్తగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ఆర్థిక వ్యూహాన్ని మారుస్తూ దేశాన్ని గ్లోబల్ మార్కెట్‌లోకి చేర్చడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. 2004 నుంచి 2014 వరకు రెండు పదవీ కాలాల్లో భారత ప్రధానమంత్రిగా విశిష్ట సేవలందించారని తెలిపారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం సమయంలోనూ... ఆయన ఆర్థిక నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టాయని తెలిపారు. అలాంటి మహనీయున్ని దేశం ఈరోజు కోల్పోయిందని వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు..

ప్రజాబలం

28 డిసెంబర్ 2024 శనివారం

# భారత శిక్షా స్మృతి సృష్టి కర్త మెకాలే

లార్డ్ మెకాలే ... ఈ పేరు వినగానే వెంటనే స్ఫురణకు వచ్చేది భారత దేశంలో ఆంగ్ల విద్యకు పునాది వేసిన వ్యక్తి. కానీ చాలా మందికి తెలియని విషయం... మెకాలే భారత శిక్షా స్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ 1860) సృష్టికర్త అని. ఆయన లా కమిషన్ ఛైర్మన్ గా నేటికీ చెక్కుచెదరని మూల రూపం గల ఐ పి సి చిత్తు ప్రతి తయారు చేయబడిందని. 19వ శతాబ్దపు కవి, చరిత్రకారుడు, రాజనీతివేత్త, లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే, ఫస్ట్ బేరన్ మెకాలే పి.సి. (1800 అక్టోబరు 25 .. 1859 డిసెంబర్ 28) వర్ధంతి సందర్భంగా, ఇండియన్ పీనల్ కోడ్ పూర్వా పరాలను తెలుసుకుందాం. 1830కి ముందు, భారతదేశంలో, 'ది ఇంగ్లీష్ క్రిమినల్ లా', అనేక చట్ట సవరణలతో, నాటి ప్రెసిడెన్సీ టౌన్లు.. బొంబాయి, కలకత్తా, మద్రాసులలో అమలు జరిగేది. లార్డ్ మెకాలే, నాటి "ఫ్రెంచి పీనల్ కోడ్", "లివింగ్‌స్టోన్స్ కోడ్ ఆఫ్ లూసియానా" అనే రెండు ప్రామా ణిక గ్రంథాలను ఆదర్శంగా తీసు కుని, ఇండియన్ పీనల్ కోడ్ 'చిత్తుప్రతి'ని తయారు చేసాడు. భారతీయుల ప్రామాణిక గ్రంథాలైన మనుస్మృతి ని, యాజ్ఞవల్క్య స్మృతిని, నాటి వైదిక పండితుల సలహా, సహాయం కూడా తీసు కున్నాడు. శిక్షల విషయంలో, ఆ నాటి పెద్దలు, పండితులు, రాజులు అభిప్రాయాలను కూడా లెక్కలోకి తీసుకున్నాడు. లార్డ్ మెకాలే మహా మేధావి అయినా, తన అభిప్రాయా ల కంటే, నాటి భారత దేశ మత, సాంఘిక, సామాజిక వ్యవస్థలకు, ఆచార వ్యవహారాలకు విలువ ఇచ్చి, వారి అభిప్రాయాలను గౌర వించి, తన మేధస్సుతో 'ఇండియన్ పీనల్ కోడ్' చిత్తుప్రతి తయారు చేశాడు. ఇండియన్ పీనల్ కోడ్ 1837 లోనే నాటి గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండి యా ఇన్ – కౌన్సిల్ కి నివేదించినా, 1860 సంవత్సరం వరకూ అది వెలుగు చూడలేదు. లార్డ్ మెకాలే తయారుచేసిన 'చిత్తు ప్రతి' ని, నాటి ఛీఫ్ జస్టిస్ సర్ బార్నెస్ పీకాక్, కలకతా సుప్రీమ్ కోర్టు న్యాయాధిపతి (ఇతను నాటి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు కూడా) సునిశితంగా, సుదీర్ఘంగా, పరిశీ లించి, పరీక్షించాడు. అయన సుదీర్ఘ పరిశీలన తర్వాత ఇండి యన్ పీనల్ కోడ్ 1860 అక్టోబరు 6 నాడు చట్టసభ ఆమోదం పొందింది. ఇండియన్ పీనల్ కోడ్ మూలాలు 1860 నాటి ఆంగ్లేయుల వలస పాలనలో (బ్రిటిష్ ఇండియా) ఉన్నాయి. 1860 నాటి బ్రిటిష్ ఇండియా చేసిన 45వ చట్టం ద్వారా ఇండియన్ పీనల్ కోడ్ అమలులోకి వచ్చింది. మొట్ట మొదటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి 1860 లో, మొదటి లా కమిషన్ అజమా యిషిలో జరి గింది. మొదటి లా కమిషన్ ఛైర్మన్ లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే). మొదటి ఇండియన్ పీనల్ కోడ్ 1862 సంవత్సరంలో, అమలులోకి వచ్చింది. నాటినుంచి ప్రపంచం లోను, భారతీయ సమాజాల లోను, విద్యాపరంగా, వైజ్ఞానికంగా, అనేక రంగాలలో,అనేక రకాలుగా జరిగిన సమస్తమైన మార్పుల ప్రాతిపదికగా భారతీయ శిక్షాస్మృతి అనేకమైన మార్పులు, చేర్పులకు గురి అవుతూ, నేటి రూపాన్ని పొందింది. అందుకు గృహ హింస సెక్షన్ 498–ఎ ఒక ఉదాహరణగా తీసుకో వచ్చు. మన భారతీయ శిక్షాస్మృతి లో 511 సెక్షన్లు ఉన్నాయి. వరకట్నం చట్టాలు మరో ఉదా హరణ. వరకట్న సమస్య, ఐరోపా, అమెరికా దేశాలలో లేదు కాబట్టి, వరకట్న చట్టాలు, శిక్షలు వారి శిక్షాస్మృతిలో లేవు. పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత, ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతథంగా పాకిస్తాన్ తన దేశంలో అమలు చేసింది. దాని పేరు "పాకిస్తాన్ పీనల్ కోడ్" (పి.పి.సి). బంగ్లాదేశ్ కూడా "బంగ్లాదేస్ పీనల్ కోడ్" పేరుతో అమలు చేసింది. బ్రిటిష్ వలస దేశాలైన, మియన్మార్ (నాటి బర్మా), శ్రీలంక (నాటి సిలోన్), మలేసియా, సింగపూర్, బ్రూనీ దేశాలు కూడా ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతథంగా అమలు చేస్తున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్ జమ్ము కాశ్మీర్లో కూడా అమలు లో ఉంది. కానీ, ఈ రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్ అనరు. "రన్‌బీర్ పీనల్ కోడ్" (ఆర్.పి.సి) అని పిలుస్తారు.ఇండియన్ పీనల్ కోడ్ సృష్టికర్త లార్డ్ మెకాలే, 1859 డిసెంబరు 28 న, తన 59వ ఏట, మరణించిన క్రమంలో తన కృషి సాకారమై,చట్టమై, అమలు జరగటం చూడనే లేదు.నాటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి, మూల రూపం, నేటికీ చెక్కు చెదరలేదు. దీనిమీద కొన్ని విమర్శలు ఉన్నప్పటికీ, ఈ నాటికీ, న్యాయశాస్త్రంలో, దీనికి తిరుగు లేదు. 161 ఏళ్లల్లో మార్పులు ఎన్ని వచ్చినా, శిక్షాస్మృతి చెక్కు చెదరకుండా ఉన్నది అంటే, మెకాలే దూరదృష్టి అమోఘం. మేధస్సు అద్భుతం. ఆయన కృషి అనితర సాధ్యం.

# పిసాతోనే గిరిజన సాధికారత

ఐదవ షెడ్యూల్ ప్రాంతం పరిధిలోని భూములు, సహజ వనరులు, అటవీ సంపదతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక, అక్రమ మైనింగ్, భూగర్భగనులు, సంఘాలు, వ్యాపారాలు, ఇతరత్రా అభివృద్ధి కార్యాక్రమాలన్నీ పిసా చట్టం ప్రకారం పూర్తి ఆదివాసీలతో నిండిఉన్న గ్రామసభ ఆమోదం తప్పనిసరిగా ఉండాలి అదే చట్టబద్ధత. షెడ్యూల్ ప్రాంతాలలో నివసించే ప్రజలు గ్రామసభల ద్వారా స్వయం పాలనకు భారత ప్రభుత్వం రూపొందించిన షెడ్యూల్ ప్రాంతాలకు పంచాయతీ విస్తరణ (పెసా) చట్టం 1996 డిసెంబరు 24వ తేదీన అమలులోకి వచ్చింది. ఐదవ షెడ్యూల్ ప్రాంతాలలో నివసించే ప్రజలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి, పార్లమెంటు రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ఎం(4) (బి) ప్రకారం 'పంచాయతీల నిబంధనల (షెడ్యూల్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టాన్ని 1996లో రూపొందించింది. పిసా రాజ్యాంగంలోని %×ঌ% భాగాన్ని పంచాయితీలకు సంబంధించి, ఐదవ షెడ్యూల్ ప్రాంతాలకు, కొన్ని మార్పులు, మినహాయింపులతో విస్తరించడం. ఐదవ షెడ్యూల్ ప్రాంతాలను కలిగి ఉన్న రాష్ట్రాలు ఈ ప్రాంతాల కోసం పంచాయతీ చట్టాలను రూపొందించడానికి అధికారం కలిగి ఉన్నాయి. పంచాయతీల నిబంధనలు (షెడ్యూల్ ప్రాంతాలకు పొడిగింపు), చట్టం 1996 (పిసా), ఐదవ షెడ్యూల్‌లోని పంచాయితీలకు సంబంధించిన రాజ్యాంగంలోని %×ঌ% భాగం యొక్క నిబంధనల పొడిగింపుకు సంబంధించిన అన్ని చట్టాలను రూపొందించడానికి రాష్ట్ర శాసనసభలకు అధికారం ఇవ్వబడింది. ప్రాంతాలు, చట్టంలోని సెక్షన్ 4లో అందించబడిన మినహాయింపులు, సవరణలకు లోబడి ఉంటాయి. పిసా అనేది పంచాయితీలకు సంబంధించిన రాజ్యాంగంలోని %×ঌ%లోని పార్ట్‌లోని నిబంధనలను షెడ్యూల్ ప్రాంతాలకు పొడిగించడానికి కల్పించే చట్టం. ఈ చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం షెడ్యూల్ ప్రాంతాలు అంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 244లోని క్లాజ్ (1)లో సూచించిన షెడ్యూల్ ప్రాంతాలు. ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణలు తమ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టాల ప్రకారం తమ రాష్ట్ర పిసా నిబంధనలను రూపొందించి నోటిఫై చేశాయి. పిసా చట్టం, అటవీ ప్రాంతాల్లోని అన్ని సహజ వనరులకు సంబంధించి నియమాలు, నిబంధనలపై నిర్ణయం తీసుకునేందుకు గ్రామసభలకు అధికారం ఇస్తుంది. పిసా చట్టం గిరిజన ప్రజలు నివసించే అటవీ ప్రాంతాల నుండి సహజ వనరుల ప్రయోజనాలను పొందేందుకు మరిన్ని రాజ్యాంగ హక్కులను ఇస్తుంది. 1996 పిసా చట్టం సెక్షన్ 4(ఎ)(బి)(డి)(ఇ)(ఎం–1) చట్టం ప్రకారం ఏజెన్సీ గ్రామాల్లో ఆదివాసీల ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలు, సామాజిక న్యాయం మతపరమైన పద్ధతులు, సామాజిక వనరుల నిర్వహణ, పరిరక్షణ, సాంప్రదాయ పద్ధతుల్లో వివాదాలు పరిష్కరించుకోవడానికి, అధికారాలను అమలు చేసుకోవడంతో పాటు లబ్ధిదారులను ఎంపిక చేసే అధికారం, రద్దు చేయడంలో అంతిమ అధికారాలు పిసా చట్టం ప్రకారం గ్రామసభకు మాత్రమే ఉంటుంది.

పిసా గ్రామసభ ఆమోదం, తీర్మానం అత్యంత కీలకమైనది. రాజ్యాంగంలోని 9వ భాగంలో పంచాయతీలకు సంబంధించి పొందుపరిచిన అంశాలను షెడ్యూల్ ప్రాంతాలకు వారి అవసరాలకి అనుగుణంగా వర్తింపచేయడం, షెడ్యూల్డ్ తెగల జనాభా కూటమికి స్వయం పాలన అవకాశాలు కల్పించడం, భాగస్వామ్య ప్రజాస్వామిక విధానం ద్వారా గ్రామ పరిపాలనను కొనసాగేలా చూడడం, గ్రామసభను అన్ని కార్యక్రమాలకు కేంద్రంగా చేయడం, షెడ్యూల్డ్ తెగల వారి సాంప్రదాయ ఆచారాలకు అనుగుణంగా ఉండే పాలనా కార్యచట్టాన్ని రూపొందించడం, షెడ్యూల్డ్ తెగల సమాజం సాంప్రదాయాలను, ఆచారాలను పరిరక్షించడం, వివిధ స్థాయిలలోని పంచాయతీరాజ్ వ్యవస్థలకు షెడ్యూల్డ్ తెగల అవసరాలకు అనుకూలమైన విధంగా వ్యవహరించటానికి అధికారాలను కల్పించడం, షెడ్యూల్ ప్రాంతాలలోని పంచాయతీరాజ్ కోసం రూపొందించే రాష్ట్ర శాసనాలు, సాంప్రదాయిక చట్టాలు, సామాజిక, మతపరమైన అలవాట్లు సాంప్రదాయక నిర్వహణ, సామాజిక వనరులు మొదలైన వాటికి అనుగుణంగా ఉండాలి. ప్రతి గ్రామసభ ప్రజల గ్రామ సాంప్రదాయాలను, ఆచారాలను, సాంస్కృతిక గుర్తింపును సమాజ వనరులను పరిరక్షించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. గ్రామ పంచాయతీలో సామాజిక ఆర్థిక ప్రణాళికలు, పథకాలు వాటి రూపకల్పన, అమలుకు సంబంధించిన విషయాలలో సమ్మతిని తెలియజేయాలి.గ్రామస్థాయిలో ప్రతి పంచాయతీ ప్రణాళికలు, పథకాలు, నిధుల వినియోగం కోసం గ్రామసభ సమ్మతిని పొందాలి. షెడ్యూల్ ప్రాంతాలలో భూమి ఆక్రమణను నిరోధించాలి. షెడ్యూల్ ప్రాంతాలలో అభివృద్ధి పథకాల కోసం భూమిని స్వాధీనం చేసుకునే ముందు సంబంధిత పంచాయతీని సంప్రదించాలి. సర్వోన్నత న్యాయస్థానం చాలా తీర్పులలో దీనిని వెల్లడించింది.

షెడ్యూల్ ప్రాంతాలలోని చిన్ననీటి వనరుల బాధ్యత పంచాయతీరాజ్ వ్యవస్థలకు అప్పగించాలి. షెడ్యూల్ ప్రాంతాలలోని గనులను, ఖనిజ వనరులను అద్దెకు ఇచ్చే ముందు తగిన స్థాయి పంచాయతీ లేదా గ్రామ సభ సిఫారసులు తప్పనిసరి.

అల్ప ప్రాధాన్యత కల్గిన గనులు లేదా ఖనిజాల తవ్వకానికి రాయితీలను వేలం ద్వారా మంజూరు చేయుటకు ముందస్తుగా గ్రామసభ సిఫారసులు తప్పనిసరిగా ఉండాలి. పాలక పక్షాలు పిసా చట్టం పకడ్బందీగా అమలు చేయడం ద్వారా గిరిజన వర్గాల సాధికారత మూలం అవుతుంది. ఇది ఆదివాసీ ప్రజల ముఖ్యమైన, కీలకమైన చట్టంగా భావించి దీనిని రాజ్యాంగంగా భావిస్తూ షెడ్యూల్ ప్రాంత పరిధిలోని పని చేస్తున్న ఉద్యోగులు, ప్రజలు పిసా చట్టానికి అనుగుణంగా ప్రవర్తించాలి. అప్పుడే ఈ చట్టం ఆశయం నెరవేరుతుంది, అప్పుడే ఆదివాసీ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

# అంతరించిపోతున్న చిత్ర కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రజ బలం ప్రతినిధి ఉప్పల్ డిసెంబర్ 27:రాష్ట్ర వ్యాప్తంగా ఉండే పెయింటింగ్ ఆర్టిస్టులను ప్రభుత్వం ఆదుకొని అంతరించిపోతున్న చిత్ర కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ పెయింటింగ్ ఆర్టిస్టు అండ్ వర్కర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యుడు ఓదేలు కోరారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద తెలంగాణ పెయింటింగ్ ఆర్టిస్టు అండ్ వర్కర్స్ అసోసియేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి పెయింటర్స్ ఆర్టిస్టులు, కళాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అంతరించిపోతున్న చిత్ర కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గతంలో గోడలపై రాసిన తమ రాతలతోనే ఎంతోమంది తలరాతలు మారి ప్రజాప్రతినిధులు అయ్యారని గుర్తుచేశారు. ఎంతోమంది రాజకీయ నేతల రాతలు మారడానికి పునాదిగా మారిన ఆర్టిస్టుల బతుకులు మార్చడానికి ఏ నాయకుడు పనిచేయలేదని అన్నారు. ఏ ప్రభుత్వం కూడా ఇంతవరకు తమను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం నుండి జారీ చేయబడే ప్రభుత్వ సంక్షేమ రంగాలకు సంబంధించిన పనులు లేదా నగర సుందరీకరణ పేరుమీద నేడు నగరంలో జరుగుతున్న పెయింటింగ్స్ వర్క్స్ ను ప్రభుత్వాలు దళారులకు, కాంట్రాక్టర్లకు ఇవ్వడం వలన పెయింటింగ్ కళాకారులు రోజువారి కూలీలుగా వారి కింద పని చేయాల్సిన దౌర్భాగ్య స్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇలాంటి పనులలో పెయింటింగ్ ఆర్టిస్టులను భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం తమను గుర్తించడానికి ఒక ఐక్య నినాదంతో, ఐక్య కార్యచరణతో ముందుకు వెళ్లడానికి ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు. చిత్ర కళాకారుడిగా తమ బాధలు తెలిసిన సీఎం రేవంత్ రెడ్డి తమను ఆదుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, విద్య, వైద్య పరంగా ఆదుకోవాలని కోరారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి నీ కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఈ సమావేశం లో సీనియర్ కళాకారులు రాజ్నాథ్, వాసు ఆర్ట్స్ వాసు,ఉదయ్ రాజ్ ఆర్ట్స్ మాతంగి ఓదెలు, తెలంగాణ వాల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామ్, తెలంగాణ చిత్రకళ బృందం అధ్యక్షులు జ్ఞానేశ్వర్,తెలంగాణ ఆర్టిస్ట్ సంక్షేమ కమిటీ అధ్యక్షులు రాజేశ్వర్,తెలంగాణ ఆర్టిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారాయణ, కార్యనిర్వకహన సభ్యులు సుధాకర్,సాయి,కంచర్ల బద్రి తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారం రాష్ట్రపతి నిలయం ఆవరణలో మిట్టి కేఫ్

×15 మంది మానసిక, శారీరక, ఆరోగ్య వైకల్యం కలిగిన వ్యక్తులచే నిర్వహణ×

×నూతనంగా నిర్మించిన రిసెప్షన్ సెంటర్ లో ఉచితంగా వసతి కల్పించిన అధికారులు×

×శీతాకాల విడిది సందర్భంగా మిట్టి కేఫ్ ను సందర్శించిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము×

× తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ చేయూత×



హైదరాబాద్ డిసెంబర్ 27 ;మనం నిత్యం వివిధ రకాల శారీరక, మానసిక ఆరోగ్య వైకల్యంతో బాధపడుతున్న వ్యక్తులను, వారి ఆలనా పాలనలో సతమత మవుతున్న తల్లిదండ్రులను చూస్తుంటాం. అటువంటి పిల్లలను చేరదీసి , వారు తమ కాళ్లపై తాము నిలబడి, ఆర్థికంగా స్వశక్తితో నిలదొక్కుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను, శిక్షణను అందించుటకు ఏర్పడిన స్వచ్ఛంద సంస్థయే "మిట్టి కేఫ్" మానసిక శారీరక ఆరోగ్య వైకల్యం కలిగిన వారి పట్ల సమాజం దృష్టికి తెచ్చి, స్పందింప జేయుటకు ఢిల్లీ లోని రాష్ట్రపతి భవన్, సుప్రీం కోర్టు కాంప్లెక్స్, పలు అంతర్జాతీయ విమానాశ్రయాలతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 40 కి పైగా స్థలాలలో లు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకురాలు స్వర్ణభ మిత్ర వివరించారు. ఈ అజీటవ లలో ప్రత్యేకంగా నెలకొల్పిన స్టాల్ నందు చే ఆధునిక శైలిలో చేతితో రూపొందించిన గృహ, కార్యాలయ అలంకరణ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు, నోటు పుస్తకాలు, పెన్నులు విక్రయిస్తున్నారు. సామాజిక దృక్పథంతో ఏర్పాటు చేస్తున్న ఆలోచనను గుర్తించి, వాటి నిర్వహణకు ఊఖీ కింద పలు ప్రభుత్వ రంగ , ప్రయివేట్ కార్పోరేట్ సంస్థలు, జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ఆర్థికంగా సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కేఫ్ లను పలువురు సెలబ్రిటీస్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. బొల్లారం లోని రాష్ట్రపతి నిలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన రిసెప్షన్ సెంటర్ భవనంలో రాష్ట్రపతి నిలయం అధికారులు ఉచితంగా కేటాయించిన స్థలంలో ను నెలకొల్పారు. 15 మంది మానసిక శారీరక ఆరోగ్య వైకల్యం కలిగిన వ్యక్తులు ఈ కేఫ్ ను స్వయంగా నడుపుతున్నారు. వీరికి నెలకు (వారు చేసే విధులను బట్టి) 15 వేల నుండి 50 వేల రూపాయల వరకు వేతనంగా అందుతుంది. ఆర్థిక స్వావలంబన, ఆత్మ గౌరవం తో జీవించుటకు , కుటుంబాన్ని నడుపుటకు మిట్టి కేఫ్ అండగా ఉంటున్నట్లు నిర్వాహకురాలు స్వాతి జి తెలిపారు. మిట్టి కేఫ్ నందు సమోసా, చాట్, పకోడీ, మసాలా టీ, బిస్కట్లు, కాఫీ, మాగి, శాండ్ విచ్, పలు రకాల ఐస్క్రీమ్స్, ఇతర చిరుతిండ్లు స్వయంగా నాణ్యతతో రుచికరంగా తయారు చేసి , విక్రయిస్తున్నారు. రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించటానికి వచ్చే పర్యాటకులు తమ షెడ్యుల్ లో మిట్టి కేఫ్ ను కూడా చేర్చుకోవాలి. రాష్ట్రపతి నిలయం ఆవరణలో నెలకొల్పిన మిట్టి కేఫ్ కు అవసరమైన పెట్టుబడి, రెగ్యులర్ గా నడుపుటకు అయ్యే నిర్వహణ ఖర్చులను కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ తో పాటు ఆస్ట్రేలియా –న్యూజిలాండ్ బ్యాంకింగ్ గ్రూప్ లు భరిస్తున్నాయి. ఈ ఇజీటవ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని చొరవ తీసుకున్నది. వార్షికముగా రూ. 36–46 లక్షలు టర్నోవర్ సాధిస్తామని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రపంచం మెచ్చిన ఆర్థిక శాస్త్రవేత్త

భారత మాజీ ప్రధాని, ఆచార్యులు, బ్యూరోక్రాట్, అకడమీషియన్, ఆర్థికశాస్త్రవేత్త, రాజనీతిజ్ఞుడు, నిస్వార్థ సేవకుడు, నిరాడంబరతకు నిలుటద్దం, నేల మీద మాత్రమే నడవడం తెలిసిన మహా మేధావి మన్మోహన్ సింగ్ తన 92వ ఏట తుది శ్వాస విడిచిన సందర్భంగా దేశ ప్రజాగొంతు మూగబోయింది. పార్టీ ఏదైనా తన పదవిని ఒక మహత్తర బాధ్యతగా భావించి ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన నిరాడంబర బుద్ధి జీవి మన మన్మోహన్. ఆర్థిక నిపుణులు సహితం తన ఆర్థికశాస్త్ర పరిజ్ఞానానికి తల వంచి "సింగ్ ఈజ్ కింగ్" అని కొనియాడడం చూసాం. ప్రతిపక్ష నాయకులు సహితం మన్మోహన్ సింగ్‌ను వ్యక్తిగతంగా విమర్శించడానికి వెనకడుగు వేసిన సందర్భాలు ఎన్నో. అందరి బంధువుగా, అతి సామాన్య జీవితాన్ని గడిపి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిరూపించుకున్న యోధుడు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఎన్నడూ నిలబడని మన్మోహన్ సింగ్ రాజ్యసభకు పలు మార్లు ఎన్నికై 33 ఏండ్ల పాటు ఎంపీగా, మంత్రిగా, ప్రధానిగా విశేష సేవలు అందించారు. అవస్థల విష వలయంలో చిక్కిన భారత ఆర్థిక వ్యవస్థను పలు ఆర్థిక సంస్కరణలతో గాడిలో పెట్టిన మహా మేధావి. 2004 , 2014 మధ్య కాలంలో రెండు పర్యాయాలు యూపిఏ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వానికి ప్రధానమంత్రిగా అమూల్య సేవలు అందించారు. రెండవ దఫా ప్రధానిగా ఉన్న సమయంలో పలు అవినీతి కుంభకోణాలు, ద్రవ్యోల్బణ సంక్షోభాలను ఎదుర్కొంటూ ప్రతిపక్ష నాయకుల చేత "బలహీన పిఎం" అని పిలిపించుకున్నారు. జూన్ 1991లో పి వి నర్సింహారావు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో సభ్యుడిగా చేరి అక్టోబర్ 1991 నుంచి ఐదు సార్లు అస్సాం(1991-2019), ఒక సారి రాజస్థాన్ నుంచి (2019-24) రాజ్యసభకు ఎన్నికైన మన్మోహన్ సింగ్ ఏప్రిల్ 2024లో తన ఎంపీ పదవిలో 33 ఏండ్ల పాటు ఉంటూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా "భారత ఆర్థిక సరళీకరణ రూపశిల్పి"గా, రెండు పర్యాయాలు ప్రధాన మంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారు. భారతదేశ ఎదుగుదలను ఏ ప్రపంచ శక్తి ఆపలేదని, రాజకీయ నాయకులు ప్రజల మనోభావాలపై స్వారీ చేస్తున్నారని, దేశ చరిత్ర తనపై దయ తలిచిందని, నరేంద్ర మోదీ దేశ ప్రధాని కావడం దురదృష్టకరమని, డీమానిటైజేషన్‌తో పాటు జిఎస్టీ ఒక విఫల జంట ప్రయోగాలని వివిధ సందర్భాల్లో నిక్కచ్చిగా పేర్కొనడం తనలోని ధైర్యంతో పాటు స్పష్టమైన భావవ్యక్తీకరణకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. 26 సెప్టెంబర్ 1932న గుర్ముఖ్ సింగ్-అమ్రిత్ కౌర్ దంపతులకు నేటి పాకిస్థాన్‌లోని గహ్ ప్రాంత సిక్కు కుటుంబంలో జన్మించి, 1947లో దేశ విభజన సమయంలో భారత్‌కు వచ్చి వారి కుటుంబం స్థిరపడింది. పాఠశాల విద్యను పెషావర్‌లో ప్రారంభించి, హల్ద్వీ ప్రాంతానికి వలస వచ్చి, అమృత్‌సర్ హిందూ కాలేజీ, పంజాబ్ యూనివర్సిటీల్లో గ్రాడ్యుయేషన్(1952), ఎకనమిక్స్‌లో పిజీ(1954) పూర్తి చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ(1957), సెయింట్ జాన్స్ కాలేజీల్లో ఉన్నత విద్యను కొనసాగించి, యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో ఎకనమిక్స్‌లో పిహెచ్‌డి (1962) పూర్తి చేసారు. 1957-59లో పంజాబ్ యూనివర్సిటీలో సీనియర్ లెక్చరర్‌గా, 1959-63లో రీడర్‌గా, 1963-65లో ప్రొఫెసర్‌గా పని చేశారు. అనంతరం 1966-69లో ఐరాసలో ఉద్యోగిగా, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో ప్రొఫెసర్‌గా కూడా పని చేశారు. తర్వాత కామర్స్ అండ్ ఇండస్ట్రీ మినిస్ట్రీలో బ్యూరోక్రాట్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, 1970-1980ల్లో భారత ప్రభుత్వంలో పలు బాధ్యతలు నిర్వహించి, 1972-76లో చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్‌గా, 1982-85లో ఆర్‌బిఐ గవర్నర్‌గా, 1985-87లో ప్లానింగ్ కమీషన్ హెడ్‌గా, 1990లో ప్రధాని చంద్రశేఖర్‌కు ఆర్థిక సలహాదారుగా, 1991లో స్వల్పకాలం యూజీసీ చైర్మన్‌గా విశేష సేవలు అందించారు. 1991లో భారత్ తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్న వేళ నాటి ప్రధాని పివి నరసింహారావు చొరవతో కాంగ్రెస్‌లో చేరి క్యాబినెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. భారతదేశ ఆర్థిక దుస్థితిని గాడిలో పెట్టడానికి ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్‌లను ప్రవేశపెట్టి దేశాన్ని సంక్షోభంలోంచి కాపాడి బయటకు తీసుకువచ్చారు. 1996 ఎన్నికల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా (1998-2004 మధ్య) బాధ్యతలు నిర్వహించారు. 2004 ఎన్నికల్లో యూపిఏ (కాంగ్రెస్) నెగ్గడంతో సోనియాగాంధీ నిర్ణయంతో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. 2009 ఎన్నికల్లో కూడా యూపిఏ విజయం సాధించడం, మరో పర్యాయం పిఎంగా పదవిని చేపట్టారు. రెండవ పర్యాయం పిఎంగా పదవిలో ఉన్నపుడు కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహణ, బొగ్గు గనుల కేటాయింపు, 2జీ స్పెక్ట్రమ్ అలాట్‌మెంట్ అంశాల్లో జరిగిన భారీ కుంభకోణాల విమర్శల మాటల యుద్ధాలను ఎదుర్కొన్నారు. ఏప్రిల్ 2024లో రాజ్యసభ సభ్యత్వం ముగియడంతో రాజకీయాల నుంచి నిష్క్రమించారు. "అసాధారణ గౌరవం, తేజస్సు కలిగిన నేత"గా పేరు తెచ్చుకోవడంతో పాటు "ప్రపంచ అగ్రనేతల్లో ఉన్నతుడు"గా కూడా విదేశీ పత్రికల్లో కొనియాడబడ్డారు. మారుతీ 800 కారు యజమానిగా అతి సాధారణ జీవితాన్ని గడిపిన దేశ ప్రధానిగా చరిత్రలో నిలిచి పోయారు. "ప్రతిపక్ష నాయకులు సహితం గౌరవించే అద్వితీయ నేత"గా కీర్తించబడి, "ముందు చూపు కలిగి నైతికతే ఆభరణంగా ధరించిన దార్శనికుడు"గా మెప్పు పొందిన మన్మోహనుడు, మనసున్న మానవత్వ రూపం. నేటి రాజకీయ నాయకులను ఆయన జీవితం ఓ పాఠంగా నిలుస్తుంది. ఫోర్బ్స్ జాబితాలో ప్రపంచ అత్యంత ప్రతిభగల నేతల్లో 18 స్థానాన్ని పొంది, "భారత్‌ను అగ్ర రాజ్యాల సరసన నిలిపిన యోధుడు"గా, "భారత్‌ను గట్టెక్కించిన మన్మోహన్"కు దేశం సదా రుణపడి ఉంటుంది. ఆయన రాజకీయ రంగంలో ఏ పదవిని కోరుకోలేదు. అన్ని పదవులు ఆయన చెత్తకు చేరి మురికి పోయాయి. ఆయన మరణం భరతమాతకు తీరని నష్టం. ఆయన సామాన్యుల్లో అసమాన్యుడు, అలసట ఎరుగని నిరంతర శ్రామికుడు, దేశభక్తిని శ్వాసించిన సేవకుడు.

## జగమెరిగిన మిమిక్రీ కళాకారుడు

భారత్‌లో మిమిక్రీ కళకు ఆయన ఆద్యుడు, ఎంతో మంది ప్రముఖుల వందలాదిగా గొంతులను సునాయాసంగా, యథాతథంగా అనుకరించేవాడు. భారత్‌లో అనుకరించి నవ్వించే కళగా మాత్రమే ఉన్న మిమిక్రీని ఐరాస ప్రధాన కార్యాలయంలో ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడు. రాష్ట్రపతులు, ప్రధానుల నుండి సామాన్యుల వరకూ దేశంలో ఆయన అపూర్వ, అపురూప కళను అభినందించని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు గుర్తు పట్టారనుకుంటా. ఆయనే వందలాది గొంతుకల వేణు మాధవుడు. ధ్వన్యనుకరణ సామ్రాట్ అనే బిరుదును పొందిన తెలంగాణ గర్వించ దగ్గ ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ళ వేణుమాధవ్ ( డిసెంబరు 28, 1932 – జూన్ 19, 2018 ) చిన్నప్పుడు ఉర్దూ మాధ్యమంలో చదువుకున్నాడు. అయినా ఆయన అమెరికా, బ్రిటన్ ఇంగ్లిష్ ఉచ్చారణలతో కూడా గొప్ప ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన సొంతంగా ఈ కళను సాధన చేశారు. స్వీయ పరిశీలన, స్వయం అధ్యయనంతో తనను తాను మెరుగు పరచుకుంటూ అత్యున్నత స్థాయిని అందుకున్న ప్రతిభాశాలి. లక్ష్మీనరసింహం రాసిన ప్రహసనాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నా అప్పటి ప్రముఖ నటులు చిత్తూరు నాగయ్య, వేమూరు గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య తదితరుల సినిమాల ప్రభావంతో మిమిక్రీ కళపై మొగ్గు చూపాడు. 1947 నుంచి ఈయన మిమిక్రీ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాడు. తెలుగులోనే కాక ఇతర భాషల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చాడు. ఐక్యరాజ్య సమితిలో కూడా ప్రదర్శన ఇచ్చాడు. 1953 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాడు. కేంద్రప్రభుత్వం ఈయనకు పద్మశ్రీ పురస్కారాన్నిచ్చి గౌరవించింది. విశ్వనాథ సత్యనారాయణ, సినారె మొదలైన ప్రముఖులు తమ రచనలను ఈయనకు అంకితమిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ, జె. ఎన్. టి. యు, కాకతీయ విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నాడు. తిరుపతిలో ఈయనకు గజారోహణం, పౌరసన్మానం జరిగాయి. ఆయన స్వయంగా నేరెళ్ళ వేణుమాధవ్ సాంస్కృతిక సంస్థను స్థాపించి ప్రతి యేటా ఒక కళాకారుడిని సన్మానించాడు. హనుమకొండలో ఆయన పేరు మీదుగా డా. నేరెళ్ళ వేణుమాధవ్ కళాప్రాంగణం నిర్మించారు. నేరెళ్ళ వేణుమాధవ్ వరంగల్ పట్టణంలోని మట్టెవాడలో శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932 డిసెంబరు 28న జన్మించారు. పండితుడైన తండ్రి, వరంగల్ పట్టణానికి వచ్చే ప్రముఖులందరికీ తన ఇంట్లోనే ఆతిథ్యం ఇస్తుండగా, అలా వచ్చిన వారిలో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, వావిలికొలను సుబ్బారావు, వడ్డాది సుబ్బారాయుడు, రాయప్రోలు సుబ్బారావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాశీ కృష్ణాచార్యులు, యర్రమిల్లి జగ్గన్న శాస్త్రి వంటి గొప్పవారి సాహితీ గోష్ఠుల ప్రభావం వేణుమాధవ్ మీద పడింది. సినిమాలంటే ఎంతో ఇష్టం. చిత్తూరు నాగయ్య నటించిన గృహలక్ష్మి, వందేమాతరం, దేవత, స్వర్గసీమ, పోతన, వేమన సినిమాలు చూసి, నాగయ్య కూడా ధ్వన్యనుకరణ చేయగలవారు కావడంతో ఆయన పై అభిమానంతో కేవలం స్వయం పరిశీలనతోనే ఆ రంగంలో ప్రవేశించాడు. అలాగే వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య నటించిన సినిమాలు చూసి, ఇంటికి రాగానే ఆ సినిమాల్లోని పాటలను, పద్యాలను యథాతథంగా అనుకరించి చూపేవాడు. అలా మొదలయ్యింది అయన మిమిక్రీ ప్రస్థానం. 1950 లో మెట్రిక్యులేషన్, 1952 లో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చేరారు. నాటి ప్రిన్సిపాల్ బారు వెంకట రామనర్సు, ఇతర లెక్చరర్లు వారించినా వినకుండా, గుడ్ కాండక్టు కింద వేణుమాధవ్ కు ఆ రోజుల్లో అరవై రూపాయల స్కాలర్ షిప్ ( బర్సరీ ) మంజూరు చేశారు. ఆ డబ్బుతో పలు ఇంగ్లీషు సినిమాల్ని చూసి వాటిల్లోని ఆర్టిస్టుల గొంతులు, ముఖ్యమైన సన్నివేషాలు బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నోట్స్ తో సహా వినిపిస్తే, రామనర్సు పరమానంద భరితులై "యూ విల్ బికం ఎ గ్రేట్ ఆర్టిస్ట్ ఇన్ ద వరల్డ్" అని, అయితే నీవు నా రెండవ కుమారుడవు అని మనసారా ఆశీర్వదించారు. ఆ దీవెనలే వీరిని 'విశ్వ విఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్' గా ఎదిగేలా చేసాయి. 1953 లో ప్రభుత్వ పాఠశాల (జి సి ఎస్ స్కూలు హనుమకొండ) లో ఉపాధ్యాయుడుగా ప్రవేశించి, ధర్మ సాగరం, హనుమకొండలోని ప్రాక్టీసింగ్ స్కూలు, మట్వాడ ఉన్నత పాఠశాల, జనగామ, శంభునిపేట పాఠశాలల్లో పనిచేశారు. అనంతరకాలంలో ప్రైవేటుగా బీ.ఏ. బీ. కాం పాసయ్యారు. తొలి ప్రదర్శన 1947 లో ఇచ్చారు. మలి ప్రదర్శన 1953 లో రాజమండ్రిలో జరిగిన థియేటర్స్ ఫెడరేషన్ కాన్ఫరెన్స్ లో బలరాజ సహానీ గారి అధ్యక్షతన, గరికపాటి రాజారావు, దాడి గోవిందరాజులు, స్థానం నరసింహారావు, చాగంటి సన్యాసిరాజు గారల సమక్షంలో ఇచ్చారు. ఆయన ప్రదర్శనలు చూసిన పలువురు రాజకీయ ప్రముఖుల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్, ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు లాంటి ఎంతోమంది ఉన్నారు. ధ్వన్యనుకరణ సామ్రాట్, మిమిక్రీ సామ్రాట్, చుపే రుస్తుం ధ్వన్యనుకరణ చక్రవర్తి, కళాసరస్వతి, స్వర్ కే రాజా, ధ్వన్యనుకరణ ప్రవీణ, ధ్వన్యనుకరణ కళానిధి, మిమిక్రీ రత్న, విశ్వవిఖ్యాత ధ్వన్యనుకరణ సార్వభౌమ, మున్నగు బిరుదులు వరించాయి. 1977 ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి కళా ప్రపూర్ణ బిరుదు, 1982 రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, 1987 జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వ విద్యాలయం, 1992 కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు...1997 కనకాభిషేకం, 1998 ఎన్టీఆర్ ఆత్మ గౌరవ పురస్కారం, 2001 పద్మశ్రీ, 2005 తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారాలు – 2018లో భాగంగా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పురస్కారం అందజేయ బడింది. తిరుపతి పట్టణంలో గజారోహణం, పౌరసన్మానం జరిగాయి. పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 2018, జూన్ 19వ తేదీ తమ 85వ యేట కన్నుమూశారు. హనుమకొండ పట్టణంలో నిర్మింపబడ్డ 'డా.నేరెళ్ళ వేణుమాధవ్ గారి కళాప్రాంగణం ' సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు చక్కని వేదికగా ఉపయోగ పడుతున్నది. నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్ట్' ను స్థాపించి ప్రతియేటా తన పుట్టినరోజైన డిసెంబర్ 28న ప్రముఖ కళాకారులను పదివేల రూపాయల పురస్కారంతో సత్కరిస్తున్నారు. 2017లో నేరెళ్ల వేణుమాధవ్ పేరుతో పోస్టల్ శాఖ ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది. ఆయన పుట్టినరోజైన డిసెంబర్ 28వ తేదీని తెలుగు రాష్ట్రాల్లో 'మిమిక్రీ డే'గా జరుపు కుంటారు.

# భారత పారిశ్రామిక దిగ్గజం

భారత దేశ పారిశ్రామిక రంగంలో గొప్ప మార్పులను సృష్టించిన వ్యక్తి రతన్ నవల్ టాటా. ఆయన నిపుణత, వ్యాపార దృష్టి, సమాజం పట్ల ఉన్న బాధ్యతభావం భారతీయ వ్యాపార రంగంలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాయి. టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే కాకుండా, భారతీయుల జీవితాలను మెరుగుపరిచే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 1937 డిసెంబర్ 28న ముంబైలో జన్మించిన రతన్ టాటా, టాటా కుటుంబానికి చెందినవారు. ఆయన తండ్రి నవల్ టాటా, తల్లి సోనూ టాటా. చిన్నతనంలో తల్లిదండ్రుల విడాకుల కారణంగా ఆయన నానమ్మ సారస్వతీ టాటా సంరక్షణలో పెరిగారు. చిన్నప్పటి నుంచే రతన్ టాటాలో వినూత్న ఆలోచనల పట్ల ఆసక్తి కనిపించేది. విద్యలోనూ ఆయన ప్రావీణ్యం ప్రత్యేకమైంది. ముంబైలోని క్యాంపియన్ స్కూల్‌లో తన పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత, అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీ నుండి ఆర్కిటెక్చర్‌లో డిగ్రీని సంపాదించారు. అదే సమయంలో హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో మేనేజ్‌మెంట్ కోర్సును కూడా పూర్తి చేశారు. రతన్ టాటా తన కెరీర్‌ను 1962లో టాటా స్టీల్ డివిజన్‌లో ప్రారంభించారు. ఫ్లోర్ మేనేజర్‌గా చిన్నస్థాయి ఉద్యోగం నుంచి ప్రారంభించి, సమర్థత, వినయం, కృషి ద్వారా అత్యున్నత స్థాయికి ఎదిగారు. 1991లో, జెఆర్డీ టాటా పదవీ విరమణ అనంతరం, రతన్ టాటా, టాటా గ్రూప్ చైర్మన్‌గా నియమితులయ్యారు. రతన్ టాటా చైర్మన్‌గా ఉన్న కాలంలో, టాటా గ్రూప్ అనేక కొత్త విజయాలను సాధించింది. వ్యాపార విస్తరణ... రతన్ టాటా నాయకత్వంలో టాటా గ్రూప్ అనేక కొత్త రంగాలలోకి ప్రవేశించింది. ఆటోమొబైల్స్, టెక్నాలజీ, గ్లోబల్ హోటల్స్, రిటైల్, టెలికమ్యూనికేషన్ వంటి విభాగాలలో టాటా గ్రూప్ ప్రపంచంలో పేరు తెచ్చుకుంది. టాటా నానో: ప్రపంచంలో అతి తక్కువ ధరతో కార్‌ను రూపొందించడం ద్వారా సామాన్యుడి కలను నిజం చేశారు. జాగ్వార్-ల్యాండ్ రోవర్: బ్రిటన్‌కు చెందిన ఈ బ్రాండ్లను కొనుగోలు చేసి, టాటా మోటార్స్‌ను అంతర్జాతీయంగా గుర్తింపును తెచ్చిపెట్టారు. టాటా టీ: బ్రిటిష్ బ్రాండ్ టెట్లీ టీని కొనుగోలు చేసి, టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ పానీయ మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. రతన్ టాటా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించి, టాటా గ్రూప్‌లో సాంకేతిక పరిజ్ఞానానికి పెద్దపీట వేశారు. రతన్ టాటా కేవలం వ్యాపార ప్రయోజనాలకు మాత్రమే కాకుండా, సమాజానికి సేవ చేయడంలోనూ విశేషంగా ముందున్నారు. టాటా ట్రస్ట్స్ ద్వారా ఆరోగ్యం, విద్య, గ్రామీణ అభివృద్ధి రంగాలలో అనేక కార్యక్రమాలను అమలు చేశారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసి, పునరుత్పాదక శక్తి పై దృష్టి పెట్టారు. రతన్ టాటా అందుకున్న కొన్ని ముఖ్యమైన గౌరవాలలో... పద్మభూషణ్ (2000), పద్మ విభూషణ్ (2008), టైమ్ మ్యాగజైన్ "ప్రపంచ అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు" జాబితాలో స్థానం, అనేక విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు. రతన్ టాటా తన సాదాసీదా జీవనశైలికి ప్రసిద్ధి. ఆయన తక్కువ ఆర్భాటంతో జీవిస్తూ, సహజత్వాన్ని పాటించారు. న్యాయం, నైతికత, సమాజ సేవ పట్ల ఆయన చూపే ఆసక్తి నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తోంది. రతన్ నవల్ టాటా, భారత వ్యాపార రంగానికి స్ఫూర్తినిచ్చిన ఒక దిగ్గజం. వ్యాపారంలో విజయం సాధించడం మాత్రమే కాకుండా, సమాజానికి సేవ చేయడాన్ని కూడా ఆయన జీవన విధానంగా మార్చుకున్నారు. ఆయన ఆదర్శాలు, ధైర్యం, సృజనాత్మకత భారతీయ పారిశ్రామిక రంగానికి, సమాజానికి మార్గదర్శకంగా నిలిచాయి. రతన్ టాటా చేసిన కృషి తరతరాల పాటు ప్రజల మనసుల్లో నిలిచిపోతుంది

## బౌండరీలు దాటేస్తున్న బౌన్సర్లు

హైదరాబాద్, డిసెంబర్ 27, హైదరాబాద్ నగరంలో తరుచూ పబ్బులు, షాపింగ్‌మాల్స్, ప్రముఖుల పర్యటనల సందర్భంగా టిప్‌టాప్‌గా కనిపిస్తూ బౌన్సర్స్ హడావుడి సృష్టిస్తుంటారు. అడ్డొచ్చిన వారందర్నీ ఈడ్చి పారేయడం.. ప్రశ్నిస్తే చితకబాదెయ్యడం.. ఇదీ వ్యక్తిగత భద్రత పేరుతో బౌన్సర్లు చేస్తున్న అరాచకాలు. ఈ నేపథ్యంలో అసలు బౌన్సర్ల నియామకం, బౌన్సర్స్ విధులు ఏమున్నాయన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. ఎందుకంటే సామాన్య ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, అడ్డుకున్న సమయాల్లో బెదిరించి చితకబాదిన సందర్భాలు చాలా ఉన్నాయి. అచ్చం పోలీసుల్లాగే సఫారీ డ్రెస్సులు వెయ్యడం ఎక్కడ చూసినా హంగామా చెయ్యడం, వీళ్లకు పరిపాటిగా మారింది. తమకు అధికారం ఉందన్నట్టు షాడో పోలీసుల్లాగా వ్యవహరిస్తున్నారు కొందరు బౌన్సర్స్. ఒక్రీబనీ . కొందరు షాడో పోలీసుల తరహాలో ప్రవర్తిస్తూ దాడి చేస్తున్న ఘటనలు ఇటీవల కాలంలో అధికమయ్యాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ ఏజెన్సీలు బౌన్సర్ల పేరుతో రౌడీలు, నేర చరిత్ర ఉన్నవారిని అడ్డగోలుగా నియమించుకుంటున్నాయి. దేహదారుఢ్యం, ఎత్తు ఉంటే చాలన్నట్లు ఎంపిక చేస్తూ జనాలపైకి వదిలేస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్స్ పరిధిలో బౌన్సర్లుగా చలామణి అవుతూ సెటిల్‌మెంట్లు చేసేవారు వందల సంఖ్యల్లో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. లక్షల్లో ఆదాయం, ఉచిత ఆహారం, వసతి కల్పించడంతో నేరచరిత్ర ఉన్నవారూ దీన్ని ఆసరాగా తీసుకుని.. ఈ వృత్తిని ఎంచుకుంటున్నారు. కొన్ని ఏజెన్సీలకు పోలీసులతో సంబంధాలు కూడా ఉండడం లేదు. పోలీసులకు శ్రమ లేకుండా ప్రముఖులకు భద్రత కల్పిస్తున్నారనే ఉద్దేశంతో చూసీచూడనట్లు పోలీసులు సైతం వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులో పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఓ వివాహిత మృతి చెందింది. హీరో అల్లు అర్జున్‌కు రక్షణగా వచ్చిన బౌన్సర్లు అభిమానులను తోసుకెళ్తూ చేసిన హడావుడి తొక్కిసలాట జరగడానికి ఓ కారణంగా మిగిలింది. తాజాగా మంచు కుటుంబం వివాదం నేపథ్యంలో మోహన్‌బాబు, విష్ణు, మనోజ్ వర్గాలు పదుల సంఖ్యలో బౌన్సర్లను మోహరించాయి. అయితే వ్యక్తి గత భద్రత కోసం ఇద్దరు ముగ్గురు ఉంటారు. కానీ ఇలా పదుల సంఖ్యలో బౌన్సర్స్ పెట్టుకోవడం వల్ల పోలీసుల విధులకు ఒక్కోసారి ఆటంకం కలుగుతుండటంతో అధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.. బౌన్సర్లు చేస్తున్న అరాచకాలకు అడ్డు అదుపు లేకపోవడం బౌన్సర్స్ పట్ల సామాన్య ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల బౌన్సర్లు రెచ్చిపోతున్నారు. బౌన్సర్ల దాదాగిరితో సామాన్య జనం చాలా ఇబ్బందులు పడ్డ సందర్భాలున్నాయి. బౌన్సర్లు దాడి చేస్తే కేసులు నమోదు చేయొచ్చని పోలీసులు చెబుతున్నారు. బౌన్సర్ పేరుతో భద్రతను వాడడానికి వీల్లేదని వారిని ఎంపిక చేసినవారిని, వారి సేవల్ని పొందుతున్నవారి మీద చర్యలు తీసుకోవచ్చంటున్నారు పోలీసులు. బౌన్సర్స్ యూనిఫామ్ మీద కంపెనీ పేరుతో పాటు ఖూఒఔ లెసైన్సు నంబరు, దాని పక్కన రాష్ట్రం కోడ్ తప్పనిసరిగా ఉండాలని.. ఈ కోడ్‌ను పసారా వెబ్‌సైట్లో తనిఖీ చేస్తే సిబ్బంది వివరాలన్నీ వస్తాయని తెలంగాణ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ అసోసియేషన్ చైర్మన్ భాస్కర్ రెడ్డి తెలిపారు. కానీ బౌన్సర్లు మాత్రం ఫైన్ గా ఉన్న సఫారీ డ్రెస్ వేసుకొని ఎక్కడ కూడా యూనిఫామ్ మీద కంపెనీ పేరు కనిపించదని.. ఖూఒఔ లెసైన్సు నంబరు, దాని పక్కన రాష్ట్రం కోడ్ ఎక్కడ కనిపించదన్నారు. ఇలా ఇష్టానుసారంగా బౌన్సర్లు ఎలాంటి కోడ్ లేని సఫారీ డ్రెస్ వేసుకొచ్చి సామాన్య ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నరు. వీరి పైన ఫిర్యాదు చేస్తే తక్షణమే పోలీసులు యాక్షన్ తీసుకుంటారు. కానీ సామాన్య ప్రజలకు బౌన్సర్ల పట్ల ఏమీ తెలియకపోవడంతో ఎవరు ఫిర్యాదు చేయడానికి ముందుకు రాని పరిస్థితి నెలకొంది. పసారా చట్టం ప్రకారం ప్రముఖులు అంగరక్షకుల్ని నియమించుకోవచ్చు. బౌన్సర్ల ప్రవర్తనపై స్పష్టమైన నిబంధనలున్నాయి. ఇవేవీ లేకుండా బౌన్సర్ల పేరుతో కొందరు ప్రజల్ని భయపెడుతున్నారు. ఇది సమాజంలో ఇప్పుడు ఓ పెద్ద సమస్యగా మారింది. బౌన్సర్లపై ప్రభుత్వం, పోలీసులు దృష్టిసారించాల్సిన అవసరం ఏర్పడింది. పోలీసులు దృష్టి పెట్టకపోతే మాత్రం ప్రజలు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఇప్పటికే చాలా చోట్ల బౌన్సర్ల దాదాగిరి పెరిగిపోయింది. దీని వల్ల పోలీసులకే మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని భాస్కర్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి బౌన్సర్ల నియామకం, విధులపై ప్రత్యేక నిబంధనలంటూ లేవు. అసలు బౌన్సర్ల వ్యవస్థ చట్టవిరుద్ధం.. ది ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ రెగ్యులరేషన్ చట్టం- 2005 ప్రకారం వీరిని భద్రతా సిబ్బందిగానే పరిగణించాలి. రిజిస్టర్ అయిన ఏజెన్సీలు నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగానే భద్రతా సిబ్బందిని ఎంపిక చేయాలి. వీరు ప్రవర్తించాల్సిన తీరు, ఇతర అంశాలపై శిక్షణ ఇవ్వాలి. కేవలం భద్రత కల్పించడమే తప్ప.. ఇతరుల మీద దాడి చేయడానికి వీల్లేదు. పబ్బులు, ఈవెంట్ల దగ్గర వీరి ఆగడాలు హద్దు అదుపులేకుండా మితి మీరుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు.. ప్రభుత్వం స్పందించి.. దీనిపై చర్యలు తీసుకోవాలని.. వెంటనే ఓ నియమావళిని.. ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. తెలంగాణ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ అసోసియేషన్ చైర్మన్ భాస్కర్ రెడ్డి అన్నారు.

# విద్యార్థులకు పౌష్టికరమైన భోజనం అందించాలి

## ఆర్ సి ఓ గోపీచంద్ రాథోడ్



ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ డిసెంబర్ 27 : మహా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సిఓ గోపిచంద్ రాథోడ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలోకి రాగానే ముందుగా టాయిలెట్స్ రూమ్లను పరిశీలించారు.అనంతరం నేరుగా పిల్లలకు అందించే బియ్యం తదితర వస్తువులను స్వయంగా పరిశీలించారు. మారిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి తను కూడా భోజనం చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పూర్తిస్థాయిలో సిలబస్ అయిపోయిందా అని అడిగి తెలుసుకో పోవడంతో పాటు వారి యొక్క సృజనాత్మకతను పరిశీలించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున శ్రద్ధగా చదువుకొని 100% ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెంచిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంతోపాటు, పెంచిన వస్తువులన్నింటినీ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం విద్యార్థులతో కలిసి మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాణి, శ్రీ పాల్,తిరుమల్,మహేందర్, రమేష్,పిడి పీఈటీలు నాంపల్లి,రాజేష్,రమేష్ లు ఉన్నారు.

# లోకేష్ చేతికి సైకిల్ హ్యాండిల్...



విజయవాడ, డిసెంబర్ 27,ఎప్పుడో జరిగిందని అనుకుంటున్నా..ఇక తెలుగుదేశం పార్టీలో పూర్తిగా క్లారిటీ వచ్చేసింది. పార్టీ యావత్తూ ఇక నారా లోకేష్ చేతుల్లోనే ఉంది. పార్టీని బలోపేతం చేయడం కానీ, వచ్చే ఎన్నికల్లో గెలిపించడం కానీ ఇకఅంతా లోకేష్ మీదనే ఆధారపడి ఉంది. చంద్రబాబు నాయుడు జాతీయ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ రానున్న ఎన్నికల్లో తన కుమారుడు లోకేష్ ను ముందు పెట్టి రాజకీయాలను నడిపే అవకాశముంది. ఇప్పటికే లోకేష్ రాజకీయంగా రాటు దేలారు. ఎవరు ఏంటి? వ్యూహాలు ఏవిధంగా అమలు చేయాలన్న దానిపై ఫుల్లుగా ట్రైనప్ అయ్యారు. గత పదేళ్లుగా బ్యాక్ ఆఫీస్ లో పనిచేస్తున్నప్పటికీ 2014 తర్వాత మాత్రమే ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినట్లయింది.అయితే అందరిలాగా ఆయన ఓడిపోయిన చోట మళ్లీ పోటీచేయకుండా వేరే చోటకు భయపడి పరుగుపెట్టలేదు. 2019 ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో ఓటమి పాలయినా అదే నియోజకవర్గంలో 2024లో గెలిచిమరీ సత్తా చాటారు. ఈవిజయం లోకేష్ కు సులువుగా లభించలేదు. టీడీపీకి కూడా చాలా రోజుల తర్వాత మంగళగిరి నియోజకవర్గంలో విజయాన్ని అందించగలిగారు. తన తండ్రి చంద్రబాబు తరహాలోనే గుంటూరు జిల్లాలోని మంగళగిరి నియోజకవర్గాన్ని లోకేష్ అడ్డాగా మలచుకోగలిగారు. ఓడిపోయిన తర్వాత ఐదేళ్లు లోకేష్ చేసిన కృషితో పాటు సేవలు కూడా ప్రజలను ఆయన వద్దకు చేర్చగలిగాయంటారు. అలాంటి లోకేష్ మొన్నటి ఎన్నికలలో గెలిచిన తర్వాత నేరుగా పాలనలో వేలు పెట్టకపోయినా.. పార్టీ వ్యవహారాలన్నీ తానే అయి చూసుకుంటున్నారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు రికార్డు స్థాయిలో నమోదు కావడానికి కారణం లోకేష్ అని చెప్పాలి. చంద్రబాబు కంట్లో పడే కంటే ఇప్పుడు లోకేష్ దృష్టిలో పడటం మంచిదన్న అభిప్రాయం ఎక్కువ మంది పసుపు పార్టీ నేతల్లో వ్యక్తమవుతుంది. లోకేష్ తన తండ్రి లాగా పాలనపై పెద్దగా ఫోకస్ పెట్టకుండా పార్టీని బలోపేతం చేయడంపైనే దృష్టి పెట్టారు. ప్రజాదర్బార్ పేరుతో ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించగలవన్నీ పరిష్కరిస్తుండటంతో ఆయనకు జనంలో కూడా క్రేజ్ పెరుగుతుంది. అదే సమయంలో సీనియర్ నేతలను పక్కన పెట్టి యువనాయకత్వానికి పగ్గాలు అప్పగించడం వెనక కూడా లోకేష్ ప్రమేయం ఉనట్లు చెబుతారు.. రానున్న కాలమంతా ఇక యువతరానిదేనన్న సంకేతాలను బలంగా పంపగలిగారు.ఒకరిద్దరునేతలకు మినహాయింపు ఉన్నప్పటికీ టీడీపీ ఆవిర్భావం నుంచిఉన్ననేతలందరూ దాదాపుగా కనుమరుగయినట్లే కనిపిస్తుంది. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నసమయంలో నేతల పనితీరునుకూడా బేరీజు వేసుకున్నారు. జిల్లాల్లోనూ ఏ నేత బలంగా ఎదగడానికి ఆయన అంగీకరించడం లేదు. నేత కాదు పార్టీయే ముఖ్యమన్నది లోకేష్ విశ్వసిస్తున్నారు. అందుకే బలమైన నాయకత్వంతో పాటు కొత్త నేతలను రాజకీయాల్లోకి తీసుకు రావడం మంచిదన్నభావనలో ఉన్నట్లు కనిపిస్తుంది. మంత్రి వర్గం కూర్పులోనూ లోకేష్ ముద్ర ఉందంటారు. ఇలా పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా అంతా లోకేష్ తానే అయి నడిపిస్తున్నట్లు పార్టీవర్గాలే అంటున్నాయి. ఇక చంద్రబాబు వద్ద హమారా జమానా అంటూ వెళ్లే నేతలకు మాత్రం ప్రయారిటీ ఉండదన్నది సుస్పష్టంగా తెలుస్తుంది.

## ప్రైవేట్ అంబులెన్స్ దందా...

కర్నూలు, డిసెంబర్ 27,ఏపీలో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా దందా నడిపిస్తున్నారు. వారికి ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది సహకరిస్తున్నారనే ఆరోణలు ఉన్నాయి. ముఖ్యంగా విజయవాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతి, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాల్లోని పెద్దాసుపత్రుల కేంద్రంగా ఈ దందా నడుస్తోందిరాష్ట్రంలోని వివిధ పెద్ద ఆసుపత్రులకు చికిత్స కోసం ఎక్కువగా పేదలే వస్తుంటారు. ఇలా వచ్చే రోగులు ఎవరైనా మృతి చెందితే.. ఆ మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లు చెప్పిందే ధర అవుతోంది. వారు అడిగినంత ఇవ్వకపోతే మరో వాహనంలో కూడా తరలించకుండా చేస్తున్నారు. కొన్నిచోట్ల అడ్డుకొని గొడవలకు దిగుతున్నారు.మహాప్రస్థానాలకు చెందిన అంబులెన్సులు ఉన్నా.. అవి అందుబాటులో లేవని ఆసుపత్రుల సిబ్బందితోనే చెప్పిస్తున్నారు. బాధితులే ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించేలా చేస్తున్నారు. లోపాయికారీ ఒప్పందం చేసుకొని సిబ్బంది కూడా కమిషన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అడిగినంత ఇచ్చుకొని మృతదేహాలను స్వస్థలాలకు తరలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, కర్నూలు, గుంటూరు, తిరుపతి సర్వజనాసుపత్రులకు ఎక్కువగా చికిత్స కోసం వస్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో రోగులు చనిపోతుంటారు. ఈ ఆసుపత్రుల్లో ఎవరు చనిపోయినా.. అక్కడ పనిచేసే సిబ్బంది క్షణాల్లో అంబులెన్స్ నిర్వాహకులకు సమాచారం ఇస్తున్నారు. దీంతో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు నేరుగా వార్డులోకి వచ్చి అంబులెన్స్ ధరలు మాట్లాడుకుంటున్నారు.అయితే.. ఆసుపత్రుల్లో మహాప్రస్థానం అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. కానీ తక్కువ ఉంటున్నాయి. దీంతో ఆ అంబులెన్స్‌లు బయటకు వెళ్లాయని, ఆరేడు గంటలు వేచి ఉండాలని సిబ్బంది చెబుతున్నారు. ఫలితంగా బాధితులు ప్రైవేటు డ్రైవర్లను ఆశ్రయిస్తున్నారు. అంబులెన్స్ డ్రైవర్లు అడిగినంత ఇచ్చి మృతదేహాలను తరలిస్తున్నారు.కరోనా సమయంలో మొదట్లో ఇలాంటి పరిస్థితులో తలెత్తాయి. దీంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మృతదేహాలు తరలించేందుకు ధరల పట్టికను ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసింది. కొవిడ్ కాలం అవి అమల్లో ఉన్నా.. ఆ తర్వాత మళ్లీ వసూళ్ల దందా స్టార్ట్ అయ్యింది. ప్రస్తుతం జరుగుతున్న దోపిడీపై అధికారులు దృష్టిపెట్టాలని బాధితులు కోరుతున్నారు.

## మల్లన్నను దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ

శ్రీశైలం మల్లన్న సేవలో తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఆలయ రాజగోపురం వద్ద మంత్రి కొండా సురేఖకు ఈవో శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించుకొని అమ్మవారిని దర్శించుకున్నారు మంత్రి కొండా సురేఖ. అమ్మవారి ఆశీర్వచనం మండపంలో మంత్రి కొండా సురేఖ కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం పలికారు అర్చకులు, వేదపండితులు.స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడుతూ శ్రీశైల స్వామి అమ్మవార్లను ప్రతి ఏటా దర్శించుకుంటానని, తమ కూతురికి కొడుకు పుట్టిన సందర్భంలో శ్రీశైలం వచ్చినట్లు కొండా సురేఖ తెలిపారు.

# కడప నుంచే ప్రక్షాళన....



కడప, డిసెంబర్ 27, వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు ఇప్పుడు కడపజిల్లాయే పెద్ద సమస్యగా మారింది. తన సొంత ఇంటిని చక్కదిద్దుకోవడానికే ఆయన ఎక్కువ సమయం వెచ్చించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 2019 నుంచి 2024 వరకూ చంద్రబాబును ఇబ్బందిపెట్టినట్లుగానే,నాడు కుప్పం నియోజకవర్గంతో పాటు చిత్తూరు జిల్లాను లక్ష్యంగా చేసుకున్నట్లే ఇప్పుడు పులివెందులతో పాటు కడపజిల్లాను కూడా చంద్రబాబు అండ్ టీం టార్గెట్ చేసింది. అందుకే జగన్ ఎక్కువగా బెంగళూరు నుంచిపులివెందులకు తిరుగుతూ కడప జిల్లా నేతలతో సమావేశమవుతూ వారు జారిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సొంత జిల్లాలో తనకు గత ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవం మళ్లీ రాకుండా ప్రయత్నాలను ప్రారంభించారు.. వచ్చే నెల మూడో వారం నుంచి జగన్ జిల్లాల పర్యటన చేస్తానని చెప్పారు. అయితే మిగిలిన జిల్లాల్లో నేతలు, క్యాడర్ కొంత బాగానే ఉన్నప్పటికీ కడప జిల్లాలోనే పార్టీ బలహీనమయిందంటున్నారు. కడప జిల్లాలో పార్టీ నేతలు కూడా పెద్దగా వైసీపీకి ఉపయోగపడకుండా మౌనంగా ఉన్నారని భావిస్తున్నారు. 2019 నియోజకవర్గాల్లో పదికి పది నియోజకవర్గాల్లో గెలిచి మొన్నటి ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత నేతలు ఎవరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. దూరంగా ఉంటున్నారు. అంతెందుకు ముఖ్యమంత్రి సొంత మేనమామ అయిన కమలాపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర నాథ్ రెడ్డి కూడా గాయబ్ అయ్యారు.ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన పెద్దగా పార్టీ కార్యక్రమాల్లో కనిపించింది లేదు. దీంతో కడప జిల్లాపైనే జగన్ ఎక్కువ దృష్టి పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జమ్మలమడక నియోజకవర్గంలోనూ సుధీర్ రెడ్డి అక్కడ క్యాడర్ కు అందుబాటులో లేకుండాపోయారు. తన ఓటమిని జీర్ణించుకోలేక ఆయన గత ఏడు నెలల నుంచి పత్తా లేకుండా పోయారు. అక్కడ క్యాడర్ ఆశగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాయచోటి నియోజకవర్గంలో ముఖ్యనేత గడికోట శ్రీకాంత్ రెడ్డి కూడా పెద్దగా కనిపించడం లేదు. ఆయన ఐదేళ్లకాలంలో మంత్రి పదవిదక్కలేదన్న అసంతృప్తిలోనే ఇంకా ఉన్నట్లుంది. మొన్నటి ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత అప్పుడప్పుడు అలా కనిపించి మ.. మ అనిపించి వెళ్లిపోతున్నారు. జగన్ తో తొలి నుంచి అడుగులు వేసినఆయనకు పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయారిటీ లేదని భావించి శ్రీకాంత్ రెడ్డి మౌనంగా ఉన్నట్లే కనిపిస్తుంది. మైదుకూరు నియోజకవర్గంలో రఘురామిరెడ్డి వయసు రీత్యా కొంత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఇక ప్రొద్దుటూరు నియోజకవర్గంలోనూ రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అప్పుడప్పుడూ తాను ఉన్నానంటూ మీడియా సమావేశాలతో సరిపెడుతున్నారు. ఇలా దాదాపు అన్నినియోజకవర్గాల్లోనూ నేతలు పెద్దగా కనిపించడం లేదు. అందుకే వైసీపీ అధ్యక్షుడు స్వయంగా రంగంలోకి దిగారంట. ఇడుపులపాయలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్లకు ఉన్న సమస్యలేంటి అనే దిశగా జగన్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. కడప కార్పొరేషన్‌గా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు అక్కడ వైఎస్ ఫ్యామిలీ పెత్తనమే నడుస్తుంది. వైఎస్ హయాంలో కాంగ్రెస్ పట్టు నిలుపుకుంటే.. తర్వాత జగన్ దాన్ని కొనసాగిస్తూ వచ్చారు. కడపలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మేయరు సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా వర్గీయులే కార్పొరేటర్లుగా ఉన్నారు. అయితే ఈ ముగ్గురి మధ్య సఖ్యత లోపం ఉంది.వైసీపీ నేతల విభేదాలను టీడీపీ క్యాష్ చేసుకునే ప్రయత్నం చేస్తుంది. ఆ క్రమంలోటీడీపీ గూటికి సుమారు 20 మంది కార్పొరేటర్లు వెళుతున్నారన్న ప్రచారం జరిగింది. వారితో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి స్వయంగా రెండు సార్లు సమావేశమై బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఆయనతో మీ వెంటే ఉంటామని చెప్పినప్పటికీ .. ఒకేసారి ఏడుగురు కార్పొరేటర్లు అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో పసుపు కండువాలు కప్పుకున్నారు. అంతకు ముందే మరో కార్పొరేటర్ సిటీ కేబుల్ సూర్యనారాయణ సైకిలెక్కారు. మరో 12 మంది టీడీపీతో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది.మేయరు సురేశ్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషల వైఖరితోనే కార్పొరేటర్లు టీడీపీలో చేరుతున్నారంటున్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డే వారిద్దరిని దెబ్బ కొట్టడానికి వాంటెడ్‌గా కార్పొరేటర్లను టీడీపీలో పంపిస్తున్నారని వైసీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. సొంత జిల్లా కేంద్రంలో కార్పొరేటర్లు టీడీపీలోకి వెళ్లి మేయర్ పదవి చేజారితే అది స్టేట్ ఇష్యూ అయి వైసీపీకి మరింత డ్యామేజ్ అవుతుందని జగన్ ఆందోళన చెందుతున్నారంట. అందుకే దాన్ని చక్కబెట్టాల్సిందిగా అవినాష్ కు బాధ్యతలు అప్పజెప్పారంటారు.అయితే పార్లమెంటు సమావేశాల్లో ఉన్న కారణంగా మరోసారి కార్పొరేటర్లతో ఎంపీ సమావేశం కాలేకపోయారట. ఈ నేపథ్యంలో క్రిస్మస్ వేడుకల కోసం జిల్లాకు వచ్చిన జగన్ ఎంపీ అవినాష్ రెడ్డి, మేయరు సురేశ్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషాలతో కలిసి 36 మంది కార్పొరేటర్లు, వారి కుటుంబ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లతో ఇడుపులపాయలో సమావేశమయ్యారు. అసంతృప్తిగా ఉన్న కార్పొరేటర్లను నేరుగా బుజ్జగించే ప్రయత్నం చేశారంటమీరు పార్టీ మారొద్దు.. మిమ్మల్ని బాగా చూసుకుంటాను.. నేను కూడా 16 నెలలు జైలులో ఉన్నా ను.. ఇప్పుడు కూడా ఎన్నో కష్టాలు వస్తాయి.. కేసులు పెడతారు. బెదిరింపులకు దిగుతారు? రాబోవు రోజుల్లో మరింత సీరియస్ గా ఉంటుంది? మీరు పార్టీలో ఉండండి.. మళ్లీ అధికారంలోకి వచ్చాక అందర్నీ బాగా చూసుకుంటానని కార్పొరేటర్లతో చెప్పారంట. 2019లో అధికారంలోకి వస్తే బిర్యాని తినిపిస్తామని చెప్పారు కదా సార్? కనీసం దాని వాసన కూడా మమ్మల్ని చూడనీయలేదు.. అధికారంలో ఉన్నప్పుడు మమ్మల్ని పట్టించుకోలేదు ?అంటూ కొందరు కార్పొరేటర్లు జగన్ ముందే ఆవేదన వ్యక్తం చేశారంట.రాష్ట్ర పర్యటనకు ముందు కడప జిల్లాలో పార్టీని వైఎస్ జగన్ సరిదిద్దుకోవాల్సి ఉంది. లేకపోతే వచ్చేఎన్నికలలో అసలుకే మోసం వచ్చే ప్రమాదం కనిపిస్తుంది. అందుకే కడప జిల్లా నేతలతో వరసగా సమావేశం అవుతూ పార్టీని బలోపేతం చేసే దిశగా జగన్ ప్రయత్నిస్తున్నారు. కడప జిల్లాలో కొత్త నాయకత్వానికి పగ్గాలు అప్పగించాలన్న డిమాండ్ కూడా వినపడుతుంది.

# ముందుకు రాని వైసీపీ నేతలు...

విశాఖపట్టణం, డిసెంబర్ 27 వైసీపీ నుంచి జంప్ అయ్యే వాళ్లు జంప్ అయ్యారు. పార్టీలో ఉన్న నేతలు మాత్రం జెండా మోసేందుకు ఆసక్తి చూపడం లేదట. పార్టీ మారేందుకు దారులు వెతుకున్నా.. కూటమి పార్టీలు జాయిన్ చేసుకునే పరిస్థితి లేదు. పోనీ వైసీపీలోనే ఉండి కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామంటే.. తమను ఎక్కడ కార్నర్ చేస్తారో.. ఏ కేసులో అరెస్ట్ చేస్తారో..ఏ స్కామ్‌ను బయటికి తీస్తారో అని టెన్షన్ పడుతున్నారట ఫ్యాన్ పార్టీ లీడర్లు.

ఎన్నికల్లో ఘోరమైన ఓటమి తర్వాత మెల్లమెల్లగా కోలుకుంటోంది వైసీపీ. ఓ పక్క పార్టీలో నేతలు ఒక్కొక్కరుగా వెళ్ళిపోతున్నా..నిత్యం ప్రభుత్వ తప్పిదాలు ఎత్తి చూపుతూ ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తోంది. అంతేకాకుండా కొన్ని అంశాలపై పోరుబాటకు పిలుపునిచ్చింది వైసీపీ. అయితే అధినేత పిలుపునిచ్చిన కార్యక్రమాలపై పార్టీ నేతల నుంచి డిఫెరెంట్ ఓపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయి.

ఇటీవల వైసీపీ అధినేత మూడు అంశాలపై నిరసన కార్యక్రమాలకు పిలుపిచ్చినా.. నేతలు అంతగా రెస్పాండ్ అవ్వడం లేదు. ఎన్నికల్లో ఓటమి తర్వాత డీలా పడిపోయిన చాలామంది నేతలు అప్పుడే నిరసన కార్యక్రమాలు అంటే ఆసక్తి చూపడం లేదట. ఇప్పటికే కొందరు మాజీమంత్రులు, కీలక నేతలు, చాలామంది మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకు దూరంగా ఉంటున్నారు. ఒకవైపు ఓటమి బాధ..మరోవైపు కేసుల భయంతో పార్టీ యాక్టివిటీస్‌ను పెద్దగా పట్టించుకోవడం లేదట ఫ్యాన్ పార్టీ లీడర్లు.రైతు సమస్యలు, ధాన్యం కొనుగోలు, విద్యుత్ చార్జీల భారం, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది వైసీపీ అధిష్టానం. అయితే ఈ నెల 13న జరిగిన ధాన్యం కొనుగోలు నిరసన కార్యక్రమానికి ఆశించిన స్థాయిలో లీడర్లు, క్యాడర్ పార్టిసిపేట్ చేయలేదు. అక్కడక్కడ మాత్రమే ధర్నాలు చేశారు నేతలు. జిల్లా కేంద్రాల్లో జరిగిన నిరసనలకు పెద్దగా రెస్పాన్స్ రాలేదని వైసీపీ నేతనే చర్చించుకుంటున్నారు. బయటికి వచ్చిన కొందరు నేతలను పోలీసులు అరెస్టు విద్యుత్ భారంపై నిరసనలకు పిలుపునిచ్చింది వైసీపీ. దాంతో పాటు ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని జనవరి 3న ఆందోళన చేయబోతున్నారు. అయితే అప్పుడే నిరసనలు, ధర్నాలు అంటే ఎలా అంటూ లోలోపల గునుక్కుంటున్నారట పార్టీ నేతలు. ఒక పక్క ఓటమి ఎఫెక్ట్.. మరోవైపు కేసులు.. ఇలాంటి పరిస్థితుల్లో కార్యక్రమాలు అంటే కష్టం అంటున్నారట. గ్రౌండ్ లెవల్‌లో పరిస్థితి అర్థం చేసుకోకుండా నిరసనలకు పిలుపునివ్వడం సరికాదని ఒకరి దగ్గర ఒకరు గుసగుస పెట్టుకుంటున్నారట. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు మాత్రమే అయింది. ఇంకా కొంత సమయం తర్వాత ఇలాంటి కార్యక్రమాలు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారట కొందరు నేతలు..పార్టీ నేతలు ఎవరూ ఈ విషయాలను డైరెక్టుగా అధిష్టానం పెద్దలకు చెప్పే ప్రయత్నం చేయడం లేదు. వైసీపీ అధినాయకత్వం మాత్రం..నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఒత్తిడి తెస్తుంది. ఆరు నెలలు సమయం చాలా ఎక్కువ అని అంతేకాకుండా ప్రజలు ఈ మూడు అంశాలపై ఇబ్బందులు పడుతున్నారని..అపోజిషన్‌గా ఆందోళన నిరసనలు చేస్తే ప్రభుత్వంలో కదలిక వస్తుందని చెప్తున్నారట అధిష్ఠానం పెద్దలు. దీంతో అటు అధిష్టానం ఒత్తిడి ఇటు క్యాడర్ నుంచి సపోర్ట్ లేక, మరో పక్క కేసుల భయంతో సతమతం అవుతున్నారట ఫ్యాన్ పార్టీ లీడర్లు. చూడాలి మరి రాబోయే రెండు నిరసన కార్యక్రమాలకు..వైసీపీ క్యాడర్, లీడర్ల నుంచి ఏ స్థాయిలో రెస్పాన్స్ ఉంటుందో.

## సిద్దేశ్వరస్వామికి రుద్ర కవచం సమర్పించిన మంత్రి పొన్నం

హుస్నాబాద్ అన్నపూర్ణ సమేత సిద్దేశ్వర స్వామికి మంత్రి పొన్నం ప్రభాకర్ రుద్ర కవచం సమర్పించారు. హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేసి సిద్దేశ్వర స్వామి ఆలయం వద్దకు పాదయాత్ర గా రుద్రకవచాన్ని తీసుకుపోయారు. తరువాత సిద్దేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి రుద్రకవచాన్ని స్వామి వారికి సమర్పించారు. పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు..

# కాగితాల్లోనే తగ్గిన మద్యం ధరలు

ఒంగోలు, డిసెంబర్ 27, ఆంధ్రప్రదేశ్ మద్యం విక్రయాల్లో ఎక్సైజ్ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో ప్రభుత్వానికి విమర్శలు తప్పడం లేదు. మద్యం ధరల్ని తగ్గించాలని, ప్రజలపై భారం తగ్గించాలని ముఖ్యమంత్రి స్థాయిలో భావిస్తున్నా అధికారుల నిర్వాకంతో విమర్శలు తప్పడం లేదు. దీంతో ధరల తగ్గింపు కాగితాలకు పరిమితమవుతోంది.ఆంధ్రప్రదేశ్‌లో మధ్య శ్రేణి మద్యం బ్రాండ్ల ధరలు తగ్గిస్తున్నట్టు వారం రోజుల క్రితం లీకులు వచ్చినా దుకాణాలకు మాత్రం స్టాకు చేరలేదు. ఏపీలో గత అక్టోబర్ 16 నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ధరల్ని తగ్గిస్తామని ప్రకటించినా ఆచరణలో మాత్రం అమలు కాలేదు. ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేట్ మద్యం దుకాణాలు మాత్రమే ఏర్పాటయ్యాయి. లిక్కర్ వ్యాపారం మొత్తం రాజకీయ నేతల కనుసన్నల్లోనే సాగుతుందనే విమర్శలు వచ్చాయి.ఏపీలో మద్యం ధరలపై పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో ముఖ్యమంత్రి ఎక్సైజ్ సమీక్షల్లో చర్యలు చేపట్టాలని పొరుగు రాష్ట్రాలకు తగ్గట్టుగా ధరలు తగ్గించాలని సూచించారు. ఈ నేపథ్యంలో గత నెలలో మూడు బ్రాండ్ల ధరలు తగ్గించారు. తాజాగా క్వార్టర్ రూ.200కు పైబడిన మద్యం బ్రాండ్ల ధరలు తగ్గించాలని నిర్ణయించారు. వీటిలో బ్రాందీ, విస్కీ, రమ్, వొడ్కా వంటి మద్యం రకాలున్నాయి. అయితే కొత్త ధరల గురించి దుకాణాలకు ఇంత వరకు సమాచారం లేదని తెలుస్తోంది. ధరలు తగ్గిన బ్రాండ్లలో మాన్షన్ హౌస్ ఒకటి. ఏపీలో ప్రముఖ సినీనటుడి అభిమాన బ్రాండుగా దీనికి గుర్తింపు ఉంది. 2019లో టీడీపీ ప్రభుత్వం గద్దె దిగే సమయానికి మాన్షన్ హౌస్ క్వార్టర్ రూ.110 ఉన్న మద్యాన్ని వైసీపీ హయంలో ఓ దశలో రూ.300కు విక్రయించారు. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ధరలు తగ్గించి చివరకు రూ.220కు ఫిక్స్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అవే ధరలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మాన్షన్ హౌస్ బ్రాందీ క్వార్టర్ ధర రూ.220 నుంచి రూ.190కి తగ్గింది. అదే బ్రాండ్ హాఫ్ బాటిల్ ధర రూ.440 నుంచి రూ.380కి, ఫుల్ బాటిల్ ధర రూ.870 నుంచి రూ.760కి తగ్గించారు. 2019 జూన్ నాటికి మాన్షన్ హౌస్ 760 ఎంఎల్ బాటిల్ రూ.430 ఉండేది. వన్ లీటర్ బాటిల్ రూ.490కు విక్రయించేవారు.రాయల్ చాలెంజ్ సెలెక్ట్ గోల్డ్ విస్కీ క్వార్టర్ ధర రూ.230 నుంచి రూ.210కి తగ్గింది. ఇదే బ్రాండ్ ఫుల్ బాటిల్ ధర రూ.920 నుంచి రూ.840కి తగ్గించారు. యాంటిక్విటీ బ్లూ విస్కీ ఫుల్ బాటిల్ ధర రూ.1600 నుంచి రూ.1400కు తగ్గింది. ప్రస్తుతం రెండు బ్రాండ్ల ధరలు మాత్రమే తగ్గడం, అవి కూడా పాపులర్ లిక్కర్ బ్రాండ్లు కావడంతో జనంలో అసహనం తప్పడం లేదుక్వార్టర్ రూ.200కు పైబడిన మద్యం బ్రాండ్లలో క్వార్టర్ ఎక్సోఓ బ్రాందీ రూ. 290, మాన్షన్ హౌస్ రూ.220, కొరియర్ నెపోలియన్ గ్రీన్ రూ.300, కొరియర్ నెపోలియన్ ఫ్రెంచ్ బ్రాందీ రూ.230, 8పిఎం విస్కీ రూ.210, స్టెర్లింగ్ రిజర్వ్ బి7 విస్కీ రూ.230, కైరాన్ రేరెస్ట్ రూ.300, రాయల్ గ్రీన్ రూ.220, అరిస్టోక్రాట్ ప్రీమియం రూ.230, మాన్షన్ హౌస్ ఆరెంజ్ రూ.240, బ్రిటిష్ ఎంపైర్ రూ.230, జునో పింక్ వొడ్కా రూ.270, ఆల్ సీజన్ డబుల్ బారెల్ విస్కీ రూ.210గా ఉంది.ఓల్డ్ హ్యాబిట్ విస్కీ క్వార్టర్ రూ. 210, నికోల్స్ గోల్డ్, ప్రీమియం ఫెంచ్ బ్రాందీ రూ.210, రాయల్ ఎన్వీ ఎక్స్‌క్లూజివ్ ప్రీమియం విస్కీ రూ.430, స్టెర్లింగ్ రిజర్వ్ బి10 ఒరిజినల్ విస్కీ రూ.320, న్యూ కింగ్ లూయిజ్ ఫ్రెంచ్ బ్రాందీ రూ.240, సీగ్రామ్ రాయల్ స్టాగ్ క్లాసిక్ విస్కీ రూ.230, సీగ్రామ్ బ్లెండర్స్ ప్రైడ్ ప్రీమియం విస్కీ రూ.360, విఎస్ఓపీ డీలక్స్ బ్రాండెట్ విస్కీ రూ.210, ఓల్డ్ మంక్ రమ్ రూ.230, బ్యాగ్ పైపర్ గోల్డ్ విస్కీ రూ.230గా ఉంది.మెలిసా ప్రీమియం విస్కీ క్వార్టర్ రూ.220, ఫ్లోరెన్స్ రేరెస్ట్ రూ.210, జోర్జీస్ ప్రీమియం రూ.250, వైల్ అండ్ బ్లూ విస్కీ రూ.210, హాక్సన్ నోబుల్ రిజర్వ్ రూ.210, గ్రాంటన్ ఎక్సోఓ రూ.200, స్టెర్లింగ్ బి7 ప్రైమ్ విస్కీ రూ.230 ఉన్నాయి.వీటిలో మాన్షన్ హౌస్ బ్రాందీ, రాయల్ ఛాలెంజ్ విస్కీ ధరలు మాత్రమే క్వార్టర్‌పై రూ.30 వరకు తగ్గాయి. మిగిలిన బ్రాండ్ల ధరలు పాతవే కొనసాగుతున్నాయిక్వార్టర్ బాటిల్ రూ.200 దాటిన మద్యం బ్రాండ్ల ధరలు తగ్గుతాయని మద్యం విక్రేతలు చెబుతున్నారు. మద్యం డిస్టిలరీల నుంచి ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్‌కు చేరిన మద్యం నిల్వలు సంక్రాంతి పండుగ అమ్మకాలతో పాటు జనవరి నెలాఖరు వరకు సరిపోతాయని చెబుతున్నారు. దీంతో మద్యం తగ్గింపు ధరలు ఇప్పట్లో అమల్లోకి రాకపోవచ్చని చెబుతున్నారు.దాదాపు పది బ్రాండ్ల మద్యం ధరలు తగ్గుతాయని గత వారం రోజులుగా ప్రచారం జరుగుతున్నా దానిపై ఎక్సైజ్ శాఖ ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మద్యం ధరలు తగ్గిస్తే లాభాలు తగ్గుతాయనే ఉద్దేశంతోనే ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో మద్యం ధరల్ని సవరించినపుడు తక్షణం అమల్లోకి వచ్చేలా ఉత్తర్వులు జారీచేసేవారు. ఇప్పుడు ధరలు తగ్గుతున్నట్టు లీకులు ఇస్తున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి బిన్నంగా ఉంది.ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆర్నెల్లు దాటింది. మద్యం ధరల తగ్గింపు మాటటుంచితే ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుతో ప్రభుత్వ ఆదాయం కూడా కోల్పోయిందనే విమర్శలు ఉన్నాయి. మద్యం ధరలపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. త్వరలో ఈ కమిటీ అన్ని బ్రాండ్ల కంపెనీలతో చర్చించి ధరల సవరణపై సిఫారసు చేయనుంది. అందుకు అనుగుణంగా కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. కమిటీ నిర్ణయించక ముందే కొన్ని బ్రాండ్లు రేట్లు తగ్గించుకుంటున్నాయి. మరో రెండు ప్రముఖ బ్రాండ్ల మద్యం ధరలు రెండు మూడు రోజుల్లో ధరలు తగ్గించనున్నాయి.హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో మద్యం ధరల సవరణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ అన్ని కంపెనీలతో ధరల సవరణపై చర్చలు జరపనుంది. బాటిల్ తయారీకి ఎంత ఖర్చు అవుతుంది? ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్న ధరలను పరిశీలించనుంది. ఏపీ, తెలంగాణలో విక్రయించే బ్రాండ్ల ధరల్లో భారీ వ్యత్యాసాలుంటే వాటిని ప్రశ్నించే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా ధరలు తగ్గిస్తున్నాయని చెబుతున్నారు.

# తెరపైకి పరకామణి ఇష్యూ...



తిరుమల, డిసెంబర్ 27, తిరుమలలో జరిగిన లీలలు ఒకొక్కటిగా బయటపడుతున్నాయి. అక్కడి ఓ ఉద్యోగి కన్ను శ్రీవారి హుండీపై పడింది. ఆ వ్యక్తి పెద్ద జియ్యంగార్ తరపున పని చేశాడట. ఏళ్ల తరబడి శ్రీవారి పరకామణిలో ఫారెన్ కరెన్సీ, నగలు కొల్లగొట్టాడు. అతడ్ని పట్టుకున్న అధికారులు, అతడితో రాజీ పడినట్టు తెలుస్తోంది. చివరకు దొంగిలించిన మనీ ద్వారా కూడబెట్టిన ఆస్తులను కొంతమంది అధికారులు రాయించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది.కరోనా సమయంలో జరిగిన ఈ వ్యవహారంపై చర్చ జరుగుతున్నా, ఇప్పుడు తారాస్థాయికి చేరింది. 2020-23 సమయంలో బంగారాన్ని ఎలాగైతే స్మగర్లు అక్రమ రవాణా చేస్తున్నారో, ఆ విధంగా శ్రీవారికి వచ్చిన విదేశీ కరెన్సీ(డైమండ్స్, అమెరికన్ కాయన్స్)ని నొక్కేశాడట సదరు ఉద్యోగి. హుండీకి వచ్చిన డాలర్లను మూడో కంటికి తెలీకుండా గుట్టుచప్పుడు కాకుండా దొంగలించాడు. సిబ్బంది చెక్ చేసినా ఎక్కడా దొరికేవాడు కాడట. దొంగతనం చేసిన తర్వాత కడుపులో ఉన్న సొత్తును చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వాటిని తొలగించుకుని వచ్చేవాడని చెబుతున్నారు. దొంగిలించిన డబ్బుతో భారీగా ప్రాపర్టీలను కొనుగోలు చేశాడు. చివరకు విజిలెన్స్ అధికారులకు ఆ వ్యక్తి అడ్డంగా దొరికిపోయాడు. దీంతో ఇంటిగుట్టు బయటపడింది. విజిలెన్స్‌లో సతీష్ కుమార్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎఫ్ఐఆర్ సైతం నమోదు చేశారు.పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేయలేదు. కొందరు టీటీడీ అధికారులు పోలీసులతో కుమ్మక్కై డీల్ సెట్ చేసుకున్నారన్నది ఫస్ట్ పాయింట్. ఎఫ్ఐఆర్ అయిన తర్వాత కేసు రిజిస్టర్ చేయకుండా ఈ వ్యవహారాన్ని లోక్ అదాలత్‌కు తీసుకెళ్లారు. ఆయన దొంగలించిన ఆస్తుల్లో 70 లేదా 80 కోట్ల రూపాయలను టీటీడీకి విరాళం ఇచ్చినట్టు చేశారు.అసలు కథ ఇక్కడే మొదలైంది. శ్రీవారికికి వచ్చిన డైమండ్స్, బంగారం రూపంలో వచ్చిన కానుకల విలువ దాదాపు 90 కోట్ల రూపాయలు ఉంటుందని ఓ అంచనా. ఓవరాల్‌గా 200 కోట్ల రూపాయల కానుకలు నొక్కేశాడు. ఆ మొత్తాన్ని కొందరు టీటీడీ అధికారులు, పోలీసులు, కొందరు వైసీపీ నేతలు రాయించుకున్నారన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై విచారణ జరిగిపించాలన్నది టీటీడీ బోర్డు భాను ప్రకాష్ ప్రధాన డిమాండ్.ఈ వ్యవహారాన్ని టీటీడీ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారాయన. ఇప్పుడు దీని చుట్టూనే తిరుగుతోంది. ఈ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానంటున్నారు. పరకామణి వ్యవహారం రాబోయే రోజుల్లో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

# నేడు ప్రముఖ మిమిక్రీ కళాకారుడు పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ జయంతి

నేరెళ్ళ వేణుమాధవ్ తెలంగాణకు చెందిన ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు.వరంగల్ పట్టణం లోని మట్టెవాడలో శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932 డిసెంబరు 28న జన్మించారు. వీరికి ధ్వన్యనుకరణ సామ్రాట్ అనే బిరుదు కూడా ఉంది. మొదట్లో చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసిన ప్రహసనాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నా అప్పటి ప్రముఖ నటులు చిత్తూరు నాగయ్య, వేమూరు గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య తదితరుల సినిమాల ప్రభావంతో మిమిక్రీ కళపై మొగ్గు చూపాడు. 1947 నుంచి ఈయన మిమిక్రీ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాడు. తెలుగులోనే కాక ఇతర భాషల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చాడు. ఐక్యరాజ్య సమితిలో కూడా ప్రదర్శన ఇచ్చాడు. 1953 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాడు. కేంద్రప్రభుత్వం ఈయనకు పద్మశ్రీ పురస్కారాన్నిచ్చి గౌరవించింది. విశ్వనాథ సత్యనారాయణ, సినారె మొదలైన ప్రముఖులు తమ రచనలను ఈయనకు అంకితమిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ, జె. ఎన్. టి. యు, కాకతీయ విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నాడు. తిరుపతిలో ఈయనకు గజారోహణం, పౌరసన్మానం జరిగాయి. ఆయన స్వయంగా నేరెళ్ళ వేణుమాధవ్ సాంస్కృతిక సంస్థను స్థాపించి ప్రతి యేటా ఒక కళాకారుడిని సన్మానించాడు. హనుమకొండలో ఆయన పేరు మీదుగా డా. నేరెళ్ళ వేణుమాధవ్ కళాప్రాంగణం నిర్మించారు.పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 2018, జూన్ 19వ తేదీ మంగళవారం నాడు తన 85వ యేట కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వరంగల్‌లోని స్వగృహంలో ఉదయం తుదిశ్వాస విడిచారు.

# మౌనమే మన్మోహనుని భాష...

మన్మోహన్ సింగ్... ఆయన ఏం చేసినా... అది ఎప్పుడూ మాటల రూపంలో ఉండేది కాదు.. చేతల రూపంలోనే చూపించేవారు. ఆయన మౌనంగా పనిచేస్తూ ఎక్కడో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించి ప్రపంచదేశాలతో పోటీగా నిలబెట్టారు. ఇలా ఆయన మౌనం ప్రపంపదేశాలకు ప్రమాదంగా మారింది. సింపుల్ చెప్పాలంటే 1986లో ఏర్పడిన బీఎస్సీ సెన్సెన్స్ 1991 నాటికి కేవలం 1000 పాయింట్లకు మాత్రమే చేరింది. అంటే 5 ఏళ్లలో సెన్సెక్స్ 1000 పాయింట్లకు ఎదిగింది. కానీ, 1992 నాటికి అది 4000 పాయింట్లకు చేరింది. దానికి కారణం ఫైనాన్స్ మినిస్టర్ గా మన్మోహన్ సింగ్ తీసుకున్న నిర్ణయాలే. ఆ తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లు వెనక్కి చూడలేదు.ఫోన్లను తయారీ చేసే కంపెనీలు చాలానే ఉన్నాయి. కానీ, ఆ ఫోన్ సామాన్యుడికి చేతికి చేరిందంటే మన్మోహన్ సింగ్ తీసుకున్న లిబరలైజేషన్ నిర్ణయమే. అంతకు ముందు ఎవరైనా ఫోన్ కనెక్షన్ పెట్టుకోవాలంటే పర్మిషన్ కోసం నెలలు తరబడి ఎదురుచూడాల్సిందే. ఒక్కోసారి అవి సంవత్సరాలు కూడా అయ్యేవి. సెలబ్రిటీ నుంచి సామాన్యుడి వరకు ఇవాళ అనుభవిస్తున్న విలాసాలు దేశానికి చేరడానికి ఆయనే కారణం. ఆర్థిక మంత్రిగా, ప్రధాని మంత్రిగా ఆయన తీసుకున్న ప్రతీ నిర్ణయం వెనక మారుమూల గ్రామంలో ఉండే ప్రజలకు ఆ ఫలితం దక్కే విధంగానే ఉండేది.ఇక్కడ కొన్ని విషయాలను మాత్రం ఖచ్చితంగా చెప్పుకోవాలి. ఆయనపై కొన్ని విమర్శలు ఉన్నాయి. మౌనమునిగా మారిపోయారని, సొంత నిర్ణయాలు తీసుకోలేదని కొందరు విమర్శిస్తూ ఉంటారు. కాకపోతే ఆయన మౌనమే ప్రత్యర్థులకు అంతుపట్టని సమాధానం. ఇంతకు ముందు చెప్పుకున్నట్టు ఆయన సమాధానం ఎప్పుడూ మాటల రూపంలో కాకుండా చేతల రూపంలోనే ఉంటుంది. ప్రభుత్వ సేవలు దేశంలోని ప్రతీ పౌరుడికి దక్కితే సరిపోదా? ఇంకా ఆయన నోరు విప్పి సమాధానం చెప్పాలా? ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్ నిర్ణయాలతో కంపెనీలు దేశానికి క్యూ కట్టాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి.ప్రభుత్వం సాయం చేస్తుందని చూడకుండా ఎవరి కాళ్ల మీద వాళ్లు నిల్చొనే పరిస్థితిని తీసుకొచ్చారు మన్మోహన్ సింగ్. 2005లో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చి గ్రామాల్లో ఉండే వారికి ఉపాధి కల్పించారు. ప్రపంచంలోనే ఓ అద్భుతమైన పథకం ఇది. ఇలా ఆయన తన పనులు ద్వారా సమాధానం చెప్పుకుంటూ పోయినపుడు ఇంకా నోరు విప్పి సమాధానం చెప్పాల్సిన అవసరం ఏముంది? ఎందుకు సమాధానం చెప్పాలి? ఏమని సమాధానం చెప్పాలి? మౌనముని అయితే ఏంటీ? మాటల మాంత్రికుడు అయితే ఏంటీ? చివరికిగా దేశ ప్రజలకు మంచి చేయడమే కదా కావాల్సింది.మన్మోహన్ సింగ్ దేశ ప్రజలకు మంచి చేశారనే మాట దగ్గర కొంతమంది కొన్ని అనుమానాలు వ్యక్తం చేస్తారు. దాన్ని కూడా ఇప్పుడే క్లియర్ చేయాల్సిన అవసరం ఉంది. ప్రైవేటేజేషన్ అంటూ మన్మోహన్ సింగ్ తీసుకున్న నిర్ణయాల వలన దేశ సంపద ప్రైవేట్ వ్యక్తులు చేతుల్లోకి వెళ్లిపోతుందని వారి ప్రధాన విమర్శ. 140 కోట్ల మంది ప్రజలకు ఉపాధి కల్పించి దేశాన్ని ముందుకు నడిపించడం ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమయ్యే పని కాదు. దేశంలోకి ప్రైవేట్ కంపెనీలను స్వాగతించపోతే ఎంతమంది ఉద్యోగాలు దొరుకుతాయి? 1980లో వచ్చిన ఆకలి రాజ్యం సినిమా దేశంలోని నిరుద్యోగాన్ని కళ్లకు కట్టినట్టు చూపించింది. డిగ్రీ, పీజీ సర్టిఫికేట్లు దేనికి పనికి రాకుండా పోయేవి. చదువులు పూర్తి చేసుకున్న యువత.. సాపాటు ఎటూ లేదు పాటైనా పాడు బ్రదర్ అని పాటలు పాడుకునే వారు.

1980లో దేశ జనాభా 70 కోట్లు మాత్రమే. ఇవాళ 140 కోట్లు మంది అయ్యారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలు తీసుకొని రాకుంటే ఇవాళ్టి 140 కోట్లమంది పరిస్థితి ఎలా ఉండేది? వేల కొద్ది ప్రైవేట్ కంపెనీలు రావడం వలన కోట్ల మందికి ఉద్యోగాలు వస్తున్నాయి. ఆ కంపెనీలు చుట్టూ టీ స్టార్, జ్యూస్ సెంటర్ అని ఇలా చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకుని మరికొంతమంది ఎవరి కాళ్ల మీద వాళ్లు నిలబడుతున్నారు. నిజమే ప్రైవేటైజేషన్ వలన ప్రైవేట్ వ్యక్తులు లాభ పడతారనే విమర్శలో కొంత నిజం ఉండొచ్చు. అయితే.. ఐదారు కోట్ల మంది జనాభా ఉండే దేశంలో ప్రభుత్వం అన్ని రకాలుగా పౌరసేవలను అందించగలదు. కానీ, భారత్ లాంటి 140 కోట్లు మంది ఉండే దేశంలో మాత్రం ప్రైవేట్ కంపెనీలు రావడంతోనే అందరికీ పని దొరకుతుంది.ఇక్కడ మరో విషయాన్ని కూడా గుర్తు చేసుకోవాలి. 2008లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంధ్యం వచ్చింది. కానీ, ఆ మాంధ్యానికి భారత్ మాత్రం చలించలేదు. ఎందుకుంటే 1991 తర్వాత మన్మోహన్ సింగ్ తీసుకున్న ఆర్థిక సంస్కరణలే దానికి కారణం. ఒకవేళ ఆయన ఆ నిర్ణయాలు తీసుకొని ఉండకపోతే 2008 నాటికి ప్రజలకు ఉపాధి అవకాశాలు లేక, ద్రవ్యోల్బణం పెరిగి ఎన్నో ఆకలి చావులు చూసి ఉండే వాళ్లం. ఈ ప్రపంచాన్ని ఎవరు కాపాడుతారు అనే సమయంలో కూడా దేశ జీడీపీ 10.8శాతం నమోదు చేసిన ఘనత మన్మోహన్ సింగ్ కే దక్కుతుంది. ప్రధానిగా మన్మోహన్ సింగ్ హయంలోనే దేశ ఆర్థిక రంగం కొత్త పుంతలు తొక్కింది. ఆయన గతంలో ఆర్థిక మంత్రిగా అనుసరించిన, తర్వాత ప్రధానిగా ఉన్నప్పుడు చేపట్టిన చర్యలతో? 2007 నాటికి భారత్ అత్యధిక జీడీపీ వృద్ధి రేటు 9 శాతాన్ని సాధించింది. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ హయాంలో.. ప్రత్యేక ఆర్థిక మండలి (ౌఇజి) చట్టం 2005 ను అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టం ప్రత్యేక ఆర్థిక మండలాల రూల్స్ 2006 నుంచి అమలు ప్రారంభం కాగా.. దేశంలోకి పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకంగా పనిచేసింది. పెట్టుబడిదారులకు ప్రభుత్వం తరఫున వసతుల కల్పన, ఇతర ప్రయోజనాలు అందించేలా రూపొందించిన ఈ చట్టం కారణంగా.. అనేక మంది దేశంలోని సెజ్ లలో పరిశ్రమల్ని నెలకొల్పారు. దీంతో..లక్షలాది ఉద్యోగాలతో పాటుగా వేలాది కోట్ల పన్నులు ప్రభుత్వాలకు సమకూరాయి. పరిశ్రమ వర్గాలు ఆ మేరకు ప్రయోజనాల్ని పొందారు.దేశంలోని పేద, వెనుకబడిన వర్గాల వారికి ఆర్థిక చేయూత అందించే ఉద్దేశ్యంతో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం రూపొందించిన అద్భుత కార్యక్రమం జాతీయ గ్రామీణ ఉపాధీ హామి పథకం. దీని ద్వారా ఇప్పటికీ..కోట్ల మంది పేదలు ఉపాధికి ఇబ్బంది లేకుండా జీవనాన్ని సాగిస్తున్నారు. 2005లో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఔఖీఇఆ ద్వారా ఏడాదిలో కనీసం 100 రోజుల ఖచ్చితమైన వేతన ఉపాధిని అందించడం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భద్రతను అందించగలుగుతుంది.స్టాటిస్టిక్స్ కమిషన్ ఏర్పాటు చేసిన రియల్ సెక్టార్ స్టాటిస్టిక్స్ కమిటీ నివేదిక ప్రకారం.. 2006-2007లో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో భారత్ 10.08% వృద్ధి రేటును సాధించింది. 1991లో ఆర్థిక వ్యవస్థ సరళీకరణ తర్వాత భారత్ నమోదు చేసిన అత్యధిక జీడీపీ గా ఆర్థిక నిపుణులు చెబుతారు. అంతకు క్రితం 1988-1989లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 10.2%గా నమోదైంది. ఆ రికార్డును అధిగమించి.. 10.08% సాధించింది.

# విరాళాల్లో బీజేపీ తర్వాత బీఆర్ఎస్సే

హైదరాబాద్, డిసెంబర్ 27 పార్టీలు మనుగడ కోసం, కార్యక్రమాల నిర్వహణ కోసం విరాళాలు స్వీకరిస్తాయి. పార్టీ కార్యకర్తల నుంచి సభ్యత్వం రూపొంలో నిధులు సమకూర్చుకుంటాయి. ఇక కొందరు వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, అభిమానులు, ఎన్నారైలు కూడా పార్టీలకు స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తుంటారు. ఇలా సేకరించిన నిధులతో పార్టీలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. 2023?24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విరాళాల వివరాలు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వెల్లడయ్యాయి. అత్యధిక విరాళాలతో బీజేపీ దేశంలో మొదటి స్థానంలో నిలిచింది. ఇక ఆశ్చర్యకరంగా అధికారంలో లేని ఓ ప్రాంతీయ పార్టీ దేశంలో విరాళాల్లో రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఈసీ వివరాలను వెబ్‌సైట్‌లో పేర్కొంది. బీఆర్ఎస్‌కు ఊహించని విధంగా విరాళాలు అందాయి. ఇక విరాళాలు పొందే విషయంలో జాతీయ పార్టీల విషయానికి వస్తే బీజేపీ మొదటిస్థానంలో ఉండగా, జాతీయ కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది.భారత ఎన్నికల కమిషన్ నివేదిక ప్రకారం.. 2023?24లో దాతలు బీజేపీకి 20 వేలకన్నా ఎక్కువ మొత్తంలో దాదాపు రూ.2,244 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తం 2022?23లో అందుకున్న మొత్తానికి మూడు రెట్లు ఎక్కువ. ఇక భారత రాష్ట్ర సమితి రూ.580 కోట్లతో దేశంలోనే అత్యధిక విరాళాలు పొందిన రెండో పార్టీగా నిలిచింది. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ కేవలం రూ.289 కోట్లతో మూడోస్థానంలో ఉంఇ. కాంగ్రెస్‌కు గతేడాది 20 వేలు అంతకన్నా ఎక్కువ విరాళాల రూపొంలో రూ.79.9 కోట్లు మాత్రమే వచ్చాయి. ఈ మొత్తం కన్నా కాంగ్రెస్ కన్నా బీజేపీకి 776.82 శాతం ఎక్కువ విరాళాలు అందాయి.ట్రస్ట్‌లు జాతీయ పార్టీలు అయిన బీజేపీ, కాంగ్రెస్‌కు ఎక్కువగా విరాళాలు అందించాయని ఎన్నికల సంఘం డేటా చెబుతోంది. అందులో బీజేపీకి రూ.723 కోట్లు రాగా, కాంగ్రెస్‌కు రూ.156 కోట్లు ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ విరాళంగా ఇచ్చింది. ఇక ఇతర పార్టీల విషయానికి వస్తే ఆమ్ ఆద్మీ పార్టీకి 2023?24 సంవత్సరానికి రూ.11.1 కోట్ల విలువైన విరాళాలు అందాయి. గతేడాది ఆప్‌కు రూ.37.1 కోట్ల విరాళాలు వచ్చాయి. ఈ ఏడాది బాగా తగ్గిపోయాయి. ఇక సీపీఎం 2022?23లో రూ.6.1 కోట్లు విరాళం పొందగా, ఈ ఏడాది రూ.7.6 కోట్లు పొందింది.ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెల్లడించే అవసరం లేదని గతంలో కేంద్రం తెలిపింది. కానీ, ఈ విషయంపై విపక్షాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. విరాళాల వివరాలు రహస్యంగా ఉంచడం ఎందుకని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. వివరాలు వెల్లడించాలని ఈసీని ఆదేశించింది. దీంతో ఈసీ ఈ ఏడాది పార్టీకి వచ్చిన వివరాలను వెల్లడించింది. ఈమేరక వెబ్‌సైట్‌లో పొందుపర్చింది.

# భారీగా పెరిగిన సన్నబియ్యం సాగు

నిజామాబాద్, డిసెంబర్ 27,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 'బోనస్' గ్యారంటీతో ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం, దిగుబడి, కొనుగోళ్ళు గణనీయంగా పెరిగాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో మొత్తం 66.78 లక్షల ఎకరాల్లో వరి సాగు నమోదు కాగా అందులో 61శాతం (40.55 లక్షల ఎకరాల్లో) సన్న రకానికి చెందిన పంట కాగా దొడ్డు రకం కేవలం 26.23 లక్షల ఎకరాలకే పరిమితమైంది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో సన్నం రకం సాగైన విస్తీర్ణం కేవలం 38 (25.05 లక్షల ఎకరాలు) శాతమే. సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించటంతో ఈసారి సన్న రకాల వరి సాగు విస్తీర్ణం అనూహ్యంగా పెరిగింది.సన్న వడ్లకు బోనస్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా రూ.939 కోట్లను చెల్లించింది. తెలంగాణ వ్యాప్తంగా 8,318 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించిన 47.01 లక్షల టన్నుల ధాన్యానికి దాదాపు 8.84 లక్షల మంది రైతులకు రూ.19,149 కోట్లను చెల్లించింది. సన్నాలకు బోనస్ పేమెంట్ దీనికి అదనం. సన్న వడ్లను సాగుచేసిన సుమారు 3.36 లక్షల మంది రైతులు బోనస్ రూపంలో రూ.939 కోట్లను అందుకోవాల్సి ఉండగా ఇప్పటికే రూ.591 కోట్లను అందుకున్నారు.గతేడాదితో పోలిస్తే దాదాపు 6 లక్షల టన్నుల వరకు ఈసారి అధికంగా దిగుబడి అయింది. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం (దొడ్డు, సన్న రకాలు కలిపి) విలువ రూ.10,903 కోట్లు కాగా రూ.10,149 కోట్ల మేర చెల్లింపులు పూర్తయ్యాయి. ఈసారి పౌర సరఫరాల విభాగం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఈదురు గాలులు, అకాల వర్షాలకు రైతులు కష్టపడి పండించిన పంటకు నష్టం వాటిల్లలేదు.కొనుగోలు కేంద్రాల ద్వారా జరిగిన ధాన్యం సేకరణలో కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, పెద్దపల్లి, సిద్ధిపేట జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి. సన్న రకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో రైతులు ఆ సాగువైపే మొగ్గు చూపారు. ఈ కారణంగానే దొడ్డు రకంతో పోలిస్తే సన్నాల సాగు గణనీయంగా పెరిగింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే డిక్లరేషన్, మేనిఫెస్టోల ద్వారా వరి పంటకు రూ.500 బోనస్ (క్వింటాల్‌కు) కాంగ్రెస్ స్పష్టమైన హామీ ఇచ్చింది. దాన్ని విశ్వసించిన రైతులు సన్నాల సాగుపై ఆసక్తి చూపారు. దిగుబడి కూడా పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ హామీని పకడ్బందీగా అమలు చేసింది.ఒకవైపు రైతులకు పంట రుణాల మాఫీ, మరోవైపు సంక్రాంతి నుంచి రైతు భరోసా సాయం విడుదల హామీ, ఇంకోవైపు సన్నాలకు ప్రత్యేకంగా (కనీస మద్దతు ధరకు అదనంగా) క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వడంతో గతేడాదితో పోలిస్తే దిగుబడి, ధాన్యం సేకరణ మెరుగుపడింది.

# ఇంతింతై... వటుడింతై...

న్యూఢిల్లీ, డిసెంబర్ 27, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తుది శ్వాస విడిచారు. అనారోగ్యానికి గురైన మన్మోహన్ సింగ్ ను కుటుంబ సభ్యులు ఢిల్లీ ఎయిమ్స్ కు తరలించగా, చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. అయితే ఆర్థికవేత్తగా ప్రత్యేక గుర్తింపు పొంది,



ప్రధానమంత్రిగా దేశానికి విశిష్ట సేవలు అందించిన మన్మోహన్ జీవితంలో ఎన్నో చెరగని పేజీలు ఉన్నాయి.పంజాబ్ ప్రావిన్స్ లో సెప్టెంబర్ 26, 1932న మన్మోహన్ సింగ్ జన్మించారు. ప్రస్తుతం మన్మోహన్ సింగ్ జన్మించిన ప్రాంతం పాకిస్థాన్లో ఉండడం గమనార్హం. దేశ విభజన తర్వాత కుటుంబంతో సహా మన్మోహన్ కుటుంబం భారతదేశానికి వలస వచ్చింది. మన్మోహన్ సింగ్ బాల్యంలోనే తన తల్లిని కోల్పోయారు. మన్మోహన్ సింగ్ ఆలనాపాలనా ఆయన అమ్మమ్మ చూసుకొనేవారట.మన్మోహన్ సింగ్ బాల్యంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారని చెప్పవచ్చు. కనీసం కరెంట్ కూడా లేని గ్రామంలో, దీపం వెలుగులోనే చదువుకునే వారట. మన్మోహన్ సింగ్ అమృత్సర్లోని హిందూ కళాశాలలో చదివారు. ఆ తర్వాత పంజాబ్ యూనివర్సిటీ నుండి బ్యాచిలర్స్, మాస్టర్స్ పొందారు. అంతేకాదు కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుండి తన ఎకనామిక్స్ ట్రిపోస్ చేసి, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుండి ఆఖఫ్తతిశ్రీ చదివారు.మన్మోహన్ 1966 నుండి 1969 వరకు యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం పనిచేశారు. లలిత్ నారాయణ్ మిశ్రా సహకారంతో విదేశీ వాణిజ్య మంత్రిత్వ శాఖకు సలహాదారుగా కూడా పనిచేశారు. 1972లో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిత్వ శాఖలో ముఖ్య సలహాదారుగా, 1976లో ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.1982లో మన్మోహన్ సింగ్ ఆర్‌బీఐ గవర్నర్‌గా కూడా నియమితులయ్యారు. 1985 నుండి 1987 వరకు భారత ప్రణాళికా సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్నారు ఆసమయంలో 1987లో సింగ్‌కు పద్మవిభూషణ్ అవార్డు ఆయనకు వరించింది. 1991లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. తర్వాత 1991 జూన్‌లో పీవీ నరసింహారావు మంత్రివర్గంలో ఆర్థిక మంత్రిగా నియమితులయ్యారు.మన్మోహన్ సింగ్ 1991లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. మరలా 1995, 2001, 2007 మరియు 2013లో తిరిగి రాజ్యసభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పాలనలో మన్మోహన్ సింగ్ మే 22, 2004న భారతదేశ 14వ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రెండు దఫాలుగా పదేళ్లు ప్రధానమంత్రిగా మన్మోహన్ దేశానికి సేవలు అందించారు. 2002లో ఆయనకు అత్యుత్తమ పార్లమెంటరీ అవార్డును కూడా మన్మోహన్ అందుకున్నారు. అంతేకాదు మన్మోహన్ సింగ్ 'ప్రపంచంలోని టాప్ 100 ప్రభావవంతమైన వ్యక్తులలో ఒకరిగా తన ముద్రను వేసుకున్నారు.దేశ విభజన సమయంలో, అతను ఉన్నత పాఠశాలలో ఉన్నప్పుడు, తన తండ్రితో కలిసి పాకిస్తాన్‌ను విడిచిపెట్టి భారతదేశానికి రావాల్సి వచ్చింది.భారత ప్రధానిగా ఉన్నప్పుడు, అతను ఒకసారి పాకిస్తాన్ వెళ్లాలని అనుకున్నారని రాజీవ్ శుక్లా తెలిపారు. తాను పెరిగిన గ్రామాన్ని చూడాలనిపించింది. అతను ప్రాథమిక విద్యను అభ్యసించిన పాఠశాలను చూడాలనుకున్నాడు. ఒకసారి నేను ఆయనతో కలిసి ప్రధాని హౌస్‌లో సంభాషణ సమయంలో అతను పాకిస్తాన్ వెళ్లాలని కోరిక ఉందని మన్మోహన్ చెప్పారని రాజీవ్ శుక్లా తెలిపారు. మీ పూర్వీకుల ఇంటిని చూడాలనుకుంటున్నారా అని రాజీవ్ శుక్లా అడిగినప్పుడు, మన్మోహన్ సింగ్ బదులిచ్చారు, తన ఇల్లు చాలా కాలం క్రితం పూర్తయింది. తాను 4వ తరగతి వరకు చదివిన పాఠశాలను చూడాలని ఉందని చెప్పారన్నారు. అయితే, అతను తన ప్రాథమిక విద్యను అభ్యసించిన పాఠశాలను చూసే అవకాశం అతనికి ఎప్పుడూ లేదు. కానీ అతను పాకిస్తాన్‌లోని గాహ్ గ్రామంలో చదివిన పాఠశాలను ఇప్పుడు మన్మోహన్ సింగ్ ప్రభుత్వ బాలుర పాఠశాలగా మార్చేశారు.అదే గాహ్ గ్రామంలో నివసించిన రాజా మహ్మద్ అలీ, మన్మోహన్ సింగ్ క్లాస్‌మేట్ అని, తాను నాలుగో తరగతి వరకు మన్మోహన్‌తో కలిసి చదువుకున్నట్లు మీడియా కథనంలో పేర్కొన్నారు. తర్వాత మన్మోహన్ సింగ్ చదువుల కోసం చక్వాల్ పట్టణానికి వెళ్లారు. దేశ విభజన తర్వాత ఆయన కుటుంబం ఇండియాకు వెళ్లిపోయింది. కానీ నేటికీ గాహ్ గ్రామ ప్రజలు ఆయనను గుర్తుంచుకుంటారు.

ఐక్యరాజ్యసమితిలో వాణిజ్య వ్యవహారాల అధికారి

1966 నుంచి1969 వరకు ఐక్యరాజ్యసమితిలో వాణిజ్య వ్యవహారాల అధికారిగా పనిచేశారు. 1969 నుంచి 1971 మధ్య ఢిల్లీ వర్సిటీ, అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1972-76 ఆర్థికశాఖలో ముఖ్య ఆర్థిక సలహాదారుగా ఉన్నారు. 1976 నుంచి 1980 వరకు రిజర్వు బ్యాంకు డైరెక్టర్‌గా పనిచేశారు. ఐడీబీఐ డైరెక్టర్, ఆసియా అభివృద్ధి బ్యాంకు భారత్ విభాగం గవర్నర్, ఐబీఆర్‌డీ భారత విభాగం గవర్నర్‌గా మన్మోహన్ సేవలందించారు. 1982-85 మధ్య ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేశారు మన్మోహన్ సింగ్. 1985-87 మధ్య కాలంలో ప్రణాళికా సంఘం అధిపతిగా పనిచేశారు మన్మోహన్ సింగ్.

తొలిసారి రాజ్యసభలో అడుగు

అక్టోబర్ 1991లో తొలిసారి రాజ్యసభలో అడుగుపెట్టారు మన్మోహన్ సింగ్. 1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు మన్మోహన్ సింగ్. 1998 నుంచి 2004 వరకు రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ఐదుసార్లు అసోం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు మన్మోహన్ సింగ్.

13వ భారత ప్రధానిగా బాధ్యతలు

2004లో సార్వత్రిక ఎన్నికల్లో యూపీఏ కూటమి గెలిచాక 13వ భారత ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు మన్మోహన్ సింగ్. 2004 నుంచి 2014 వరకు రెండుసార్లు దేశ ప్రధానిగా పనిచేశారు. పదేళ్ల పాటు సుదీర్ఘకాలం ప్రధానమంత్రిగా పనిచేసి దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశారు . ప్రధానిగా రోజుకు 18 గంటలు పనిచేశారు మన్మోహన్ సింగ్. పార్లమెంటు సభ్యుడిగా దాదాపు 33 ఏళ్ల పాటు కొనసాగారు. ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లోనూ కీలక సమయాల్లో ఓపిగ్గా సభకు వచ్చి అందరిలోనూ స్ఫూర్తి నింపారు మన్మోహన్ సింగ్.

పద్మ విభూషణ్ అవార్డు

1987లో మన్మోహన్ సింగ్ పద్మ విభూషణ్ అవార్డు అందుకున్నారు. 2017లో ఇందిరాగాంధీ శాంతి బహుమతి, 1993, 94లో ఉత్తమ ఆర్థిక మంత్రిగా యూరో మనీ అవార్డు అందుకున్నారు. 2010లో మన్మోహన్ సింగ్‌ను వరల్డ్ స్టేట్స్ మెన్ అవార్డు వరించింది. ఫోర్బ్స్ అత్యంత శక్తివంతుల జాబితాలోనూ మన్మోహన్‌కు చోటు దక్కింది.మన్మోహన్ సింగ్ మృతితో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలన్నీ రద్దు చేసింది కేంద్రం. ప్రభుత్వ లాంఛనాలతో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు జరగనున్నాయి.

# తెలుగు రాష్ట్రాలపై సింగ్ ముద్ర

హైదరాబాద్, డిసెంబర్ 27, మన్మోహన్ సింగ్‌కు తెలుగు రాష్ట్రాలతో విడదీయలేని అనుబంధం ఉంది. ప్రధానిగా పేదలకు ఉపయోగపడే పథకాలను తీసుకొచ్చారు మన్మోహన్ సింగ్. పేదలు పస్తులు ఉండొద్దన్న ఉద్దేశంతో పనికి ఆహార పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆ పథకాన్ని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రారంభించారు. అనంతపురంలో ఉపాధి హామీ పథకాన్ని లాంచ్ చేశారు మన్మోహన్ సింగ్. ఈ పథకం యూపీఏ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చి పెట్టింది. అలాగే పేదల కడుపు నింపింది.మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కాంగ్రెస్ ఏపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారని.. కేంద్ర కేబినెట్‌లో ఉన్న ఏపీ నేతలు రాజీనామా చేస్తామన్నా మన్మోహన్ సింగ్ వెనక్కి తగ్గలేదన్నారు హస్తంపార్టీ నేతలు. పార్లమెంట్‌లో రచ్చజరిగినా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు మన్మోహన్ సింగ్. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ చేయించేందుకు మన్మోహన్ సింగ్ కీలక భూమిక పోషించారన్నారు అప్పటి కేంద్రహోంమంత్రి షిండే .కాంగ్రెస్ అధికారం కోల్పోయాక విభజన సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేశారు మన్మోహన్ సింగ్. విభజన హామీలన్నీ కేంద్రం నెరవేర్చాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనన్నారు మన్మోహన్ సింగ్. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే తప్పకుండా ప్రత్యేక హోదా ఇచ్చేవాళ్లమన్నారు.మన్మోహన్ సింగ్ మరణం పట్ల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు సెలవు ప్రకటించారు తెలంగాణ సీఎం. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ కృషి ఎప్పటికీ మరవలేమన్నారు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

ప్రముఖుల సంతాపం

ప్రముఖ ఆర్థిక వేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తీవ్రగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని అన్నారు. ఆయన ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఒక ఆర్థిక వేత్తగా, ఒక అధ్యాపడిగా, రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, ప్రధానమంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహించి పదేళ్లపాటు ప్రధానమంత్రిగా ఆయన దేశంలో అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పూడ్చలేనిదని అన్నారు. మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ క్రమంలో దేశ ప్రధాని మోదీతోపాటు పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ఆయన మృతిపట్ల సంతాపం తెలిపారు.

ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణ వార్త తీవ్రగ్భ్రాంతికి గురిచేసిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజ్ఞానం, వినయం, నిబద్ధతకు మన్మోహన్ సింగ్ ప్రతీకని కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా తీసుకొచ్చిన సంస్కరణల నుంచి ప్రధానమంత్రిగా దేశానికి వెలకట్టలేని సేవలందించారని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంతాపం

మన్మోహన్ మృతిపట్ల ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంతాపం తెలిపారు. భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ దివంగతులయ్యారని తెలిసిగ్భ్రాంతికి లోనయ్యానన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని, దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణల ఆద్యులలో ఆయన ఒకరని కొనియాడారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, యూజీసీ ఛైర్మన్‌గా విశిష్ట సేవలందించిన ఆయన ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మన్మోహన్ సింగ్ హయాంలో చేపట్టిన సంస్కరణల వల్ల మన ఆర్థిక వ్యవస్థ కొత్త పుంతలు తొక్కింది. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. మన్మోహన్ సింగ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్గ్భ్రాంతి

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్గ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. భారత ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగడం చారిత్రక సందర్భం అని కేసీఆర్ అన్నారు. ఈ మేరకు కేసీఆర్ సంతాపం ప్రకటించారు.

ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం

భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం పట్ల మాజీ సీఎం, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం దేశానికి తీరని లోటన్నారు. పదేళ్లపాటు దేశ ప్రధానిగా గొప్ప సేవలందించారని ప్రశంసించారు. ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా ఆర్థిక సంస్కరణలతో దేశ పురోభివృద్ధికి ఎంతగానో కృషిచేశారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ సలహాదారుగా, ఆర్థికశాఖ ప్రధాన సలహాదారుగా, ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా, ప్రణాళిక సంఘం ఛైర్మన్‌గా, ప్రధాని సలహాదారుగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ చైర్మన్‌గా.. ఇలా ఎన్నో బాధ్యతలు నిర్వహించిన మన్మోహన్ సింగ్ గొప్ప మేధావి అని కొనియాడారు. దేశంలో పేదరికాన్ని పారదోలేందుకు డాక్టర్ మన్మోహన్ సింగ్ అసమాన సేవలందించారని, ఆయన కలకాలం ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. ఏ బాధ్యత నిర్వహించినా.. ప్రతి చోటా తనదైన ముద్ర కనబర్చారని గుర్తు చేశారు. ఆయన దార్శనికత ఎప్పటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ మృతితో దేశం ఒక మహా నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## అల్ట్రాటెక్ యాజమాన్యానికి జేసీ క్షమాపణ

అనంతపురం అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమకు బూడిద రవాణా చేసే లారీల విషయంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తో కొన్ని రోజులుగా కొనసాగుతున్న వివాదంపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. అనంతపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యానికి జేసీ క్షమాపణ చెప్పారు. ఆదినారాయణరెడ్డితో జరుగుతున్న గొడవతో పరిశ్రమకు, అక్కడ పనిచేసే వేలాది మంది కార్మికులకు నష్టం జరగకూడదనే సారీ చెబుతున్నట్లు జేసీ పేర్కొన్నారు.తమకు బూడిద రవాణా చేసే పర్మిట్ ఎంతో కాలంగా ఉందని జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. డబ్బుల కోసమే బూడిద రవాణా చేసే లారీలను ఆపామని కొందరు ఆరోపిస్తున్నారని.. దీనిలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు.

# ఆర్థిక వ్యవస్థపై ఆయన ముద్ర

న్యూఢిల్లీ, డిసెంబర్ 27, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్‌బీఐ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, భారత ప్రధానిగా కీలక పదవులు నిర్వర్తించారు. ఆయన ఏం చేసినా దేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే నిర్ణయాలు తీసుకున్నారు. పీవీ నర్సింహారావుతో కలిసి చేసిన సంస్కరణలతో దేశం ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కింది. ఇక భారత 13వ ప్రధానిగా మన్‌మోహన్‌సింగ్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ తర్వాత ఎక్కువ కాలం పనిచేసిన ప్రధానిగా గుర్తింపు పొందారు. 13వ ప్రధానిగా (2004?2014) రెండు పర్యాయాలు పనిచేశారు. పూర్తికాలం ప్రధానిగా పనిచేసిన తొలి సిక్కు నేతగా గుర్తింపు పొందారు. ప్రధానిగా పనిచేసే సమయంలో దేశం అనేక ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాల్లో కీలక మార్పులు తీసుకువచ్చారు.ప్రధానిగా దేశ ఆర్థిక వృద్ధికి పటిష్టమైన బాటలు వేశారు. ప్రస్తుతం ప్రపంచంలో దేశం ఆర్థికంగా ఐదో స్థానంలో నిలవడానికి ప్రధానిగా మన్‌మోహన్ సింగ్ వేసిన బాటలే కారణంగా చెప్పవచ్చు. మన్‌మోహన్‌సింగ్ ప్రధానిగా పనిచేసిన కాలంలో దేశ ఆర్థిక వృద్ధి 7 శాతం నుంచి 9 శాతంగా నమోదైంది. సింగ్ నాయకత్వంలో విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరిగింది, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలిచింది. పన్నుల విధానాలను సరళీకృతం చేసి, పన్నుల పాలనను మరింత సమర్థవంతంగా మార్చారు. 2005లో ప్రవేశపెట్టిన ఈ పథకం, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి, ప్రజలకు కనీస పనీ, వేతనాలు అందించేలా రూపొందించబడింది. 2005లో ప్రారంభించిన ఈ చట్టం, ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని పొందే హక్కు ఇచ్చింది, తద్వారా పారదర్శకత మరియు ప్రభుత్వ వ్యూహాలపై నియంత్రణ పెరిగిందిప్రధానిగా మన్‌మోహన్‌సింగ్ దేశ ఆర్థిక రంగాన్ని పరుగులు పెట్టించారు. సేవారంగంలోనూ విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారు. ఆయన ప్రభుత్వం ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి అనేక పథకాలు తీసుకువచ్చింది. ఈ పథకాల ద్వారా ఆరోగ్య సేవలకు మరింత ప్రజాస్వామ్యాన్ని అందించే ప్రయత్నం జరిగింది. 2009లో పాఠశాల విద్యాహక్కు చట్టం ద్వారా 14 ఏళ్లలోపు పిల్లలకు విద్యను నిర్బంధం చేశారు. డాక్టర్ సింగ్ 2005లో అమెరికాతో డిఫెన్స్, పౌరాణికత, శాంతి పరిరక్షణలో మరింత సానుకూల సంబంధాలు ఏర్పరచారు. 2008లో, అణు ఒప్పందం భారతదేశానికి అమెరికాతో అణు శక్తి వినియోగంలో సహకారం అందించడానికి అనుమతించింది. సింగపూర్, చైనా, జపాన్, రష్యా వంటి దేశాలతో వాణిజ్య, రక్షణ సంబంధాలను మరింత బలపర్చారు.మన్‌మోహన్‌సింగ్ యూపీ పాలనలో స్వతంత్రంగా అభిప్రాయాలు ప్రకటించడంలో ముందు నడిచారు. కొన్ని సందర్భాల్లో, ఆయన రాజకీయ విభేదాలు, ఆర్థిక వ్యవహారాలు, కొంత మందికి దుర్భేద్యంగా కనిపించాయి. ఆయన నాయకత్వంపై కొంతమంది విమర్శలు చేశారు. ప్రత్యేకంగా, ఆయన 'విశాల దృష్టి' లేకపోయిందని, ఇంకా 'మౌన నాయకత్వం' అనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. కానీ, ఆయన ఆధ్వర్యంలో ఆర్థిక రంగం, విదేశీ పెట్టుబడులు, అలాగే సామాజిక సంక్షేమ రంగాలలో సాధించబడిన విజయం, భారతదేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ స్థాయిలో బలోపేతం చేశారు. ప్రధానిగా భారతదేశం ఆర్థిక, సామాజిక, అంతర్జాతీయ రంగాలలో పెరుగుదల, పురోగతి సాధించింది. ఆయన యొక్క సానుకూల ఆర్థిక విధానాలు, ప్రజా సంక్షేమ పథకాలు, దేశంలో అనేక మార్పులను తీసుకువచ్చాయి.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర ద్రిగ్భాంతి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు. 15 వ లోక్ సభ లో ఆయన ప్రధాని గా నేను లోక్ సభ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆయన తో కలిసి అనేక సమావేశాల్లో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ గొప్ప రాజనీతిజ్ఞుడు భారత ఆర్థిక వ్యవస్థలు నిలదొక్కుకోవడానికి ఆయన ఎన్నో సంస్కరణలు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. 2004 – 14 మధ్య దేశ ప్రధాని గా ఆయన ఎన్నో సేవలు చేశారని ఉపాధి హామీ , సమాచార హక్కు చట్టం తదితర చట్టాలు తెచ్చి దేశ రూపురేఖలు మార్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేసుకున్నారు. 10 సంవత్సరాలు ప్రధాని గా చేసిన అత్యంత నిరడంబరుడుగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ పాత్ర మరవలేనిది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మరణం పట్ల తీవ్ర ద్రిగ్భాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు .వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


**మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ భౌతిక కాయానికి నివాళులర్పించిన సోనియా, రాహుల్ , ప్రియాంక గాంధీ**

న్యూఢిల్లీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ భౌతిక కాయానికి సోనియా, రాహుల్ , ప్రియాంక గాంధీ నివాళుల్పించారు. మన్మోహన్ సింగ్ జీ మనకు సంరక్షకుడు మరియు మార్గదర్శకుడు వీరి గురించి మనం ఎప్పుడూ గర్విస్తాం. దేశంలోని కోట్లాది మందికి ఆదర్శంగా నిలిచారు. అతను సేవ, సరళత మరియు అంకితభావానికి ఉదాహరణ. లక్షలాది కళ్లు తడిగా ఉన్నాయని కొనియాడారు.

**మన్మోహన్ సింగ్ ఆస్తుల విలువ రూ.15 కోట్ల 77 లక్షలు**

న్యూఢిల్లీ డిసెంబర్ 27 భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్(92) నిన్న రాత్రి తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. రేపు ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. 2004 నుంచి 2014 వరకు దేశ ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ చాలా సాదాసీదా జీవితాన్ని గడిపారు. ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా తన పదవిలో కొనసాగారు. చాలా తక్కువగా మాట్లాడుతూ.. దేశానికి ఎన్నో ఉపయుక్తమైన సేవలందించారు. ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు.మన్మోహన్ సింగ్ ఆస్తుల గురించి చెప్పాలంటే? ఆయన ఆస్తుల విలువ రూ.15 కోట్ల 77 లక్షలు. రాజ్యసభలో ఇచ్చిన అఫిడవిట్ ప్రకారం.. ఢిల్లీ, చండీగఢ్‌లో ఆయనకు ఫ్లాట్ మాత్రమే ఉంది. అఫిడవిట్ ప్రకారం మన్మోహన్ సింగ్‌కు ఎలాంటి అప్పులు లేవు. డాక్టర్ మన్మోహన్ సింగ్ వినయం, పని పట్ల నిబద్ధతత చాటుకొని రాజకీయ నాయకులకు రోల్‌మోడల్‌గా నిలించారు. ప్రధాని పదవి నుంచి తప్పుకున్న తర్వాత క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. ప్రధానమంత్రి పదవిని వీడిన తర్వాత మన్మోహన్ సింగ్ తన భార్యతో నివసిస్తున్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్, భార్య గురుశరణ్ కౌర్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

# ప్రతి భారతీయుడికి స్ఫూర్తి రతన్ టాటా జీవితం -నేడు ఆయన జయంతి



పది వేల కోట్ల రూపాయలుగా ఉండవలిసిన ఒక వ్యాపార సామ్రాజ్యాన్ని ఒక్కడు ఒకే ఒక్కడు తన యుక్తి తో,తన వ్యాపార నిపుణతతో ఆరు లక్షల కోట్లకు ఎగబాకేలా చేసాడు. దాదాపు ఏడు లక్షల మందికి ఉపాధినిస్తూ,నూట యాభై ఏళ్ళ చరిత్ర కలిగిన టాటా గ్రూప్ ను అందనంత ఎత్తులో నిలబడేలా చేసాడు. నేడు ఉప్పు నుండి ఉక్కు వరకు టీ నుండి ట్రక్కుల వరకు ఇలా ప్రతి వ్యాపారంలో లోను ఖచ్చితంగా టాటా పేరు వినిపిస్తుంది.ఇంతటి ఘన చరిత్రను టాటా గ్రూప్ కు కట్టబెట్టేలా చేసాడు అతను. అతనే రతన్ టాటా. కొన్ని కోట్ల మంది భారతీయులకు ఆదర్శప్రాయడు ఈ జీవన విజేత. రతన్ టాటా గురించి చూసుకుందాం:

1937 డిసెంబర్ 28 న దేశంలోనే ధనిక కుటుంబంలో జన్మించాడు రతన్ టాటా. ఏడేళ్ల వయసులోనే తల్లి తండ్రులిద్దరూ విడిపోవటంతో నాయనమ్మ దగ్గర పెరగవలిసి వచ్చింది. తన చదువును అమెరికాలోనే పూర్తి చేసుకొని ఆర్జెడి టాటా పిలుపు మేరకు జంషెడ్ పూర్ లోని టాటా స్టీల్ కంపెనీలో అప్రెంటీస్ గా తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు రతన్. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఆలోచనలతో, తన నైపుణ్యంతో టాటా కంపెనీలో ఒక ఉత్తమ ఉద్యోగిగా ఎదిగగలిగాడు రతన్. ఆ విధంగా కొన్ని సంవత్సరాలు ఉద్యోగిగా పనిచేసిన తరువాత 1991 లో ఆర్జెడి టాటా నుండి టాటా గ్రూప్ చైర్మన్ గా భాద్యతలు స్వీకరించాడు రతన్. అప్పట్లో ఈ నిర్ణయాన్ని బోర్డు అఫ్ మెంబెర్స్ లో చాలా మంది వ్యతిరేకించారు. అనుభవం లేని రతన్ చేతిలో ఇన్ని కోట్ల వ్యాపార సామ్రాజ్యం నడవలేదని అందరు వాదించారు. కానీ వారికి ఆనాడు తెలియదు పాపం ఇతడే టాటా గ్రూప్ ను దశదిశలా వ్యాపించే ఘనుడు అవుతాడని... చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత టాటా గ్రూప్ లో సమూల ప్రక్షాళన చేసాడు రతన్. రాత్రి పగలు కష్టపడి పది వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని తన అసాధారణ వ్యాపార నైపుణ్యంతో ఆరు లక్షల కోట్ల విలువ చేసే కంపెనీగా మార్చాడు రతన్. దేశ వాణిజ్య , పారిశ్రామిక పురోగతిలో కీలక పాత్ర పోషించాడు. నేడు టాటా గ్రూప్ 90 కి పైగా దేశాలలో విస్తరించి వందకు పైగా వ్యాపారాలలో తన ముద్రను వేసి, దేశంలోనే కాదు, ప్రపంచం లోనే అత్యుత్తమ కంపెనీలలో ఒకటిగా నిలబడింది. వ్యాపార సామ్రాజ్యంలో ఒక శిఖరంగా ఎదగగలిగింది.ప్రతి మధ్య తరగతి వాడికి సొంతంగా ఒక కారు ఉండాలనే ఉద్దేశంతో కేవలం లక్ష రూపాయలకే టాటా నానో కారును మార్కెట్లోకి తెచ్చి పెను సంచలనాన్నే సృష్టించాడు రతన్.. నానో కారు ఓ సంచలనం: టాటా గ్రూప్ భారత దేశానికి ఎన్నో కొత్త కొత్త వ్యాపారాలను పరిచయం చేసింది. నేడు ఎయిర్ ఇండియా గా పిలబడుతున్న విమానయాన సంస్థను మొదట టాటాఎయిర్ లైన్స్ పేరుతో 1868 లో జంషెడ్ జీ టాటా స్థాపించాడు. కాలక్రమంలో అది కాస్త ప్రభుత్వం చేతిలోకి వెళ్ళింది. ఇప్పుడు మళ్లీ టాటా ల చేతికే వచ్చింది. అలాగే భారత దేశంలో మొట్టమొదటి హోటల్ అయిన తాజ్ హోటల్ ను ప్రారంభించింది కూడా టాటాలే. బ్రిటన్ కు చెందిన టేట్లీ అనే కంపెనీని టాటా టీ లో కలుపుకొని ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద టీ కంపెనీ గా టాటా టీ ఎదిగింది. అంతే కాదు మనల్ని పాలించిన బ్రిటిషర్లకే ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగాడు రతన్ టాటా. ఎన్నో విదేశీ కంపెనీలను టాటా గ్రూప్ లో కలుపుకొని టాటా ను ఒక మహా సామ్రాజ్యంగా ఎదిగేలా చేసాడు. 1998 లో టాటా ఇండికా కార్లను ప్రవేశ పెట్టారు. అయితే దురదృష్టవశాత్తు ఆ కార్లు మొదటి సంవత్సరంలోనే ఫెయిల్ అవటం తో రతన్ టాటా ఇండికా కార్ల వ్యాపారాన్ని అమ్మేయాలని భావించాడు. ఇందు కోసం అమెరికా లోని ఫోర్డ్ కంపెనీకి తన టీం తో పాటు రతన్ టాటా కూడా వెళ్లారు. అయితే ఫోర్డ్ కంపెనీ చైర్మన్,రతన్ టాటా ను మీకు కార్లు ఎలా తయారు చేయాలో తెలియనప్పుడు కార్ల బిజినెస్ ఎందుకు స్టార్ట్ చేసారు అని అవమానించాడు. ఈ సంఘటనతో ఆ డీల్ మాట్లాడకుండానే వెనుదిరిగి వచ్చేసారు. కొన్ని సంవత్సరాల తరువాత టాటా ఇండికా నష్టాలనుండి లాభాల లోకి రావటం మొదలు పెట్టింది.కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా , అదే సమయంలో ఫోర్డ్ కంపెనీకి చెందిన జాగ్వార్ ,లాండ్రోవర్ కార్లు భారీగా నష్టాల్లోకి వెళ్లిపోయాయి. ఆ సమయం లోనే రతన్ ఆ రెండు కంపెనీలను నేను కొంటాను అని ఫోర్డ్ కంపెనీకి ఆఫర్ చేసాడు రతన్. అప్పుడు ఫోర్డ్ కంపెనీ చైర్మన్ తన టీం తో అమెరికా నుండి ముంబై కు వచ్చాడు. ఆ విధంగా తనను అవమానించిన వారికే గుణపాఠం చెప్పాడు రతన్. నానో కార్ల ఉత్పత్తి కోసం పశ్చిమ బెంగాల్ లో ఏర్పాటు చేసిన ప్లాంటును అక్కడి రైతులు వ్యతిరేకించడంతో ,ఆ ప్లాంటు మరొక చోటుకు మార్చటంతో వేల కోట్ల నష్టాన్ని చూడవలసి వచ్చింది . పాకిస్థాన్ ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న తాజ్ హోటల్ పై జరిపిన ఉగ్ర దాడిలో వందల మంది అతిథులను, తమ ఉద్యోగస్థులను పోగొట్టుకోవాల్సివచ్చింది. ఈ సంఘటన రతన్ ను మానసికంగా ఎంతో బాధించింది. లక్షల కోట్ల విలువ చేసే కంపెనీలకు అధిపతులైనా టాటా వంశీయులు ఇంతవరకు ఏనాడూ ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో నిలవలేదు. ఎందుకంటే టాటా గ్రూప్ నుండి వచ్చే లాభాలలో 66శాతం టాటా ట్రస్టులకు విరాళంగా ఇవ్వటం జరుగుతుంది. దేశ సామజిక పరిస్థితులు మెరుగుపరచటానికి టాటా ట్రస్టులు ఎంతగానో కృషి చేస్తున్నాయి. తాజ్ ఉగ్ర దాడిలో నష్టపోయిన వారికి అన్ని విధాలా సహాయమందించాడు రతన్. బ్రహ్మచారి గా ఉంటూ నలుగురి బాగు కోసం బతుకుతున్న మహనీయుడు రతన్ టాటా. తన ప్రతిభను మెచ్చి పలు దేశాలలోని యూనివర్సిటీలు తనను గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి.

అంతే కాదు భారత ప్రభుత్వం పద్మ భూషణ్, పద్మ విభూషణ్ లతో రతన్ ను గౌరవించింది. కోట్లకు అధిపతి అయినా ఏనాడూ కుసుమంత గర్వాన్ని కూడా ప్రదర్శించలేదు రతన్ టాటా. 84ఏళ్ళ వయసులోనూ సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటూ కోట్ల మంది భారతీయుల హృదయాలను గెలుచుకున్నాడు రతన్.నేడు రతన్ టాటా అంటే ఒక వ్యక్తి కాదు,ఒక సంస్థ , ఒక బ్రాండ్. వీటన్నిటికీ మించి సృజనాత్మకత , దార్శనికత ఉన్న ఒక గొప్ప మానవతావాది.

ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రతన్ టాటా 2024 అక్టోబరు 9న 86 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. రక్తపోటు అకస్మాత్తుగా పడిపోవడంతో అక్టోబరు 7న బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆయనకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వైద్యులు చికిత్స అందించిన లాభం లేకుండా పోయింది. నేడు 130 కోట్ల మంది భారతీయులు మనసారా సగర్వంగా ఇతడు మా భారతీయుడు అని చెప్పుకునే వారిలో ముందు వరుసలో ఉంటాడు రతన్ టాటా. అతని సాగించిన జీవన ప్రయాణం నేడు మనందరికీ స్ఫూర్తిదాయకం.

# రేవంత్ ఒంటెద్దు పోకడలా...

హైదరాబాద్, డిసెంబర్ 27, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను నిర్ణయాలను ఒక్కరే తీసుకోవడం లేదు.ముఖ్యమైన నిర్ణయాలన్నీ మంత్రి వర్గ సహచరులతో చర్చించిన తర్వాతనే నిర్ణయాన్ని వెలువరిస్తున్నారు. అయితే ఈ నిర్ణయాలు పార్టీకి బలోపేతానికి ఉపయోగపడతాయా? లేదా? అన్నది పక్కన పెడితే ఏకపక్షంగా మాత్రం నిర్ణయం తీసుకోవడం లేదు. ప్రధానంగా ముఖ్యమైన అంశాల విషయంలో రేవంత్ అందరి అభిప్రాయాలను తీసుకునే ముందుకు వెళుతున్నారని నేతలే చెబుతున్నారు. అందుకే నేతల నుంచి ఆయన నిర్ణయాలకు మద్దతు ఎక్కువగా కనిపిస్తుంది. పీసీసీ చీఫ్ నుంచి కీలకమైన మంత్రుల వరకూ ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారంటే అందరినీ కలుపుకుని వెళ్లడమే ఇందుకు ప్రధాన కారణం.. ప్రధానంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఈ ఫార్ములా కారు రేస్ విషయంలో కేసు నమోదు చేయడం కూడా మంత్రి వర్గ సమావేశంలోనే చర్చించి వారిని ఒప్పించగలిగారు. అయితే కేటీఆర్ ను అరెస్ట్ చేస్తే సానుభూతి వస్తుందని ఒకరిద్దరు మంత్రులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినప్పటికీ అంత సీన్ లేదని, బీఆర్ఎస్ నేతల అవినీతి బండారాన్ని బయటపట్టేందుకు ఇటువంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని రేవంత్ రెడ్డి నచ్చ చెప్పారని తెలిసింది. కేటీఆర్ గత పదేళ్లుగా తెలంగాణ ప్రజల సొమ్మును ఎలా దోచుకుతిన్నదీ ప్రజలకు తెలయజేయవచ్చన్న కారణంతోనే కేటీఆర్ పై కేసు నమోదు చేశారన్నది కాంగ్రెస్ నేతల నుంచి వినిపిస్తున్నఒపీనియన్. సానుభూతి రాదని, కల్వకుంట్ల కుటుంబంపై జనంలో వ్యతిరేకత పెరుగుతుందని కూడా కాంగ్రెస్ నేతలు నమ్ముతున్నారు. సరే.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయం అంటే ఎన్నికలకు ముందు నుంచి ఆరోపణలు చేస్తుందే కాబట్టి, దానిపై జస్టిస్ చేత విచారణ చేయించాలని నిర్ణయించడం వరకూ సబబే. ఎందుకంటే తాము చేసిన ఆరోపణల విషయంలో నిజానిజాలు నిగ్గు తేల్చడానికి కమిషన్ ను ఏర్పాటు చేయడం వరకూ ఒకే. కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం చర్యలు తీసుకున్నా పెద్దగా రాజకీయ ఇబ్బందులుండవు. ఎందుకంటే సుదీర్ఘమైన విచారణ జరిపిన తర్వాత జస్టిస్ పినాకీ ఘోష్ సుదీర్ఘంగా విచరాన జరుపుతున్నారు. అందరినీ పిలిచి వారి అభిప్రాయాలతో పాటు సందేహాలను కూడా తెలుసుకుంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ రాజకీయ ప్రేరేపితం కాదని ప్రజలు నమ్మే వీలుంది. కానీ ఏసీబీ కేసు విషయంలో మాత్రం కొంత ప్రజల్లో అనుమానాలు కలిగే ఆస్కారం ఉంది. మరోవైపు తెలంగాణలో ఎన్టీఆర్ వంద అడుగల విగ్రహానికి స్థలం ఇస్తామని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ కూడా ఒకింత పార్టీకి ఇబ్బందిగా మారే అవకాశముందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎందుకంటే బీఆర్ఎస్ కు తెలంగాణ సెంటిమెంట్ ను రాజేయడానికి ఇది ఉపయోగపడుతుందని కొందరు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే దీనిపై రాజకీయ రగడ ప్రారంభమయింది. తెలంగాణ జర్నలిస్టులు కొందరు దీనిపై అభ్యంతరం తెలుపుతున్నారు. ఈ విషయంలోనూ అందరి అభిప్రాయాలను తీసుకుని దీనిపై నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు. ఎన్టీఆర్ ను ఆంధ్రవాదిగా చూడరని, తెలుగు జాతికి కేరాఫ్ గా చూస్తారని రేవంత్ మంత్రులను, నేతలను ఒప్పించి భూమిని కేటాయిస్తే అది ఎంత వరకూ పార్టీకి లాభదాయకం? నష్టం? అన్న చర్చ జరుగుతుంది.

# యాదగిరిగుట్ట పాలక మండలి ఎప్పుడు

నల్గొండ, డిసెంబర్ 27, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం రూ.1,250 కోట్లతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయాన్ని పునర్మించింది. ఎన్నో విశేషాలతో కొండపై పాంచనరసింహుల ఆలయ పునర్నిర్మాణం, విస్తరణ పనులు పూర్తయ్యాయి. ఉద్ఘాటన తర్వాత ఆలయానికి భక్తుల తాకిడి పెరిగిపోతోంది. నిత్యం వేలాది మంది.. సెలవు రోజుల్లో 50వేల మందికి పైగా భక్తులు వరకు ఆలయాన్ని సందర్శించి, పలు కైంకర్యాలు నిర్వహిస్తున్నారు.తెలంగాణ తిరుపతిగా భారీస్థాయిలో అభివృద్ధి చేసి ఆలయ పరిపాలనా విధానాన్ని మార్చాలని గత ప్రభుత్వం యోచించింది. ఆలయ ఉద్ఘాటన తర్వాత గత ప్రభుత్వం ఎలాంటి మండలిని ఏర్పాటు చేయలేదు.

యాదగిరిగుట్ట నర్సన్న ఆలయానికి దాదాపుగా దశాబ్దంన్నర నుంచి పాలక మండలి లేదు. చివరిసారిగా 2008లో ఏర్పడిన ధర్మకర్తల మండలి 2010 వరకు కొనసాగింది. 2010 నుంచి 2024 వరకు దాదాపుగా 14 ఏళ్లుగా పాలక మండలి లేకుండానే ఆలయ నిర్వహణ జరిగింది. ప్రత్యేక అధికారి పాలనలోనే ఆలయ పునర్నిర్మాణం జరిగింది.అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్.. ఆలయ నిర్వాహణ సక్రమంగా సాగేలా టీటీడీ తరహాలో యాదగిరిగిరిగుట్టకు ప్రత్యేక ఆలయ మండలిని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేసింది. యాదగిరిగుట్ట అభివృద్ధిపై అధికారులతో సమీక్షలు నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి పాలకమండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ప్రస్తుతం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చైర్మన్‌గా అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి వ్యవహరిస్తున్నారు. వంశపారంపర్య ధర్మకర్త లేదా కుటుంబ సభ్యుడు మాత్రమే ఆలయ బోర్డ చైర్పర్సన్ పనిచేయడానికి అర్హులని ఆలయ వ్యవహారాలు తెలిసిన వారు చెబుతున్నారు. వంశ పారంపర్య ధర్మకర్త కుటుంబంలో సభ్యుడు కాని వ్యక్తిని ఆలయ బోర్డు చైర్పర్సన్ గా నియమించాలని కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ధర్మకర్త కుటుంబంలో సభ్యుడితోపాటు18 నుంచి 20 సభ్యులతో పాలక మండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ఏర్పాటుతో ఆలయం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందనున్నదని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చెబుతున్నారు.పాలక మండలి ఏర్పాటుకు 1987 నాటి తెలంగాణ ధార్మిక, హిందూ మత సంస్థలు, ఎండోమెంట్స్ చట్టాన్ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది. యాదగిరిగుట్ట ఆలయ చట్టానికి నిర్దిష్ట సవరణ చేసి.. ధర్మకర్త కాని కుటుంబ సభ్యుడిని బోర్డు చైర్పర్సన్ నియమించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం తెలంగాణ ధార్మిక, హిందూ మత సంస్థలు, దేవాదాయ చట్టం 1987లోని సెక్షన్ 151లోని నిర్దిష్ట క్లాజులను సవరించడానికి ప్రభుత్వం సిద్ధమైంది.ఇదిలావుంటే, ఉమ్మడి రాష్ట్రంలో రోశయ్య సీఎంగా ఉన్నప్పుడు, ఆదికేశవులు నాయుడు టీటీడీ ఛైర్పర్సన్ పదవికి రాజీనామా చేసి, ఆలయ బోర్డును నియమించకుండా నిర్దేశి అథారిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీని ఆధారంగా దేవాదాయ శాఖ చట్టంలో సవరణ చేయాలని న్యాయశాఖ సూచించింది. మరోవైపు ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు న్యాయశాఖ కూడా క్లియరెన్స్ ను కూడా ఇచ్చింది. .మరోవైపు యాదగిరిగుట్ట ఆలయ పాలక మండలి ఏర్పాటుతో వచ్చే చట్టపరమైన సమస్యలను నివారించడానికి మార్పులకు అంగీకరించేలా అనువంశిక ధర్మకర్త కుటుంబ సభ్యులను ఒప్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. వంశపారంపర్య ధర్మకర్త కుటుంబం నుంచి ఎవరూ కూడా న్యాయస్థానం మెట్లు ఎక్కకుండా ఉండేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎండోమెంట్ చట్టం ప్రకారం పాలకమండలిలో సుమారు 11 మంది సభ్యులను అనుమతించగా, ఖఆలో 18 మంది సభ్యులు ఉన్నారు. ఈ సభ్యుల సంఖ్యను 40 మందికి పెంచాలని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రయత్నించినప్పుడు న్యాయపరమైన అడ్డంకులు ఎదురైన విషయాన్ని న్యాయశాఖ పరిశీలించింది.యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు చట్టానికి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు న్యాయశాఖ ఇప్ న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు న్యాయశాఖ ఇప్పటికే పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది. యాదగిరిగుట్ట పాలకమండలి ఏర్పాటుకు న్యాయశాఖ ఇప్పటికే క్లియరెన్స్ ఇవ్వడంతో అప్రూవల్ కోసం సిఎం రేవంత్ కు పంపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. యాదగిరిగుట్ట బోర్డు చట్టానికి సీఎం ఆమోదం తెలిపిన తరువాత కేబినెట్ లో ఆమోదం పొందనుంది. యాదగిరిగుట్ట బోర్డు సవరణ చట్టాన్ని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది.

# డివైడర్ ను బైక్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి

హుజూర్ నగర్ రూరల్. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలం గోపాలపురం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామానికి చెందిన నెంబరబోయిన దుర్గాప్రసాద్ (26) శీలం ఉపేందర్ (24) లు హుజూర్ నగర్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి సమీప బంధువులను పరామర్శిం చడానికి వచ్చారు. తిరిగి వెళుతుండగా గోపాలపురం గ్రామం మసీదు సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ని వారి పల్సర్ బైక్ తో బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో వారిద్దరి తలలకి తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108 కి సమాచారం అందించి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వారికి చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. గ్రామానికి చెందిన యువకులు మృతి చెందటడంతో కీతవారిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు శవపరీక్షనిమిత్తం మృత దేహాలను ఏరియాఆసుపత్రి కి తరలించారు.

# కరీంనగర్ లో ఎడిబుల్ కప్స్

కరీంనగర్, డిసెంబర్ 27, మనం కప్పులో టీ తాగుతాం. ఆ కప్పు ప్లాస్టిక్‌ది అయితే పడేస్తాం. స్టీల్ లేదా గ్లాస్ లేదా మట్టితో చేసింది అయితే.. కడిగి జాగ్రత్తగా దాచిపెట్టుకుంటాం. కానీ ఇప్పుడు తినే ఎడిబుల్ కప్స్ మార్కెట్లోకి వచ్చాయి. టీ తాగాక ఆ కప్‌ను తినేయవచ్చు. అలాంటి కప్పులు కరీంనగర్ జిల్లాలోనే తయారు చేస్తున్నారు.కరీంనగర్ జిల్లా మానకొండూర్ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో.. అన్నారం గ్రామంలో ఎడిబుల్ టీ కప్స్ తయారీ కేంద్రాన్ని స్థాపించారు. ఇటీవల జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఓ సమావేశానికి సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, డైరెక్టర్లు హాజరయ్యారు. అక్కడ ఎడిబుల్ కప్పులో టీ పోశారు. ఇవేవో బాగున్నాయనిపించి ఎక్కడ నుంచి తెప్పిస్తున్నారని అడిగారు.రాజమండ్రి నుంచి ఈ టీ కప్పులను సరఫరా చేసుకుంటున్నారని తెలుసుని.. వెయ్యి కప్పులకు ఆర్డర్ పెట్టారు. జిల్లాలోని ఆసుపత్రులు, బ్యాంకులు, సామాజిక వ్యక్తులు, పెద్ద పెద్ద హోటళ్ల నిర్వాహకులను కలిసి వాటిని చూపించారు. మంచి స్పందన రావడంతో.. సహకార సంఘం ఆధ్వర్యంలో అన్నారంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.మూలధనం రూ.3.75 లక్షలతో మిషన్‌ను, లక్ష రూపాయలతో తయారీ సామగ్రిని కొనుగోలు చేశారు. మూడు నెలల కిందట ఎడిబుల్ టీ కప్పుల తయారీ కేంద్రాన్ని ప్రారంబించారు. ఒక్క గ్లాసుకు 3.5 రూపాయలు ఖర్చవుతుండగా.. నాలుగు రూపాయలకు అమ్ముతున్నారు. కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, నాగర్ కర్నూల్, నల్లగొండ, సంగారెడ్డి, మహబూబ్ నగర్, పెద్దపల్లి జిల్లాల్లో హోటల్లో ఆర్డర్స్‌పై ఈ కప్పులను సరఫరా చేస్తున్నారు. ఇది రాష్ట్రంలోనే మొదటి ఎడిబుల్ కప్పుల తయారీ కేంద్రం కావడం విశేషం.కప్పులను చిరుధాన్యాలు రాగులు, మొక్కజొన్న పిండి, బియ్యంపిండి, మైదా పిండిలో తగినంత చక్కెరను కలిపి తయారు చేస్తుంటారు. రోజుకు వెయ్యి గ్లాసులను తయారు చేసేందుకు 40 కిలో పిండి అవసరముంటుంది. 10 గ్లాసులను ఒక్క ప్యాకెట్‌గా తయారు చేసి.. 40 రూపాయలకు విక్రయిస్తుంటారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉంటే రోజుకు వెయ్యి గ్లాసులకు తయారు చేస్తారు.

# ఎంజీఎం ఆసుపత్రిలో ప్రైవేటు ల్యాబ్ దందా

వరంగల్, డిసెంబర్ 27, ఉమ్మడి వరంగల్ తో పాటు చుట్టుపక్కల జిల్లాల నిరుపేదలకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ప్రైవేటు లేబరటరీల దందా జోరుగా నడుస్తోంది. ఎంజీఎం ఆసుపత్రిలోని ల్యాబ్ సిబ్బంది తో పాటు కొంతమంది పెద్ద డాక్టర్ల సహకారంతో ప్రైవేటు ల్యాబ్ ల నిర్వాహకులు నేరుగా హాస్పిటల్ లోపలున్న వార్డుల్లోకి ఎంటర్ అవుతున్నారు. ఎంజీఎంలో ల్యాబ్ సౌకర్యాలు సరిగా ఉండవని, రిపోర్టులు సరిగా ఇచ్చే పరిస్థితి కూడా ఉందని పేషెంట్లను మాయ మాటలతో బోల్తా కొట్టిస్తున్నారు. అనంతరం వారి నుంచి బ్లడ్ శాంపిల్స్ తీసుకుని, టెస్టులకు తరలిస్తున్నారు. ఎంజీఎంలో ఉచితంగా చేసే టెస్టులకు కూడా రూ.వెయ్యికి పైగా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇదంతా ఎంజీఎం డాక్టర్ల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నేళ్లుగా ఎంజీఎం ఆసుపత్రిలో ప్రైవేటు ల్యాబ్ ల దందా సాగుతుండగా, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ప్రైవేటు సిబ్బందికే వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయిఎంజీఎం ఆసుపత్రిలో అన్ని రకాల టెస్టులు చేసేందుకు ల్యాబ్ సౌకర్యం అందుబాటులో ఉంది. కానీ ఆయా ల్యాబ్ ల్లో అప్పుడప్పుడు కెమికల్స్ కొరత ఏర్పడి వివిధ టెస్టులకు అంతరాయం ఏర్పడుతోంది. అంతేగాకుండా ఎంజీఎంకు వచ్చే రోగుల తాకిడి దృష్ట్యా అప్పటికప్పుడు రిపోర్టులు అందించడంలో కూడా కొంత ఆలస్యం జరుగుతుంటుంది. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది ప్రైవేటు ల్యాబుల నిర్వాహకులు ఎంజీఎంలోకి ఎంటరై దందా మొదలు పెడుతున్నారు.ఎంజీఎం హాస్పిటల్ ముందున్న ల్యాబ్ లకు సంబంధించిన సిబ్బంది అన్ని వార్డుల్లో కలియ తిరిగి, ఎవరికైనా టెస్టులు అవసరమేమో కనుక్కుంటున్నారు. అనంతరం వారిని నెమ్మదిగా మాటల్లో పెట్టి ప్రైవేటు ల్యాబుల్లో టెస్టులు చేయించి, వెంటనే రిపోర్టులు కూడా తెచ్చి ఇస్తామంటూ నమ్మబలుకుతున్నారు. దీంతో చేసేదేమీ లేక హాస్పిటల్ లో అడ్మిట్ అయిన రోగులు వారికి శాంపిల్స్ ఇచ్చేందుకు ఒప్పుకుంటున్నారు. డాక్టర్లు రాసిన ఏ చిన్న టెస్టు చేసేందుకైనా ప్రైవేటు ల్యాబుల సిబ్బంది రూ.వెయ్యికి పైగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో అంతకుమించి కూడా వసూలు చేస్తారని, అక్కడి డాక్టర్లకు నెలవారీగా మామూళ్లు ఇచ్చి ప్రైవేటు ల్యాబ్ ల నిర్వాహకులు ఈ దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఎంజీఎం ఆస్పత్రిలో ల్యాబ్ సౌకర్యాలు సరిగా ఉండవని, రిపోర్టు సరిగా రాదని ప్రైవేట్ లో చేయించుకోమని పేషెంట్లకు కొంతమంది వైద్యులే ఉచిత సలహాలు ఇస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతోనే పేషెంట్లు ప్రైవేటు ల్యాబ్ ల సిబ్బందికి శాంపిల్స్ ఇస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి గతం నుంచే ఎంజీఎం ఆసుపత్రిలో ప్రైవేటు ల్యాబ్ ల దందా ఇష్టారీతిన సాగుతోంది. ఈ విషయంపై ఎవరైనా ఫిర్యాదులు చేస్తే తప్ప ఎంజీఎం ఉన్నతాధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఉచిత వైద్యం కోసం ఎంజీఎం కు వస్తున్న నిరుపేదలకు ప్రైవేటు ల్యాబ్ల వ్యవహారంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతుండగా.. ఇకనైనా ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేటు ల్యాబుల దందాకు అడ్డుకట్ట వేయాలని రోగులు, వారి బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఎంజీఎంలో ల్యాబ్ వ్యవస్థను పట్టిష్టం చేయడంతో పాటు ఎప్పటికప్పుడు రిపోర్టులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరి ఎంజీఎం ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారో.. లేదా ఎప్పటిలాగే ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులకే వత్తాసు పలుకుతారో చూడాలి.

# సినిమా



## సంక్రాంతి సినిమాలు ముఖ్యం కాదు



సంక్రాంతి సినిమాలు ముఖ్యం కాదని, బెనిఫిట్ షోలు.. టికెట్ రేట్ల పెంపు అనేది చిన్న అంశం మాత్రమేనని, అది ఇష్యూ కాదని ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సిఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ ప్రముఖులు సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ.."నా ద్వారా సినీ పరిశ్రమ విషయాలు తెలపాలన్నారు. తెలుగు సినిమాలకు జాతీయ స్థాయిలో స్పందన వస్తోంది. తెలుగు సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆయన విజన్ తెలిపారు. సినీ పరిశ్రమను ప్రపంచ వ్యాప్తం చేయడమే మా లక్ష్యం. ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్‌ను సినిమా ఇండస్ట్రీకి ఇంటర్నేషనల్ హబ్‌గా మార్చేందుకు అడుగులు వేస్తాం. డ్రగ్స్ విషయంలో ప్రభుత్వానికి సహకరిస్తాం. సినీ పరిశ్రమ, ప్రభుత్వం మధ్య దూరం పెరిగిందనేది అపోహ మాత్రమే. హాలీవుడ్ వాళ్లు కూడా హైదరాబాద్‌లో షూటింగ్స్ చేసుకునేలా ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలనే విషయంపై చర్చించారు. ఇండస్ట్రీలో కూడా ఒక పెట్టుకోమని సిఎం సలహా ఇచ్చారు. త్వరలో కమిటి ఏర్పాటు చేసి..మీటింగ్ పెట్టుకుంటాం..15 రోజుల్లో కమిటీ రిపోర్ట్ సిఎంకు అందజేస్తాం" అని దిల్‌రాజు చెప్పారు.

## బాబీ లైన్ లో రెండు భారీ సినిమాలు..!



ఖు దీశీఎఎం బాబీ లైన్‌లో చిరంజీవి, రజినీకాంత్ సినిమాలు ఉన్నట్టు తెలుస్తుంది. రజినీకాంత్ తో సినిమా చేయాలని ఉందని దానికి స్టోరీ రెడీ అవుతుందని అన్నాడు బాబీ. అంతేకాదు చిరంజీవితో సినిమా కూడా ఉంటుందని టాలీవుడ్ కమర్షియల్ డైరెక్టర్ లో ఒకరైన కె ఎస్ బాబీ ప్రస్తుతం బాలకృష్ణతో డాకు మహారాజ్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాతో మరోసారి తన మార్క్ మాస్ ఫీస్ట్ ఇవ్వాలని చూస్తున్నాడు. రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై సూపర్ బజ్ ఏర్పరచింది. ఐతే కెఎస్ బాబీ తన నెక్స్ట్ సినిమాల గురించి చెప్పుకొచ్చారు. బాలయ్య సినిమా తర్వాత తాను రెండు భారీ సినిమాలు చేయబోతున్నట్టు వెల్లడించారు. బాబీ లైన్ లో చిరంజీవి, రజినీకాంత్ సినిమాలు ఉన్నట్టు తెలుస్తుంది. రజినీకాంత్ తో సినిమా చేయాలని ఉందని దానికి స్టోరీ రెడీ అవుతుందని అన్నాడు బాబీ. అంతేకాదు చిరంజీవితో సినిమా కూడా ఉంటుందని చెప్పాడు. ఆల్రెడీ చిరుతో వాల్తేరు వీరయ్య సినిమా చేసి హిట్ అందుకున్నాడు బాబీ. పవర్ సినిమాతో డైరెక్టర్ గా టర్న్ తీసుకున్న కె ఎస్ బాబీ తన మాస్ సినిమాలతో అదరగొట్టేస్తున్నాడు. బాబీ సినిమాల లైనప్ ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది. డాకు మహారాజ్‌తో మరోసారి మాస్ మేనియా చూపించాలని చూపిస్తున్న బాబీ రాబోతున్న సినిమాలతో కూడా మెగా మాస్ ట్రీట్ అందించాలని చూస్తున్నాడు. రజిని సినిమా కన్ఫర్మ్ అయితే బాబీ పేరు పాన్ ఇండియా లెవెల్ లో మారుమోగుతుందని చెప్పొచ్చు. డాకు మహారాజ్ హిట్ పడితే మాత్రం బాబీ డైరెక్షన్ స్టామినా ఏంటన్నది మరోసారి ప్రూవ్ అవుతుంది. సినిమాపై నందమూరి ఫ్యాన్స్ అంచనాలు భారీగా పెట్టుకున్నారు.

## దేవర జపాన్ రిలీజ్ ఏర్పాట్లు..!



చీ= ఐవఝుతీఝ తెలుగు కల్కి సినిమా త్వరలోనే రిలీజ్ చేస్తున్నారు. ఇక మార్చి లో జపాన్ లో దేవర రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. === జపాన్ రిలీజ్ టైం లో ఎన్టీఆర్, చరణ్ ఇద్దరు కలిసి ప్రమోట్ చేశారు. ఎన్టీఆర్ దేవర సినిమా ఈ ఇయర్ సెప్టెంబర్ ఎండ్ లో రిలీజై సూపర్ హిట్ అందుకుంది. ఈ సినిమాను రెండు భాగాలుగా ప్లాన్ చేయగా రెండో భాగం ఎప్పుడనది తెలియాల్సి ఉంది. ఐతే చీ= దేవర సినిమా జపాన్ రిలీజ్ కు రెడీ అవుతుంది. ఇండియన్ సినిమాలు ఈమధ్య జపాన్‌లో సంచలన విజయాలు అందుకుంటున్నాయి. వీటిలో భాగంగానే అక్కడ మన సినిమాలు భారీగా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. తెలుగు కల్కి సినిమా త్వరలోనే రిలీజ్ చేస్తున్నారు. ఇక మార్చి లో జపాన్ లో దేవర రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. జపాన్ రిలీజ్ టైం లో ఎన్టీఆర్, చరణ్ ఇద్దరు కలిసి ప్రమోట్ చేశారు. ఇక ఇప్పుడు దేవర సినిమాకు ఎన్టీఆర్ అక్కడకి వెళ్తాడా లేదా అన్నది చూడాలి. ఈమధ్యనే సౌత్ నుంచి విజయ్ సేతుపతి మహారాజ సినిమా జపాన్ లో రిలీజ్ చేశారు. ఆ సినిమాకు అక్కడ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక దేవర సినిమాకు జపాన్ లో ఎలాంటి రెస్పాన్స్ వస్తుందా అని ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూతున్నారు. కొరటాల శివ డైరెక్షన్ లో తెరకెక్కిన దేవర సినిమాలో ఎన్ టీ ఆర్ డ్యుయల్ రోల్ చేశాడు. ఈ సినిమాలో జాన్వి కపూర్ హీరోయిన్ గా నటించింది. సినిమాకు అనిరుద్ ఇచ్చిన మ్యూజిక్ నెక్స్ట్ లెవెల్ క్రేజ్ తెచ్చింది. మరి ఈ సినిమా జపాన్ రిలీజ్ ఎలాంటి హంగామా చేస్తుందో చూడాలి.

## సంక్రాంతికి వస్తున్నాం సూపర్ జోష్..!




ఈ సాంగ్ ని వెంకటేష్ తో పాడించారు. దాని గురించి అప్డేట్ ఇస్తూ వెంకటేష్ నేను పాడతా అంటూ డైరెక్టర్ అనీల్ వెంట పడతాడు. ఆయనేమో హిందీ సింగర్స్ లేదా స్టార్ సింగర్స్ తో పాడించాలని అనుకుంటాడు. విక్టరీ వెంకటేష్ అనీల్ రావిపుడి కాంబినేషన్ లో వస్తున్న సినిమా సన్క్రాంతికి వస్తున్నాం. సినిమా టైటిల్ లోనే సంక్రాంతికి వస్తున్నాం అని పెట్టి పొంగల్ రేసులో దిగుతున్నారు. ఐతే ఈ సినిమా విషయంలో ఏ ఒక్క విషయాన్ని వదలట్లేదు మేకర్స్. ముఖ్యంగా ాఝఅనితీఝత్ప్రఅనిఅ ఝర్బఅఝఎ సినిమాని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లే ప్రయత్నంలో అనీల్ రావిపుడి మార్క్ చూపిస్తున్నారు. సినిమా నుంచి ఇప్పటికే రెండు సాంగ్స్ రిలీజ్ కాగా 3వ సాంగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సాంగ్ ని వెంకటేష్ తో పాడించారు. దాని గురించి అప్డేట్ ఇస్తూ వెంకటేష్ నేను పాడతా అంటూ డైరెక్టర్ అనీల్ వెంటపడతాడు. ఆయనేమో హిందీ సింగర్స్ లేదా స్టార్ సింగర్స్ తో పాడించాలని అనుకుంటాడు. ఫైనల్ గా నేను పాడతా అంటూ వెంటపడుతున్న వెంకీకి ఛాన్స్ ఇస్తాడు. వెంకటేష్ తో సాంగ్ పాడించాం అన్నది డైరెక్ట్ గా చెప్పడం కామన్ కానీ ఇలా ప్రమోట్ చేసి చూపించడం వెరైటీగా ఉంది. సో వెంకటేష్ లోని మరో టాలెంట్ ని చూపించబోతున్నారు. సాంగ్ ఏదో ముందు రెండు లైన్లు పాడటం కాదు ఈ సాంగ్ మొత్తం వెంకటేష్ పాడారని తెలుస్తుంది. సాంగ్ ప్రోమో రాలేదు కానీ ఈ సాంగ్ దగ్గుబాటి ఫ్యాన్స్ కే కాదు సంగీత ప్రియులను కూడా ఖుషి అయ్యేలా చేస్తుందని అంటున్నారు. మరి సంక్రాంతికి వస్తున్నా సాంగ్ ఎలా ఉండబోతుందో చూడాలి. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్నారు.

## 'అనగనగా ఒక రాజు' ప్రీ వెడ్డింగ్ టీజర్



యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి నూతన చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. సితార ఎంటర్ టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. నవీన్ పొలిశెట్టి పుట్టినరోజు సందర్భంగా ప్రీ వెడ్డింగ్ వీడియో టీజర్‌ను నిర్మాతలు ఆవిష్కరించారు. నవీన్ పొలిశెట్టి మాదిరిగానే ఈ వీడియో ఎంతో ప్రత్యేకంగా, పూర్తి వినోదాత్మకంగా ఉంది. ప్రీ వెడ్డింగ్ వీడియోలో నవీన్ పొలిశెట్టి పోషించిన రాజు పాత్ర తన వివాహానికి సిద్ధమవుతున్నట్లు చూపించారు. రాజు గారి పెళ్ళి అంటే ఎలా ఉండాలి? అంటూ భోజనాల దగ్గర చమ్మక్ చంద్ర చేసిన హడావుడి నవ్వులు పూయించింది. ఇక అనంత్ అంబానీ వివాహానికి హాజరైన హాలీవుడ్ ప్రముఖుల ఫోన్ నెంబర్ల కోసం, నవీన్ ఏకంగా ముఖేష్ అంబానీకి ఫోన్ చేసి మాట్లాడినట్లు చూపించడం కడుపుబ్బా నవ్వించింది. అలాగే ప్రీ వెడ్డింగ్ ఫోటోషూట్ సమయంలో వధువుగా మోస్ట్ హ్యాపెనింగ్ నటి మీనాక్షి చౌదరి కనిపించారు. ఈ ఫోటోషూట్ సమయంలో కూడా నవీన్ పోషించిన రాజు పాత్ర నవ్వులు పంచింది. అనగనగా ఒక రాజు చిత్రానికి నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. 2025లో ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది.

## పాత జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చే సినిమా 'దూరదర్శిని'



సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దూరదర్శిని'. కార్తికేయ కొమ్మి దర్శకుడు. వారాహ మూవీ మేకర్స్ పతాకంపై బి.సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. 1990వ నేపథ్యంలో అందరి హృదయాలను హత్తుకునే ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను గురువారం ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆర్‌పీ పట్నాయక్ మాట్లాడారు. 'ఈ సినిమా అందరిని 90వ దశకంలోకి తీసుకెళ్లి మీ జ్ఞాపకాల్ని గుర్తుకు తెస్తుంది. అందరికి వాళ్ల వాళ్ల ప్రేమకథలు కూడా గుర్తుకు వస్తాయి. ఈ సినిమా విజయం సాధించి టీమ్ అందరికి మంచి గుర్తింపు తీసుకురావాలి"అని అన్నారు. సువిక్షిత్ మాట్లాడుతూ "1990వ నేపథ్యంలో అందరికి కనెక్ట్ అయ్యే కథ ఇది. బ్యాక్‌డ్రాప్‌కు తగ్గ నటీనటులతో, లోకేషన్స్‌తో ఎంతో సహజంగా తెరకెక్కించిన సినిమా ఇది. ఈ సినిమా కోసం ఎంతో రీసెర్చ్ చేసి దర్శకుడు చిత్రాన్ని రూపొందించాడు. తప్పకుండా చిత్రాన్ని అందరూ ఎంతో బాగా ఎంజాయ్ చేస్తారు"అని తెలిపారు. ఈ సమావేశంలో దర్శకుడు కార్తియక కొమ్మి, తిరుపతి రెడ్డి, నారాయణ, సునీల్ పొన్నం, బాలారాజు, తేజ, పాండు, జెమిని సురేష్, గీతిక, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 250 అడుగుల రామ్ చరణ్ భారీ కటౌట్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా స్టార్ డైరెక్టర్ ఎస్.శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గేమ్ చేంజర్' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ మూవీ జనవరి 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో విజయవాడలోని వజ్ర గ్రౌండ్స్ లో గేమ్ ఛేంజర్ కోసం భారీ ఈవెంట్ నిర్వహించబోతున్నారు. 29న జరగనున్న ఈ కార్యక్రమంలో భారీ రామ్ చరణ్ కటౌట్ ను ఆవిష్కరించనున్నారు. 250 అడుగుల భారీ కటౌట్ ఇది. ఓ హీరోకు ఇండియాలో ఇంత పెద్ద కటౌట్ ఇంతవరకు ఏర్పాటుచేయలేదంటున్నారు మెగా ఫ్యాన్స్. అదే ఈవెంట్‌లో హెలికాప్టర్లు పెట్టి పూల వర్షం కురిపించాలని మేకర్స్ నిర్ణయించారు. ఈ కార్యక్రమం కోసం నిర్మాత దిల్ రాజు భారీగా ఖర్చు చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'ధోప్' సాంగ్ రిలీజ్ చేశారు. అది క్యాచీగా ఉంది. ఇక 'గేమ్ ఛేంజర్' సినిమాకు సంబంధించి ఇప్పటికే ఓ భారీ ఈవెంట్ నిర్వహించారు. అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన ఈ ఈవెంట్ సూపర్ సక్సెస్ అయింది. ఇప్పుడు అంతకుమించి మరో కార్యక్రమాన్ని విజయవాడ కేంద్రంగా నిర్వహించేందుకు యూనిట్ రెడీ అవుతోంది.



# క్రీడలు



## మెల్‌బోర్న్ సెంచరీతో టెస్టు క్రికెట్ చరిత్రలో స్మిత్ రికార్డుల వరద!

**మెల్‌బోర్న్‌లో భారీ శతకం సాధించిన స్మిత్**

**34 టెస్టు సెంచరీలతో గవాస్కర్ సరసన చోటు**

**టెస్టు క్రికెట్ చరిత్రలో రెండు వేర్వేరు జట్లపై పదికి పైగా సెంచరీలు సాధించిన ఆటగాడిగా స్మిత్ పేరు**

**వన్డేల్లో సాధించిన 12 శతకాల్లో ఐదు భారత్‌పైనే**

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా మెల్‌బోర్న్‌లో భారత్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులో ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ పలు రికార్డులను తన పేర రాసుకున్నాడు. ఈ సిరీస్‌లో స్మిత్‌కు ఇది రెండో శతకం. తాజా మ్యాచ్‌లో మూడు సిక్సర్లు, 13 ఫోర్లతో 140 పరుగులు సాధించిన స్మిత్‌కు టెస్టుల్లో ఇది 34వ సెంచరీ. దీంతో ఇన్నేసి శతకాలు నమోదు చేసిన సునీల్ గవాస్కర్, యూనిస్‌ఖాన్, మహేల జయవర్ధనే,




బ్రియాన్ లారా సరసన చేరాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ 41 సెంచరీలతో స్మిత్ కంటే ముందున్నాడు.

ఇండియాపై అత్యధిక సెంచరీలు

మెల్‌బోర్న్ సెంచరీతో స్మిత్ ఖాతాలో మరో రికార్డు కూడా వచ్చి చేరింది. టెస్టు క్రికెట్‌లో భారత్‌పై అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగానూ స్మిత్ రికార్డులకెక్కాడు. ఇప్పటి వరకు ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న జోరూట్(10)ను స్మిత్ వెనక్కి నెట్టేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్‌పై కేవలం 43 ఇన్నింగ్స్‌లలోనే 11 సెంచరీలు సాధించిన తొలి ఆటగాడిగా స్మిత్ రికార్డులకెక్కాడు. మూడో టెస్టులో శతకం నమోదు చేసిన స్మిత్ అన్ని ఫార్మాట్లలోనూ భారత్‌పై అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా మరో ఘనత సాధించాడు. భారత్‌పై మొత్తంగా 16 సెంచరీలు సాధించి ఈ జాబితాలో స్మిత్ అగ్రస్థానంలో ఉండగా, రికీపాంటింగ్ 14 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు.

టీమిండియాపై శతకబాదుడు

వన్డేల్లో స్మిత్ సాధించిన 12 సెంచరీల్లో ఐదు భారత్‌పై చేసినవే కావడం గమనార్హం. అలాగే, భారత్‌పై సాధించిన 11 టెస్టు సెంచరీల్లో ఏడు ఆస్ట్రేలియా గడ్డపై చేసినవే. వీటిలో రెండు ఈ సిరీస్‌లో చేసినవే కావడం గమనార్హం. టెస్టు క్రికెట్ చరిత్రలో రెండు వేర్వేరు జట్లపై పదికిపైగా సెంచరీలు సాధించిన ఒకే ఒక్క ఆటగాడిగానూ స్మిత్ రికార్డులకెక్కాడు. ఆ రెండు జట్లలో ఒకటి భారత్ కాగా, రెండోది ఇంగ్లండ్.

## బెయిల్స్ మార్చిన సిరాజ్.. వికెట్ తీసిన బుమ్రా



మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఆతిథ్య జట్టు తొలుత బ్యాటింగ్ చేయాలని నిర్ణయించగా, ఓపెనర్లు శుభారంభం అందించారు. మెల్‌బోర్న్ టెస్టు ఆసక్తికరంగా మారింది. మైదానం తొలి రోజు ఆస్ట్రేలియాకు సహకరించింది. నలుగురు టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్లు హాఫ్ సెంచరీలతో చెలరేగారు. సామ్, ఉస్మాన్, మార్నస్, స్మిత్ వంటి స్టార్ ఆటగాళ్లు హాఫ్ సెంచరీలతో అద్భుతంగా రాణించారు. ఇక భారత్ తరఫున అత్యంత విజయవంతమైన బౌలర్‌గా జస్ప్రీత్ బుమ్రా మరోసారి ఆస్ట్రేలియన్ విధ్వంసకర ఆటగాళ్లను పెవిలియన్ కి దారి చూపించాడు. ఈ క్రమంలో సిరాజ్ మాయ చేయడంతో బుమ్రాకు వికెట్ దక్కింది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఆతిథ్య జట్టు తొలుత బ్యాటింగ్ చేయాలని నిర్ణయించగా, ఓపెనర్లు శుభారంభం అందించారు. ఉస్మాన్ ఖవాజా (57), సామ్ కొన్‌స్టాస్ (60) తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అరంగేట్ర ఆటగాడు కాన్‌స్టాస్‌ను అవుట్ చేయడం ద్వారా జడేజా భారత్‌కు తొలి విజయాన్ని అందించాడు. దీని తర్వాత ఖవాజాకు మార్నస్ లాబుషాగ్నే మద్దతు లభించింది మరియు ఇద్దరూ రెండో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రెండో వికెట్ కోసం భారత బౌలర్లు చెమటోడ్చారు. మ్యాచ్ జరుగుతుండగా మహ్మద్ సిరాజ్ ఒక ప్రత్యేకమైన ట్రిక్ ప్లే చేశాడు. ఇన్నింగ్స్ 43వ ఓవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఓవర్ రెండో బంతికి ముందు మహ్మద్ సిరాజ్ స్ట్రైకర్స్ ఎండ్‌కు వెళ్లి బెయిల్స్ మార్చాడు. దీని తర్వాత ఉస్మాన్ ఖవాజా ఇన్నింగ్స్ 45వ ఓవర్ తొలి బంతికి భారత పేసర్ బుమ్రాకు బలయ్యాడు. బుమ్రా షార్ట్ పిచ్ బాల్‌ను వేశాడు. ఉస్మాన్ ఖవాజా పుల్ షాట్ ఆడటానికి వెళ్లాడు, కానీ టైమింగ్ కుదరకపోవడంతో షార్ట్ మిడ్ వికెట్ వద్ద ఉన్న కేఎల్ రాహుల్ సులభమైన క్యాచ్ పట్టాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్ ప్రసారకర్త ఈ వీడియోను తన సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో పోస్ట్ చేశారు. ఇది క్షణాల్లో వైరల్‌గా మారింది. మహ్మద్ సిరాజ్ బెయిల్‌ల మార్పిడి వల్ల బుమ్రాకు ప్రయోజనం లభించిందని అందరూ కామెంట్స్ పెడుతున్నారు.

## సెమీస్‌కు యుపి, పట్నా



ప్రొ కబడ్డీ సీజన్-11 సెమీ ఫైనల్లోకి యుపి యోథాస్, పట్నా పైరెట్స్ జట్లు ప్రవేశించాయి. గురువారం జరి గిన ప్లే-ఆఫ్స్ పోటీ ల్లో యుపి యోథాస్ జట్టు 46-18పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ ప్యాంథర్స్‌ను, పట్నా పైరెట్స్ 31-23 పాయింట్ల తేడాతో యు ముంబను చిత్తుచేశాయి. ఏకపక్షంగా జరిగిన తొలి ప్లే-ఆఫ్ మ్యాచ్‌లో యుపి రైడర్ భవాని రాజ్‌పుట్(12)రైడ్స్‌లో రాణించగా.. హితేశ్ ట్యాకిల్స్‌లో మెరిసాడు. ఇక యుపి జట్టు ఎనిమిదిసార్లు ప్రత్యర్థి జైపూర్ జట్టును ఆలౌట్ చేసింది. రైడ్‌ల ద్వారా 18, ట్యాకిల్స్ ద్వా రా మరో 18పాయింట్లను చేజిక్కించుకుంది. ఇక జైపూర్ జట్టు రైడ్‌ల ద్వారా 12పాయింట్లు సాధించినా.. ట్యాకిల్స్‌లో కేవలం 5పాయింట్లు మాత్రమే సాధించగల్గింది. జైపూర్ రైడర్ రేజా(5) మాత్రమే రాణించాడు. ఇక రెండో ప్లే-ఆఫ్ మ్యాచ్‌లో పట్నా పైరెట్స్ రైడర్ అయాన్(10 పాయింట్లు)కి తోడు గుర్‌దీప్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచాడు.

## మెల్‌బోర్న్‌లో రసాభాస.. కొట్టుకున్న ఇరు దేశాల ఫ్యాన్స్



ఈ సంఘటన ఉదయం జరిగింది. ఖలిస్తానీ మద్దతుదారులు, భారత అభిమానుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకోగా మైదానం వెలుపల గందరగోళం ఏర్పడింది. దీంతో విక్టోరియా పోలీసులు అక్కడికి చేరుకొని వారిని చెదరగొట్టారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఈ రోజు భారత్-ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్టు ప్రారంభమైంది. ఈ టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వెలుపల ఖలిస్తానీ మరియు టీమిండియా ఫ్యాన్స్ ఘర్షణ పడ్డారు. డజను మందికి పైగా ఖలిస్తానీలు జెండాలు పట్టుకుని భారత్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనిని భారత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో టీమిండియా ఫ్యాన్స్ త్రివర్ణ పతాకాన్ని చేతపట్టుకుని భారత్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ వాళ్ళ నోళ్లు మూయించారు. ఈ గొడవకు సంబంధించిన వీడియో కూడా వైరల్ అవుతోంది. ఈ సంఘటన ఉదయం జరిగింది. ఖలిస్తానీ మద్దతుదారులు, భారత అభిమానుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకోగా మైదానం వెలుపల గందరగోళం ఏర్పడింది. దీంతో విక్టోరియా పోలీసులు అక్కడికి చేరుకొని వారిని చెదరగొట్టారు. మెల్‌బోర్న్ టెస్ట్ మ్యాచ్‌కు టిక్కెట్లు లేనప్పటికీ, ఖలిస్తానీ మద్దతుదారులు అక్కడికి వచ్చి గొడవ పడ్డారు. అయితే కొద్దిసేపటికే పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ మొత్తం ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ టెస్టు ద్వారా 19 ఏళ్ళ సామ్ కాన్స్టాస్ జట్టులోకి వచ్చాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ ఇచ్చిన అవకాశాన్ని శామ్ కాన్స్టాస్ అద్భుతంగా సద్వినియోగం చేసుకున్నాడు. ఆరంభం నుంచే సామ్ కాన్స్టాస్ భీకరమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఉస్మాన్‌తో కలిసి ఓపెనింగ్ బాధ్యతలు చేపట్టిన ఈ 19 ఏళ్ళ కుర్రాడు వరల్డ్‌క్లాస్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాని సైతం ధీటుగా ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలో అతను హాఫ్ సెంచరీ కొట్టి జడేజా బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ప్రస్తుతం మ్యాచ్ రసవత్తరంగా సాగుతుంది.

## అదరగొట్టిన ఆంధ్ర విజయ్ హజారే వన్డే టోర్నమెంట్



విజయ్ హజారే టోర్నీ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు అదరగొట్టింది. గ్రూప్-బిలో భాగంగా సిక్కింతో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సిక్కింను ఆంధ్ర బౌలరుకట్టడి చేశారు. దీంతో సిక్కిం జట్టు 32.2ఓవర్లలో 119పరుగులకే కుప్పకూలింది. సత్యనారాయణరాజు(3/32), సాయి రాహుల్(2/12), స్టైఫెన్(2/24) బౌలింగ్‌లో రాణించారు. ఆ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 20.4ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రికీ బురు(41నాటౌట్), మహీప్ కుమార్(23నాటౌట్)కి తోడు అశ్విన్ హెబ్బర్(27) బ్యాటింగ్‌లో రాణించారు. ఈ గెలుపులో ఆంధ్ర జట్టు గ్రూప్-బిలో 3 మ్యాచ్‌లు ముగిసేసరికి 8పాయింట్లతో 2వ స్థానానికి ఎగబాకింది. గ్రూప్-సిలో హైదరాబాద్ జట్టు మరో ఓటమిని చవిచూసింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో సౌరాష్ట్ర చేతిలో హైదరాబాద్ జట్టు 6వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. హైదరాబాద్ జట్టు 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 244పరుగులు చేయగా.. సౌరాష్ట్ర జట్టు 42.5ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 248పరుగులు చేసి విజయం సాధించింది. సౌరాష్ట్ర బ్యాటర్ హార్విక్ దేశాయ్(125నాటౌట్) సెంచరీకి తోడు గోహిల్(60) బ్యాటింగ్‌లో రాణించారు. శనివారం జరిగే నాల్గో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు పాండిచేరితో, ఆంధ్ర జట్టు సర్వీసెస్‌తో తలపడనున్నాయి.

# సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలి

**......చవాన్ సుభాన్ సింగ్**

**ఎస్ సి ఎస్ టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

**ఇచ్చిన హామీలను నెరవేర్చి - తక్షణమే వారిని రెగ్యులర్ చేయాలి, లేని పక్షంలో ఉద్యమాలు చేస్తాము.**

**....పెద్దాపురం దుర్గయ్య (జిల్లా అధ్యక్షులు)**




**సంగారెడ్డి డిసెంబర్ 27 ప్రజ బలం ప్రతినిధి**:నేటికీ 21 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల కొరకుసంగారెడ్డి కలెక్టరేట్ వద్ద దీక్షలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావంగా సమ్మె శిబిరానికి వచ్చిన సందర్భంగా చావాన్ సుభాన్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం చొరవ తీసుకొని వారికి బేసిక్ పే ఇవ్వాలని మరియు వారిని రెగ్యులర్ చేయాలనీ లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని చెప్పారు. టీచర్లకు వారదులుగా ఎం ఇ ఓ / డి ఇ ఓ లకు చాలా సేవలు అందిస్తున్నారని చెప్పారు. జిల్లా అధ్యక్షులు పెద్దాపురం దుర్గయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర%శీ% కావొస్తున్న ఇచ్చిన హామీలను నెరవేర్చా కుండా కాలయాపన చేస్తుంది అని అన్నారు. తక్షణమే వారిని రెగ్యులర్ చేసి వారికీ సమాన పనికి సమాన వేతనం అందించాలను డిమాండ్ చేశారు. గౌరవ అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ మీ వెంట మేము ఉంటాము మీ న్యాయమైన డిమాండ్స్ అమలు కావాలన్నారు. అదనపు ప్రధాన కార్యదర్శి వసంత్ మాట్లాడుతూ డైలీ లేబర్ కంటే గోరంగా సమగ్ర ఉద్యోగులతో పనుచేస్తున్నారన్నారు, సమాన పనికి సమాన వేతనం పొందడం వారికి రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు.




అలాగే ఎస్ సి ఎస్ టి ఉపాధ్యాయ సంఘం సంగారెడ్డి జిల్లా తగరపున సమగ్ర ఉద్యోగులకు రు 3000/-అందించడం జరిగిందిలి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కుర్రి చంద్రశేఖర్, జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మణ్, అదనపు ప్రధాన కార్యదర్శి వసంత్ కుమార్, కోశాధికారి ధర్మ పాల్గొని దీక్షలకు సంఘీభావం తెలిపారు

# సింగరేణి కోల్ బెల్ట్ ప్రాంతం సాంస్కృతిక చైతన్యానికి ప్రతీక

## –సౌత్ ఇండియా మూవీస్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ సినీ దర్శకుడు ఎన్.శంకర్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 27**:సింగరేణి కోల్ బెల్ట్ ప్రాంతం సాంస్కృతిక చైతన్యానికి ప్రతీక అని సౌత్ ఇండియా మూవీస్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ సినీ దర్శకుడు ఎన్. శంకర్ అన్నారు. శుక్రవారం మందమర్రి పట్టణంలోని దర్గాని దర్శించుకునేందుకు తన కుమారుడితో వచ్చిన ఎన్. శంకర్ కు తెలంగాణ ధూమ్ ధామ్ వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు స్థానిక కళాకారులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా కేకే - 2 ప్రాంతంలో గల దర్గా ని సందర్శించుకుని ప్రార్థనలు జరిపారు. అనంతరం గఫూర్ బాబా పీర్లను దర్శించుకుని దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా గఫూర్ బాబా ప్రతేక ప్రార్థనలు జరిపి వీరిని ఆశీర్వదించారు. అనంతరం స్థానిక కళాకారులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణలోని కోల్ బెల్ట్ ప్రాంతం సబ్బండ వర్గాలకు నిలయమని ఈ నేల ఎన్నో పోరాటలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. కవులకు, రచయితలకు కళకారులకు ఈ ప్రాంతం పెట్టిన పేరని అన్నారు. జై బోలో తెలంగాణ సినిమా పాట చిత్రీకరణలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే పీరీల పండుగలకు సంబందించి గఫూర్ బాబా పీర్లను వాడుకోవడం జరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అన్ని మతాల దేవుళ్ళ అశీషులు కోరినట్లు చెప్పారు. అప్పుడు మొక్కిన మొక్కును ఇప్పుడు చెల్లించుకునేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. త్వరలోనే తెలంగాణ (డెక్కన్ ప్రాంతం) ఔన్నత్యాన్ని నాటి నిజాం నవాబుల కాలం నుండి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వరకు జరిగిన చరిత్రను అందరికీ తెలిసేలా వెబ్ సిరీస్ కు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ సాంస్కృతిక విప్లవం తీసుకొచ్చిన మందమర్రి కళకారుడు అంతడుపుల నాగరాజుకు బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నైనా అతనికి సముచిత స్థానం లభిస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ కళాకారులు సాధనవేణి ప్రభాకర్, లయోల కుమార్, సాదుల సాంబయ్య, ముల్కల్ల శంకర్, ఎగ్గేటి రాజేశ్వర్ రావు, ఉప్పులేటి నరేష్, బియ్యాల ఉపేందర్, ఉప్పులేటి రాజమౌళి, హనుమాండ్ల మధుకర్, రాకం సంతోష్, కొండపర్తి సది, ఎర్రవేని రమేష్ యాదవ్, క్రేజీ విజయ్, ఏ.రాజు, పోలు సంపత్, నీలాల శ్రీనివాస్, ఉడుత సాగర్, అర్.కే సంపత్, అడ్డగురి లక్ష్మణ్, వేల్పుల రమేష్, అడ్లూరి గిరి స్థానికులు గట్ల సారంగపాణి, రాయబారపు జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.



## బుట్టాయిగూడెంలో కూల్చివేతలు

ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా జులిపించారు. అనుమతి లేని భవనాలను కూల్చివేశారు. ఈ క్రమంలో సీపీఐ కార్యాలయం నిర్మాణంలోనూ నిబంధనలను అతిక్రమించినట్లు గుర్తించారు. దీంతో సీపీఐ కార్యాలయాన్ని కూడా వేశారు. అయితే సీపీఐ నాయకులు, కార్యకర్తలు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. సీపీఐ నాయకులను అడ్డుకున్నారు. దీంతో ప్రభుత్వానికి, స్థానిక రెవెన్యూ అధికారులను వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళనకారులను చెదరగొట్టారు. తమ పార్టీ కార్యాలయాన్ని కూల్చివేయడం అక్రమమని మండిపడ్డారు. బుట్టాయగూడెంలోని ప్రభుత్వం భూముల్లో పలు పార్టీల లీడర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు దర్జాగా కబ్జాలకు పాల్పడుతుంటే పట్టించుకోని అధికారులు.. ప్రజల కోసం నిర్మించిన తప పార్టీ కార్యాలయాన్ని కూల్చివేయడమేంటని ప్రశ్నించారు.ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సీపీఐ కార్యాలయానికి భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు.

# భారత దేశం గొప్ప ఆర్థిక వేత్తను కోల్పోయింది –మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కి ఘన నివాళి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 27** :మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ శుక్రవారం మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోత్కు సుదర్శన్ లు మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడం వల్ల భారత దేశం గొప్ప ఆర్థిక వేత్తను, సంస్కరణ వాదిని కొల్పోయిందన్నారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా, వాణిజ్య మంత్రిగా ఆర్థిక సలహాదారుగా మన దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు.రెండుసార్లు భారత దేశానికి ప్రధానమంత్రిగా పని చేసిన ఘనత మన్మోహన్ సింగ్ కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ప్రభాకర్ రావు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నెరువట్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు మంకు రమేష్, కడారి జీవన్ కుమార్, ఎం.డి ఆఫీస్, ఎండి సుకుర్, రాచర్ల రవికుమార్, మంద తిరుమల్, ఆంజనేయులు, సాగర్ శ్రీనివాస్, కడలి శ్రీనివాస్, జమాల్పూర్ నర్సోజి, మాయ తిరుపతి, బియ్యాల రవికిరణ్, కృష్ణ, రంజిత్, ఎర్ర రాజు, నామిని ముత్తయ్య, దుర్గం ప్రభాకర్, రమేష్, ఏటూరు సత్యనారాయణ, నార్లపూర్ వెంకటేష్, డాక్టర్ లింగన్న, మాయ లింగయ్య, తాడవేన కనకయ్య, కొమురయ్య, కనకయ్య, జావిద్ ఖాన్, శ్రీనివాస్, నల్లుల శంకర్, చంద్రకాంత్, ముడారపు శేఖర్, మొగిలి రమేష్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం పత్తికి అందిస్తున్న కనీస మద్దతు ధరతో రైతులు లబ్ధి పొందాలి

## జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.డి.షాబొద్దిన్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 27** : ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ఒక ప్రకటనలో ఎం.డి.షాబొద్దిన్ తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో జిన్నింగ్ మిల్లులలో ఏర్పాటు చేసిన సి.సి.ఐ కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని,ఈ సంవత్సరం ఈ నెల 27వ తేదీ వరకు 1 లక్ష 6 వేల 420 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు.వాతావరణ మార్పులు,ఇతర కారణాల వలన పత్తి స్థితి మారిందని, నవంబర్ 2వ వారంలో ఎం.ఈ.సి.హెచ్.పద్ధతిలో కొనుగోలు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చెన్నూర్,లక్షెట్టిపేట కేంద్రాలలో పత్తి కొనుగోలు అధికారి డి.కె. నాయక్,కిరణ్ దేశ్ ముఖ్ ఆధ్వర్యంలో జనవరి 1, 2025 నుండి ఎం.ఈ.సి.హెచ్. పద్ధతిలో పత్తి కొనుగోలు జరుగుతుందని, బెల్లంపల్లి పరిధిలో ఇప్పటికే కొనుగోలు కొనసాగుతుందని తెలిపారు. 8 శాతం తేమ ఉంటే క్వింటాల్ కు 7 వేల 421 రూపాయలు, 9 శాతం ఉంటే 7 వేల 346 రూపాయలు,10 శాతం ఉంటే 7 వేల 272 రూపాయలు,11 శాతం ఉంటే 7 వేల 198 రూపాయలు,12 శాతం ఉంటే 7 వేల 124 రూపాయలు మద్దతు ధర అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులు తమ పత్తి పంటను ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

## ఏఐతో ఇందిరమ్మ ఇళ్ల అవకతవలకు చెక్

హైదరాబాద్, డిసెంబర్ 27, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ఇందిరవ ్మ ఇండ్ల స్కీమ్‌లో అవకతవకలను నివారించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని గృహనిర్మాణ కార్పొరేషన్ వినియోగించనున్నది. లబ్ధిదారుల ఎంపిక మొదలు చివరి దశలో పూర్తయ్యే నిర్మాణాన్ని పరిశీలించి నిధులను విడుదల చేసేంత వరకు ఈ టెక్నాలజీని వాడుకోనున్నది. దరఖాస్తుదారులు ఇంటి నిర్మాణం కోసం ఇచ్చిన వివరాల ఆధారంగా ఏఐ టెక్నాలజీ ఎప్పటికప్పుడు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసే అంశాలను పోల్చి చూడాలని భావిస్తున్నది. రూపొందించిన మోడల్‌కు అనుగుణంగా ఉన్నదో లేదో చూసి బిల్డర్ల(థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లు)కు నిధులను గృహనిర్మాణ కార్పొరేషన్ విడుదల చేయనున్నది.క్షేత్రస్థాయిలో సర్వేయర్ల మొదలు ప్రభుత్వ సిబ్బంది వరకు ఇచ్చే ఇన్‌పుట్స్, మొబైల్ యాప్‌లో ఇండ్ల నిర్మాణ పురోగతి తదితరాలను ఛాయాచిత్రాల ఆధారంగా జియో కోఆర్డినేటర్ల వివరాలను బేరీజు వేసుకుని లోపాల్లేకుండా వ్యవహరించే ఉద్దేశంతో కొత్త సాఫ్ట్ వేర్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని జోడించనున్నది. ఇంటి నిర్మాణానికి అనుగుణంగా విడతల వారీగా నిధులను విడుదల చేయనున్నందున ప్రజా ధనం దుర్వినియోగం కాకూడదన్న ఉద్దేశంతో ఈ విధానాన్ని అనుసరించనున్నది.దరఖాస్తుల్లోని వివరాల ఆధారంగా సర్వేయర్లు పాతి ఇంటిని లేదా స్థలాన్ని పరిశీలించి జియో కోఆర్డినేట్స్ మొదలు అన్ని వివరాలను సేకరించనున్నారు. వీటిని మొబైల్ యాప్‌లో పొందుపరుస్తారు. ఇది ఏఐ టెక్నాలజీతో పనిచేసే సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానమై ఉంటున్నందున ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతాయి. లబ్ధిదారులు పేర్కొన్న చిరునామా ప్రకారం ఇంటి నిర్మాణం జరుగుతున్నదా? పునాది నుంచి శ్లాబ్ లేదా రేకుల పైకప్పు వరకు మోడల్ ప్రకారమే ఉన్నదా? ఎంపికైన లబ్ధిదారులకు చెందిన ఇండ్లేనా? ఇలాంటి అంశాలను ధృవీకరించుకోడానికి ఒకవైపు క్షేత్రస్థాయి సిబ్బంది ఇచ్చే వివరాలు, మరోవైపు మొబైల్ ద్వారా తీసుకున్న ఫోటోలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయడం, వాటి జియో ఫెన్సింగ్ కో ? ఆర్డినేట్స్ సరిపోతున్నాయా? ఇలా మొత్తం నాలుగు దశల్లో ఏఐ టెక్నాలజీ పరిశీలిస్తుందిఇంటి అవసరాల కోసం జరుగుతున్న నిర్మాణమో కాదో కూడా వివిధ కోణాల్లోంచి సిబ్బంది తీసే ఫోటోల ఆధారంగా సాఫ్ట్‌వేర్ నిర్ధారిస్తుంది. ఈ ఫోటోలను ఎలా తీయాలో నిర్దిష్టమైన అవగాహనను సిబ్బందికి శిక్షణ ద్వారా ఉన్నతాధికారులు అందజేస్తారు. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం ఇండ్ల నిర్మాణం పారదర్శకంగా జరగడం, లబ్ధిదారులకు న్యాయం జరగడం, ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడడం, ప్రభుత్వ పథకం పక్కదారి పట్టకుండా చెక్ పెట్టడం, టార్గెట్ ప్రకారం వేగవంతంగా నిర్మాణ ప్రక్రియను పూర్తి చేయడం, ఇలా బహుళ ప్రయోజనాలను ఉద్దేశించి గృహనిర్మాణ శాఖ ఆర్టిఫిషియల్ టెక్నాలజీకి శ్రీకారం చుదుతున్నది.ఇండ్ల నిర్మాణంతో సంబంధం ఉన్న వివిధ విభాగాల అధికారులు ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఎప్పటికప్పుడు పనుల పురోగతిని తెలుసుకోడానికి ఏఐ టెక్నాలజీ దోహదపడనున్నది. అవసరమైన అనుమతులు ఇవ్వడం మొదలు లబ్ధిదారులకు వీలైనంత వేగంగా ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసి ఇవ్వడం ఈ ప్రక్రియలో కీలకమైన భాగం. దరఖాస్తులు వచ్చిన వెంటనే ఆ స్థలాన్ని లేదా పాత ఇంటిని గుర్తించడం, పునాది మొదలు శ్లాబ్ లేదా రేకుల పైకప్పు వరకు, ఇంటి గోడలు, ఇంటి విస్తీర్ణం, ఖాళీ స్థలం, అప్రూవ్ చేసిన డిజైన్, ఇలా అన్నింటినీ ఈ సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది.ఒక్కో అంశాన్ని గుర్తించడానికి నిర్దిష్టమైన మార్గదర్శకాలను సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చాలని గృహనిర్మాణ శాఖ భావిస్తున్నది. ఇలాంటి వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఫీల్డ్ స్టాఫ్ మొబైల్ యాప్‌లో పొందుపరిచే వివరాల ఆధారంగా సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ అవుతాయి. దీంతో ఏ గ్రామంలో ఎన్ని ఇండ్లు మంజూరయ్యాయి, లబ్ధిదారుల వివరాలు, ప్రస్తుతం నిర్మాణం ఏ దశలో ఉన్నదో తెలుస్తుంది. వీటికి అనుగుణంగా గృహనిర్మాణ శాఖ ఎంత మొత్తంలో బిల్డర్ (కాంట్రాక్టర్)కు నిధులు విడుదల చేయాలో విధాన నిర్ణయం తీసుకుంటుంది.కేవలం డబ్బుల కోసమే ఇంటి నిర్మాణం చేసినట్లు నమ్మించి గృహావసరాలకు బదులుగా ఇతరాలకు వినియోగించే తప్పుడు విధానాలకు చెక్ పెట్టడానికి వెసులుబాటు లభిస్తుంది.



**మలక్ పేట ప్రజాబలం ప్రతినిధి:** పంచగిరివాస అయ్యప్ప దేవాలయం మలక్ పేట. అయ్యప్ప రథ యాత్ర. నిర్వహించబడింది. ఈ కార్యాక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు మరియు ఛైర్మన్. రామియాదవ్ గురుస్వామి. మరియు నాని గురుస్వామి పాల్గొన్నారు. చింటూ గురుస్వామి. పవన్ గురుస్వామి. సతీష్ గురుస్వామి తదితరులు పాల్గోన్నారు.

# తెలంగాణలో ఏపీ కులాలు బిసిల్లో...

హైదరాబాద్ డిసెంబర్ 27 తెలంగాణలో బిసిల్లో అనేక కులాలు ఉన్నాయి. ఈ కులాలను ఏ, బి, సి, డి, ఈ గ్రూపులుగా విభజించారు.

గ్రూపు ఏలో

గ్రూప్- ఏలో సంచార తెగలు తదితర కులాలకు చెందిన వాళ్లు ఉంటారు.

గ్రూప్- బిలో వృత్తిపరమైన సమూహాలు ఉంటాయి.

గ్రూప్- సిలో క్రైస్తవమతంలోకి మారిన ఎస్సీలు ఉంటారు.

గ్రూప్- డిలో ఇతర కులాలు ఉన్నాయి.

గ్రూప్- ఈ లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన ముస్లిం కులాలు.

రాష్ట్రం ఏర్పడిన తరువాత, బిసి సంక్షేమశాఖ 2020లో అప్‌డేట్ చేసిన వివరాల ప్రకారం గ్రూప్- ఏలో 43, గ్రూప్ బిలో 23, గ్రూప్- సిలో ఒకటి, గ్రూప్- డిలో 31, గ్రూప్ -ఈలో 14 కులాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తంగా వెనుకబడిన వర్గాల్లో 112 కులాలు ఉన్నాయి.

గ్రూప్ -ఏలో ఉన్న కులాలు ఇలా?-

అగ్నికుల క్షత్రియ, పల్లి, వాడ బలిజ, బెస్త, జాలరి, గంగవర్, గంగపుత్ర, గోండ్ల, వన్యకుల క్షత్రియ (వన్నెకాపు, వన్నెరెడ్డి, పల్లికాపు, పల్లిరెడ్డి), నెయ్యాల, పట్టపు. బాల సంతు, బుడబుక్కల, రజక (చాకలి, వన్నార్), దాసరి, దొమ్మర, గంగిరెడ్లవారు, జంగం, జోగి, కాటిపాపల, మేదరి లేదా మహేంద్ర. మొండిరేవు, మొండిబండ, బండ, నాయీ బ్రాహ్మణ (మంగలి), మంగల, భజంత్రీ. వంశరాజ్/పిచ్చగుంట్ల, పాముల, పార్థి (నిర్షికరి), పంబల. దమ్మలి/దమ్మల/దమ్ముల/దమల, పెద్దమ్మవాండ్లు, దేవరవాండ్లు, ఎల్లమ్మవాండ్లు, ముల్యాలమ్మవాండ్లు, వీరముష్టి (నెట్టికోటల), వీరభద్రేయ వాల్మీకిబోయ (బోయ, బేదర్, కిరాటక, నిషాది, ఎల్లపి, ఎల్లపు, పెద్దబోయ). గుడాల, కంజర-భట్ట, కెప్మారే లేదా రెడ్డిక, మొండిపట్ట, నొక్కర్, పారికి మొగ్గుల, యాట, చోపేమరి, కైకడి, జోషినంది వాలాస్, వడ్డె (వడ్డీలు, వడ్డి, వడ్డెలు), మందుల, మెహతార్ (ముస్లిం), కునపులి, పాత్ర, పాల-ఈకరి, ఈకిల, వ్యాకుల, ఈకిరి, నాయనివారు, పాలేగారు, తోలగరి, కావలి, రాజన్నల, రాజన్నలు బుక్క అయ్యవారు, గోత్రాల, కాసికాపడి/కాసికాపుడి, సిద్ధుల సిక్లిగర్/సైకల్‌గర్, పూసలతో పాటు అనాథ పిల్లలు, కొన్ని ప్రాంతాలకే వెనుకబడిన తరగతులుగా పరిమితమైన కులాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం గ్రూప్- ఏలో చేర్చింది.

గ్రూప్ బిలో ఉన్న కులాలు

ఆర్య క్షత్రియ, చిత్తారి, గినియార్, చిత్రకార, నఖాస్, దేవాంగ, గౌడ్ (ఈడిగ, గౌడ (గమ్మల), కలాలి, గుండ్ల, శ్రీశయన(సెగిడి), దూదేకుల, లద్దాఫ్, పింజరి లేదా నూర్‌బాషా, గాండల తెలికుల, దేవతిలకుల, జాంద్ర, కుమ్మర లేదా కులాల, శాలివాహన. కిరకలభక్తుల, కైకోలన్ లేదా కైకల (సేన్‌గుండం లేదా సేన్‌గుంతర్), కర్ణభక్తులు, కురుబ లేదా కురుమ, నీలకాంతి, పట్కర్ (ఖత్రి). పెరిక (పెరిక బలిజ, పురగిరి క్షత్రియ), నెస్సి లేదా కుర్ణి, పద్మశాలి (శాలి, శాలివన్, పట్టుశాలి, సేనాపతులు, తొగట శాలి). స్వాకులశాలి, తొగటి/ తొగటన వీరక్షత్రియ, స్వకులసాలి, తొగట, తొగటి లేదా తొగట వీర క్షత్రియ. విశ్వబ్రాహ్మణ (ఔసుల, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్ల (వడ్ర, వడ్రంగి, శిల్పి), విశ్వకర్మ.లోధ్, లోధి, లోధా, బోంధిలి, ఆరె మరాఠీ, మరాఠా (బ్రాహ్మణేతరులు), ఆరాకలీస్, సురభి నాటకాలవాళ్లు. నీలి, బుడుభుంజల/ భుంజ్వా/ భద్‌భుంజాలను గ్రూప్ బిలో చేర్చారు.

గ్రూప్- సి ఉన్న కులాలు ఇలా?

గ్రూప్ సిలో క్రైస్తవ మతాన్ని స్వీకరించిన షెడ్యూల్ కులాలకు చెందిన వారు ఉన్నారు.

గ్రూప్- డిలో ఉన్న కులాల వివరాలు?

ఆరెకటిక, కటిక, ఆరె సూర్యవంశి, భట్రాజులు, చిప్పొళ్లు (మెర), హట్కర్, జింగర్, కచి, సూర్యబలిజ (కళావంతుల) గానిక, కృష్ణ బలిజ (దాసరి, బుక్క), మాతుర, మాలి (బారె, బారియ, మారార్, తాంబోలి). ముదిరాజ్, ముత్తరాశి, తెనుగోళ్లు, మున్నూరు కాపు, లక్కమారికాపు, పస్సి, రంగ్రేజ్/భవసార క్షత్రియ, సాధుచెట్టి, సాతాని (చాత్తాదశ్రీవైష్ణవ), తమ్మలి (బ్రాహ్మణేతరులు), శూద్రకులం. ఉప్పర లేదా సగర, వంజర (వంజరి), యాదవ (గొల్ల), ఆరె, ఆరెవాళ్లు, ఆరోళ్లు, అయ్యరక, నగరలు, అఘముడియన్, అఘముడియర్, అఘముడి వెల్లాలర్, అఘముడి ముదాలియర్. సొండి/సుండి, వరాల, శిష్టకరణం, వీరశైవలింగాయత్/ లింగబలిజ, కురిమి, అహిర్/అహిర్ యాదవ్, గోవిలి/గౌలి, కుల్లకడగి/కుల్లెకడిగి/చిట్టెపు, సారోల్లు/సోమ వంశ క్షత్రియులు ఉంటారు.

గ్రూప్- ఈలో ఉన్న కులాలు?

అచ్చుకట్టలవాండ్లు, సింగలి, సింగంవాళ్లు, అచ్చుపానీవాళ్లు, అచ్చుకట్టువారు, అచ్చుకట్లవాండ్లు, అత్తర్‌సాయెబులు, అత్తరోల్లు, ధోబీ ముస్లిం/ముస్లిం ధోబీ/ధోబీ ముసల్మాన్, తురకచాకల లేదా తురకసాకల, తురకచాకలి. తుళుక్కవన్నన్, సాకల, సాకల లేదా చాకలస్, ముస్లిం రజక, ఫఖీర్, ఫఖీర్ బుడబుక్కి, ఘంటి ఫకీర్, ఘంటా ఫకీర్లు, తురక. బుడబుక్కి, దర్వేష్, ఫకీర్, గారడీ ముస్లిం, గారడీ సాయెబులు, పాముల వాళ్లు, కాణి/కట్టువాళ్లు, గారడోళ్లు, గారడిగా. గోసంగి ముస్లిం, ఫకీర్ సాయెబులు, గుడ్డి ఎలుగువాళ్లు, ఎలుగుబంటు వాళ్లు, ముసల్మాన్ కీలు గుర్రాల వాళ్లు, హజ్జాం, నాయి, నాయి ముస్లిం, నవీద్. లబ్బి, లబ్బై, లబ్బన్, లబ్బా, ఫకీర్ల, బోర్‌వాలే, డీరఫకీర్లు, బొంతల, ఖురేషి, కురేషి/ఖురేషి, ఖసాబ్, మరాఠీ ఖసాబ్, ముస్లిం కటిక, ఖటిక్ ముస్లిం. షేక్/ షైక్, సిద్ధి, యాబా, హబ్షి, జాసి, తురకకాశ, కక్కుకొట్టే జింక సాయెబులు, చక్కిటకానేవాలే, తెరుగాడుగొంతలవారు, తిరుగటిగంట్ల, పత్థర్‌పోడ్లు, చక్కెటకారే, తురకకాశలు ఈ గ్రూప్‌లో ఉన్నారు. గ్రూప్ ఏ నుంచి గ్రూప్ ఈలో ఉన్న కులాలు కొన్ని ప్రాంతాల్లో వెనుకబడిన తరగతులుగా గుర్తించారు.

రాష్ట్రంలో బిసిలకు 29 శాతం రిజర్వేషన్‌లు

ప్రస్తుతం రాష్ట్రంలో బిసిలకు 29శాతం రిజర్వేషన్‌లను అమలు చేస్తున్నారు. గ్రూప్- ఏకు 7 శాతం, గ్రూప్- బికి 10శాతం, గ్రూప్ సికి 1 శాతం, గ్రూప్- డికి 7 శాతం, గ్రూప్-ఈలకు 4శాతం రిజర్వేషన్‌లను కేటాయించారు. ప్రస్తుత కులగణన తరువాత ఆయా కులాల సామాజిక, ఆర్థిక, జనాభా, విద్య, ఉపాధి తదితర అంశాలను బేరీజు వేసుకున్న తరువాత ఈ రిజర్వేషన్‌లలో ప్రభుత్వం మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది.

దీంతోపాటు ఆయా కులాల జీవన స్థితిగతుల ఆధారంగా ఒక గ్రూపులో ఉన్న కులాలను ఇంకో గ్రూపులోకి కూడా మార్చే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది.

బిసి కమిషన్ సూచనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం. ఇప్పటికే స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావును నియమించింది.

# పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కోసం ఉద్యమం

హైదరాబాద్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీళ్లు వచ్చే పరిస్థితి లేదని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. పాలమూరు,రంగారెడ్డి ద్వారా 12 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇవ్వడం లేదు. డీపీఆర్ కేంద్ర ప్రభుత్వం వెనక్కి ఇచ్చింది. బిఆర్ఎస్ హయాంలోనే పాలమూరు,రంగారెడ్డి ట్రయల్ రన్ పూర్తి అయింది. ఏపీ ప్రభుత్వం పాలమూరు,రంగారెడ్డిపై కృష్ణా ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లాకు చెందినవాడు. పాలమూరు పేరు చెప్పుకుని డబ్బులు తెచ్చుకుని జిల్లాను ఉమ్మడి రాష్ట్రంలో ఎండబెట్టారని అన్నారు.

పాలమూరు జిల్లా నుండి 14 లక్షల మంది వలసలు వెళ్లారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పంపిన డీపీఆర్ కు పర్యావరణ శాఖ అనుమతులు ఇచ్చింది

నాగార్జున సాగర్ ఎగువున ఉన్న 45 టీఎంసీలు తెలంగాణ వాడుకోవాలని తీర్పు ఉంది. 90 టీఎంసీల నికర జలాలు తెలంగాణకు ఉన్నాయి. క్రిష్ణా ట్రిబ్యునల్ లో ఏపీ ప్రభుత్వం తప్పుడు ఫిర్యాదులు చేసింది. తెలంగాణకు రావాల్సిన మూడు అనుమతులను ఏపీ ప్రభుత్వం ఆపింది. పాలమూరు,రంగారెడ్డి పూర్తి అయితే జిల్లా సస్యశ్యామలం అవుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉండి పాలమూరు జిల్లాను దత్తత తీసుకుని ఏం చేయలేదు. తెలంగాణ,ఏపీ రాష్ట్రాలు సమన్వయంతో ఉండాలి. ప్రధాని మోదీ పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టుపై పెత్తనం చేయాలని ఏపీ ప్రభుత్వం చూస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టులో ఉన్న నీటిని తాము వాడుకోవాలని ఏపీ ప్రభుత్వం చూస్తోంది. పాలమూరు,రంగారెడ్డి ఎప్పుడు పూర్తి అవుతుందో చెప్పాలని అన్నారు.

ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు పరిష్కరించుకోవాలి పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని మోదీని సీఎం రేవంత్ రెడ్డి అడగాలి. మహబూబ్ నగర్,రంగారెడ్డి నల్గొండ జిల్లాలకు పాలమూరు రంగారెడ్డి ద్వారా నీళ్లు వస్తాయి. ప్రభుత్వం కక్షసాధింపులు బంద్ చేసి పరిపాలనపై దృష్టి పెట్టాలి. యాదాద్రి టెంపుల్ లో కొద్ది దూరం ఉన్న బ్రిడ్జిని సంవత్సరం నుండి పూర్తి చేయడం లేదు. క్యాబినెట్ మొత్తం ప్రధానమంత్రిని కలుస్తారా అనేది తేల్చుకోండి. పాలమూరు,రంగారెడ్డిపై అఖిలపక్షాన్ని ఢీల్లి తీసుకువెళ్లాలి. పాలమూరు ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని క్షమించరు. ఎవరి ప్రభుత్వంలో మేలు జరిగిందో పాలమూరు ప్రజలు గమనించాలి. పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టు కోసం రైతు సంఘాలతో కలిసి ఆందోళనలు చేస్తామని అన్నారు.

# నగరంలో గెహిస్ లీగల్ సర్వీసెస్ ప్రారంభం

అంతర్జాతీయంగా చట్టపరమైన విషయాలలో సేవలందిస్తున్న గెహిస్ సంస్థ దేశంలో రెండవ అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్ నగరంలో నాలెడ్జ్ పార్క్ లో ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ప్రిన్సిపల్ ఫౌండర్ ఎన్.ఎం గెహి తెలిపారు. బంజారా హిల్స్ లోని హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ తో కలిసి సంస్థకు సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్ ఎం గెహి మాట్లాడుతూఅగ్రరాజ్యం అమెరికాకు వెళ్లే వారికి ఎదురయ్యే ఇమిగ్రేషన్ సమస్యలతో పాటు అక్కడ నివసిస్తూ న్యాయపరమైన చిక్కుల్లో పడ్డ వారికి తమ సంస్థ సేవలు అందిస్తుందని చెప్పారు. గేహిస్ ముంబాయి తర్వాత రెండవ అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయడం గర్వకారణమని అద్దంకి దయాకర్ అన్నారు. తెలుగువారు అత్యధికంగా అమెరికాలో నివసిస్తున్నారని అలాంటివారికి అక్కడ తలెత్తే సమస్యలకు సరైన సలహాలు అందిస్తూ పరిష్కారాల కోసం పనిచేస్తున్న సంస్థ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

## వాస్తు దోషం పేరుతో పిల్లర్ కూల్చివేత భవనం కూలి వ్యక్తి మృతి

బెంగళూరులో ఇటీవల షాకింగ్ ఘటన జరిగింది. ఓ వ్యక్తి మూఢనమ్మకం వల్ల తన ఇంటిని కోల్పోయాడు. తన ఇంటికి వాస్తు దోషం ఉందని ఒక పండితుడు చెప్పాడు. ఇంటి నుంచి ఒక పిల్లర్ తొలగిస్తే.. నీ ఇంట్లో కనకవర్షం కురుస్తుంది తెలిపాడు. దీంతో ఇంటి యజమాని పండితుడు చెప్పినట్టు ఒక పిల్లర్ ను తొలగించాడు. ఈ క్రమంలో బిల్డింగ్ మొత్తం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో సదరు యజమాని రోడ్డుమీద పడ్డాడు. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు

## గురజాల వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆరోపణ

గురజాల, గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుంగలో తొక్కారని గురజాల వైసిపి మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి విమర్శించారు. వైసీపీ రాష్ట్ర పార్టీ ఇచ్చిన మేరకు కరెంటు చార్జీల పెంపుదలకు నిరసనగా శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన గురజాలలో నిరసన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ వైసీపీ కార్యాలయం నుండి కరెంట్ ఆఫీస్ వరకు సాగింది. అనంతరం విద్యుత్ ఏఇ మస్తాన్వలికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ వచ్చిన ఆరు నెలలోనే ప్రభుత్వ పనితీరు బయట పడింది అన్నారు. కరెంట్ ఛార్జీలు పెంచమని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసారు అన్నారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రంలో సామాన్యుడు భరించలేని విధంగా కరెంట్ ఛార్జీలు పెంచారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కాసు మహేష్ రెడ్డి తో పాటు పిడుగురాళ్ల మాజీ జెడ్పిటిసి సభ్యులు వీరభద్రుని రామిరెడ్డి, వైసిపి పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎనుముల మురళీధర్ రెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వరరావు, కుక్కమూడి అన్నారావు, కర్ర కోటేశ్వరరావు, చల్లా కాశి బాబు, మన్నెం ప్రసాద్, పద్మ, యశోద, దుర్గా, పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం, గురజాల మండలాలకు చెందిన వైసీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాశ్వత అన్న ప్రసాద పథకానికి విరాళం



శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి జె. నాగేశ్వరరావు, మాచర్ల, పల్నాడు జిల్లా వారు 1,01,116/- లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.

## విద్యుత్ చార్జీల పెంపుపైఆందోళన కార్యక్రమం

## మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ

పత్తికొండ నూర్: )విద్యుత్ చార్జీల పెంపుపై పత్తికొండ పట్టణం లో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ముందుగా అంబేద్కర్ కూడలిలో మాజీ పిఎం మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం భారీ ర్యాలీతో బయలుదేరి నాలుగు స్తంభాల కూడలిలో ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల లోపే దాదాపుగా నవంబర్ డిసెంబర్ నెలలో కరెంటు బిల్లులు దాదాపుగా 15,400 కోట్లు పెంచి ప్రజల మీద భారం పెట్టారు. సంపద సృష్టిస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు పత్తికొండ మీటింగ్లో మాట్లాడిన విషయాల్ని గుర్తు చేస్తూ సంపద అంటే ఇదేనా అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేయాలని చేయని పక్షంలో ప్రతిపక్షం ప్రభుత్వం మెడలు వంచి పనిచేపిస్తామని తెలియజేశారు. అనంతరం కరెంట్ ఆఫీస్




**నకిరేకల్ ప్రజాబలం ప్రతినిధి:** నకిరేకల్ పట్టణంలోని మూసి రోడ్డు నందు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వారి అఖిల భారత పెన్షనర్స్ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న.,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

# వైసీపీ దొంగ ఏడుపు ఏడుస్తోంది

## జగన్ జల్సా పథకాల్ని ప్రజలు చూసివారిని 11 సీట్లకే పరిమితం చేశారు

## మంత్రి గుమ్మడి సంధ్యారాణి

కరెంటు ఛార్జీలు విపరీతంగా పెంచేస్తున్నారని వైసీపీ దొంగ ఏడుపు ఏడుస్తోందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...ఆరు నెలల పాలనలో చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధిని చూసి ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ అండ్ పార్టీ కడుపు మంటతో రగిలిపోతోంది. జగన్ జల్సా పథకాలను ప్రజలు చూసి వైసీపీని ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారు. సాక్షి పత్రికకు నిబద్ధత, నిజాయితీ ఏమీ లేవు. అబద్ధాలను అలవోకగా చెప్పగలిగే ఛానల్ సాక్షి ఛానల్. వైసీపీ నాయకులు కరెంటు ఛార్జీలు విపరీతంగా పెంచేస్తున్నారని దొంగ ఏడుపు ఏడుస్తున్నారు. గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం పది సార్లు కరెంటు బిల్లులు పెంచింది. సైకో జగన్ పది సార్లు కరెంటు బిల్లులు పెంచి వినియోగదారులపై 32 వేల కోట్ల భారాన్ని మోపారు. అందుకే ప్రజలు వైసీపీని, జగన్ ను ఛీకొట్టి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారు. వైసీపీ ప్రభుత్వం నీతి, నిజాయితీగా పాలించినట్లు ధర్నాలు నిర్వహించడం సిగ్గుచేటు. జగన్ ధర్నాలు చేస్తామనటాన్ని చూసిన ప్రజలు వైసీపీకి సిగ్గులేదని చెబుతున్నారు. 2014లో కరెంటు 22.5 మిలియన్ యూనిట్ల లోటుతో చంద్రబాబునాయుడు గారికి అప్పగిస్తే... 2014 నుంచి 2019 అంతకు ముందున్న లోటు బడ్జెట్ విద్యుత్ ను మిగులు బడ్జెట్ విద్యుత్ గా మార్చి జగన్ చేతిలో పెట్టడం జరిగింది. హిందూజా సంస్థ నుంచి 10 ఎకరాల భూమిని తీసుకొని వారికి 14 వేల కోట్లను అప్పణంగా అప్పగించారు. ఇది ప్రజల సొమ్ము. ప్రజల సొమ్ము తినడమే వైసీపీ ప్రభుత్వం చేసిన పని. వైసీపీ నాయకుల్లో ఏ1, ఏ2, ఏ3 ముద్దాయిలు ఉన్నప్పటికి వారిని అరెస్టు చేయలేదు. వైసీపీ నాయకుల్లో అనేక మంది అనేక తప్పులు చేశారు. అయినా వారిలో అనేక మంది అరెస్టవలేదు. వైసీపీ హయాంలో నాయకులు అతి దారుణంగా ప్రవర్తించారు. సోషల్ మీడియాలో అమ్మాయిలను కించపరుస్తూ పోస్టులు పెట్టారు. అమ్మాయిల ఫొటోలు మార్ఫింగ్ చేసి పోస్టులు పెట్టారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రిని కూడా దూషిస్తూ పోస్టులు పెట్టారు. అయినా అరెస్టు చేయకూడదనడం ఇదెక్కడి న్యాయం? చంద్రబాబునాయుడు ఒక్క సైగ చేస్తే చాలు వైసీపీ నాయకులు మొత్తం జైల్లో ఉంటారు. చంద్రబాబు పద్ధతిగా ప్రవర్తిస్తారు. ప్రజలు మనకు పట్టం కట్టారు. వారిని రక్షించాల్సిన బాధ్యత మనపై ఉందనేది చంద్రబాబు ఆలోచన. కక్షసాధింపు చర్యలు వద్దని చంద్రబాబు స్వయంగా చెప్పారు. చంద్రబాబు అనుకుంటే జగన్ కు చెందిన సాక్షి టీవీ, ఛానల్ లు ఉండవు. స్మశానాలపై కూడా వైసీపీ రంగులు వేసుకున్నారంటే వైసీపీకి రంగుల పిచ్చి ఏ మేరకు ఉందో అర్థమౌతోంది. గుళ్లూ, బళ్లు దేన్నీ వదలలేదు. రంగుల పిచ్చితో రూ.3 వేల కోట్లు వృధాగా ఖర్చు చేశారు. తాడేపల్లి ప్యాలెస్ లో వైసీపీ నాయకులు తిన్న ఎగ్ పఫ్ లకే రూ. 3.5 కోట్లు ఖర్చు చేశారు. మీరా టీడీపీ ప్రభుత్వం గురించి మాట్లాడేది? విద్యుత్ చార్జీల పెంపు జగన్ పాపమే..ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ రంగం గత కొన్నేళ్లుగా తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 2014లో టీడీపీ అధినేత చంద్రబాబు పాలన సమయంలో రాష్ట్రం 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటుతో ఉన్నప్పటికీ, 2019 నాటికి రాష్ట్రం మిగులు విద్యుత్తును సాధించింది. అయితే, జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ రంగంలో అనేక సమస్యలు తలెత్తాయి. పలు అవినీతి ఆరోపణలు, కక్షసాధింపు చర్యలు విద్యుత్ రంగ అభివృద్ధిని పునరంగీకరించాయి.చార్జీలను పెంచి ప్రజలపై మోపిన భారం అంతా ఇంతా కాదు : జగన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ ఛార్జీల పెంపు నేరుగా ప్రజలపై ప్రభావం చూపింది. 5 ఏళ్లలో పది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై సుమారు రూ.28 వేల కోట్ల భారాన్ని మోపారు. ఈ పెంపు వివిధ వర్గాల వినియోగదారులపై ప్రభావం చూపింది. ముఖ్యంగా నివాస, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల పెంపు అంతా ఇంత కాదు. సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తి పద్ధతులపై కక్ష సాధించి, పీపీఏలను రద్దు చేశారు. ఈ చర్యల వల్ల రాష్ట్రంలో రాబడి తగ్గి, విద్యుత్ ఉత్పత్తిదారులు ఆర్థికంగా నష్టపోయారు. సోలార్ ప్లాంట్లను ధ్వంసం చేయడం, వీటి యజమానులను నిరుత్సాహపరచడం వల్ల రాష్ట్రానికి మిగులు విద్యుత్ అవకాశాలు దూరమయ్యాయి. థర్మల్ విద్యుత్ ప్లాంట్ల వినియోగంలో కూడా జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దేశంలో వృద్ధులకు ఎక్కడైనా నెలకు రూ. 4 వేలు పింఛన్ ఇచ్చే ప్రభుత్వం ఎక్కడైనా ఉందా? ఒక్క టీడీపీ ప్రభుత్వమే 4వేలు పింఛన్ ఇస్తోంది. ఇది మన ప్రభుత్వమని గుండెలపై చేయి వేసి చెప్పగలం. వికలాంగులకు 6 వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైనవారికి 10 వేలు ఇస్తున్నాం. వైసీపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ఛిన్నా భిన్నం చేసి వెళ్లింది. అయినా మనం చెప్పిన ప్రకారం 4 వేలు పింఛన్ ఇస్తున్నాం. 10 సార్లు విద్యుత్ భారం పెంచితే వారిపై ఎంత బరువు మోపినట్లు? ఎస్సీ, ఎస్టీలకు మళ్లీ మనం ఫ్రీ కరెంటు ఇస్తున్నాం. గత ఐదు సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీలు బిల్లులు కట్టుకున్నారు. ప్రస్తుతం రెండున్నర నెలలకు ఒకసారి వచ్చే విద్యుత్ బిల్లు వైసీపీ హయాంలో నెలకే వచ్చేది. టీడీపీ ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్తును అందిస్తుంది. సోలార్ విద్యుత్ ను వాడాల్సిందిగా గ్రామాలలో తెలుపుతున్నాం. సోలార్ ను ఫ్రీ గా బిగించే ఏర్పాట్లు కూడా చేస్తున్నాం. దీనివల్ల ప్రజలకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచించారు.

# తాగునీటి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

## ఎంసీసీ ఫిర్యాదులను సమీక్షించిన జలమండలి ఎండీ




బోర్డు దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోజున జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్‌తో కలిసి ఓ అండ్ ఎం అధికారులతో ఎంసీసీ(మెట్రో కస్టమర్ కేర్) ఫిర్యాదులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అధికారులు సొంతంగా ప్రణాళికలు వేసుకుని ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. తాగునీటి సరఫరా, కలుషిత నీరు సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మరోవైపు రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మ్యాన్ హోళ్లు ఉప్పొంగితే వెంటనే పూడిక తీయాలని వివరించారు. వాటి నుంచి తీసిన వ్యర్థాల్ని (సిల్ట్) వెంటనే అక్కడ్నుంచి తొలగించాలని ఆదేశించారు. ఎక్కడైనా మ్యాన్ హోళ్లు ధ్వంసమైతే వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలని, మ్యాన్ హోళ్ల కవర్లు కనిపించని స్థితిలో ఉన్నా.. వెంటనే కొత్త మూతలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంసీసీలో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారం వివరాలపై ఆరా తీశారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న 90 రోజుల డీసిల్టింగ్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# పార్లమెంట్ లో బి.సి. బిల్లుకై చంద్రబాబు కేంద్రంపై వత్తిడి పెంచాలి

## ఆంధ్ర ప్రదేశ్ బి.సి సంక్షేమ సంఘం డిమాండ్

## ఆంధ్ర ప్రదేశ్ బి.సి సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మద్దుల కోటేశ్వర్ రావు నియామకం

హైదరాబాద్ డిసెంబర్ 27 పార్లమెంట్ లో బి.సి బిల్లు పెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్ బి.సి సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకొని వెళ్ళి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకొని రావాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు బి.సి పక్షాన నిలబడి బి.సి బిల్లు పెట్టిస్తే చరిత్రలో నిలుస్తారని అభిప్రాయ పడ్డారు. కేంద్రంలో బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టడానికి, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం బిసి భవన్ లో సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకనమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జాతీయ బి.సి సంక్షేమ సంఘ , రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు.తెలుగు రాష్ట్రాలలో ఉన్న మాదిరిగా అన్ని రాష్ట్రాలలో ఫీజు రియంబర్స్మెంట్ స్కీం, ప్రతి ఒక్కరికి స్కాలర్ షిప్ మంజూరు చేయుట, హాస్టల్ లో మంజూరు చేయుట, గురుకులాల మంజూరు, బీసీ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయడం లాంటి స్కీములు దేశమంతట న్ని రాష్ట్రాలలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.బిసిల డిమాండ్లు బీసీల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తానన్నారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ బి.సి సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మద్దుల కోటేశ్వర్ రావు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సమావేశం లో ఆంధ్ర ప్రదేశ్ బి.సి సంక్షేమ సంఘ రాష్ట్ర అద్యక్షులు వై.నాగేశ్వర్ రావు, ఆది శేషు,మల్లేష్,లక్ష్మణ్,జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

# అల్లు అర్జున్‌తో నన్ను పోల్చకండి : అమితాబ్ బచ్చన్



ముంబై డిసెంబర్ 27 పుష్ప 2 సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్పై బాలీవుడ్ బిగ్ బీ అమితాబ్ బచ్చన్ మరోసారి ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే అల్లు అర్జున్‌పై పలు సందర్భాల్లో బిగ్ బీ ప్రశంసలు కురిపించగా.. తాజాగా మరోసారి బన్నీ గురించి అమితాబ్ మాట్లాడారు. 15 ఏండ్లుగా 'కౌన్ బనేగా కరోడ్‌పతి' ప్రోగ్రామ్‌కు అమితాబ్ హోస్ట్‌గా వ్యవహరిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ షో 16 సీజన్ రీసెంట్‌గా ప్రసారమవుతోంది.ఈ షో తాజా ఎపిసోడ్లో కోల్కతాకు చెందిన ఓ గృహిణి కంటెస్టెంట్‌గా హాజరు అయ్యింది. అయితే షోలో భాగంగా అమితాబ్‌తో మాట్లాడుతూ.. తనకు అల్లు అర్జున్, అమితాబ్ అంటే ఇష్టమని తెలిపింది. దీనికి బిగ్ బీ స్పందిస్తూ.. నేను కూడా అల్లు అర్జున్‌కి అభిమానిని. ఆయనతో నన్ను పోల్చవద్దు. ఆయన నటించిన పుష్ప 2 చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా మీరు చూడకపోతే వెంటనే చూసేయండి తాను ఎంతో టాలెంటెడ్ యాక్టర్. తనకు వచ్చిన గుర్తింపులన్నిటికీ పూర్తి అర్హుడు అంటే బిగ్ బీ చెప్పుకొచ్చాడు.

# స్వామియే శరణం అయ్యప్ప... నామస్మరణతో కోరుట్ల

## అంబరాన్నంటిన అయ్యప్ప జాతర సంబరాలు...

## భారీగా తరలివచ్చిన అయ్యప్ప స్వాములు, భక్తులు...

## స్వామివారికి దర్శించుకున్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

కోరుట్ల స్వామియే శరణం అయ్యప్ప... నామస్మరణతో కోరుట్ల పట్టణం శుక్రవారం పులకరించి పోయింది..పట్టణంలోని అల్లమయ్య గుట్టపైగల జ్ఞాన సరస్వతి శనేశ్వర సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 27వ తేదీనకేరళ రాష్ట్రంలోని శబరిమల పుణ్యక్షేత్రంలో జరిపే మండల పూజ మహోత్సవాన్ని పురస్కరించుకొని కోరుట్ల పట్టణ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 27వ తేదీన నిర్వహించే మండల పూజ మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అయ్యప్ప మండల పూజ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, అభిప్రాయాలు మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్ లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శబరిమలలో జరిగే మండల పూజ మహోత్సవాన్ని కోరుట్ల పట్టణ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించడం అభినందనీయమని అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండి సుఖ సంతోషాలతో జీవించాలని స్వామివారిని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతికి సుబ్రహ్మణ్యస్వామికి అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం గణపతి సుబ్రహ్మణ్య స్వామి అయ్యప్ప స్వామి నీ పలు రకాల పూలతో భక్తులకు కనువిందుగా ఉండే విధంగా అలంకరించారు అనంతరం పామిడి వెలిగించారు.. ఇందులో భాగంగా ఉదయం 5 గంటల నుండి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.. ఈ జాతర మహోత్సవానికి కోరుట్ల పట్టణ పరిసర గ్రామాల నుండి సుమారు 50 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.. అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పడిపూజ కార్యక్రమాన్ని తిలకించారు.. ఈ జాతర మహోత్సవంలో ఎలాంటి అవాచనీయ సంఘటనలు జరగకుండా డివిజన్ పోలీస్ అధికారి రాములు, కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ లు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.. అయ్యప్ప స్వాములు భక్తులు చేసిన భజన స్వామియే శరణం అయ్యప్ప శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పాలెపు రాము శర్మ, ఆలయ గౌరవాధ్యక్షులు చిత్రాల నారాయణ, గురు స్వామి అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, గురు స్వామి, కార్యవర్గ సభ్యులు, అన్నదాన కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు మహిళలు, చిన్నారులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# హెల్మెట్ ధరిస్తేనే తలకు రక్షణ

గుంటూరు శుక్రవారం నాడు పోలీసులు జిల్లా పోలీస్ పరేడ్ మైదానం నుండి హెల్మెట్ అవగాహన నిమిత్తం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. తప్పక హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలనే ప్రధాన ఉద్దేశంబితో సివిల్ మరియు ట్రాఫిక్ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది హెల్మెట్ ధరించి, ద్విచక్ర వాహనాలు నడిపించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణమూర్తి, , హనుమంతు, సీఐలు,ఆర్ ఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com